Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 60 • సంచిక: 226 • ఆదివారం 20 ఆగస్టు 2017 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ చతుర్దశి రా. 1.59 వరకు, అనంతరం అమావాస్య; నక్షత్రం: పుష్యమి సా. 6.01 వరకు, అనంతరం ఆశ్లేష;
అమృతకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: సా. 4.47 నుండి 5.38 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు; విశిష్టత: మాస శివరాత్రి

అదే పోరు... అదే పంథా...





ఉన్నత విలువలే లక్ష్యం

ప్రజా సంక్షేమమే పరమావధి

ఉద్యమాల ఖిల్లా ఖమ్మంలో

ఆంధ్రప్రభ మరో మజిలీ

నూతన ప్రచురణా కేంద్రం ప్రారంభం

వివరాలు 3లో

అభివృద్ధి చేస్తుంటే ఉరి తీస్తారా?!



- కాల్చి చంపే సంస్కృతా మనది?
- జగన్ భాష దారుణం, దుర్మార్గం
- ఏడాది పదవికి ఇంత పూనకమా?
- ఇంటికి పెద్ద కొడుకుగా ఆదరించండి
- జనహితం కోసమే రాజకీయం
- నంద్యాలకు ఎంతో చేశా, ఇంకా చేస్తా..
- ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు

నంద్యాల, ఆంధ్రప్రభ: తాను ప్రగతి పిపాసినని, నంద్యాలలో పనులను పూర్తి చేయించే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అందరి అభివృద్ధిని కాంక్షించి ఆదాయాన్ని పెంపొందించడం కోసం శ్రమిస్తుంటే, తనను కాల్చి చంపాలంటూ జగన్మోహన్ రెడ్డి పిలుపునివ్వడంలోని ఔచిత్యాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలలో ప్రచారంలో భాగంగా శనివారం నంద్యాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ బాగు చేయాలని చేయాలని తపన పడే తనను ఉరితీయాలని అనడం ఎంతవరకు సబబు అన్నారు. తనను ఇంటికి ఒక పెద్దకొడుకుగా ఆశీర్వదించాలని కోరారు. తాను ఎప్పుడూ ప్రజాహితం కోసం రాజకీయం చేస్తానని తెలిపారు. అసలు ప్రజలకు నేర్పాల్సింది కాల్చిచంపే సంస్కృతా అని ప్రశ్నించారు. ఒక కుటుంబ సభ్యుడిగా పని చేస్తుండగా, తననే విమర్శిస్తున్నాడన్నారు. ఇలాంటి పరిస్థితిలో మనం కాల్చాల్సిన పనిలేదు, మన ఓట్లతోనే వాళ్ళను ఖతం చేద్దాం అని పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ఏ భాష మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, పనులు చేస్తున్న తనను కాల్చి చంపుతానని, బట్టలూడదీస్తానని చెప్పడం దుర్మార్గమన్నారు. 'ఎవరైనా మన ఇళ్ళల్లోని వాళ్ళు ఆ మాటలు అంటే ఎలా వుంటుంది? మన పిల్లలు ఆ భాషను నేర్చుకుంటే పరిస్థితి ఏమిటన్నారు. తల్లి, తండ్రి చనిపోయిన పిల్లలకు తోడుగా వుండాల్సింది పోయి వైసీపీ పోటీకి దిగింది' అంటూ చంద్రబాబు మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా నిలవాల్సిన బాధ్యత నంద్యాల ప్రజలపై వుందన్నారు. రాష్ట్రంలో నడుస్తున్నది తెదేపా ప్రభుత్వం అని, గెలిచి రెండేళ్ళలో శిల్పా మోహన్ రెడ్డి ఏమి పొడుస్తాడని ఆయన ప్రశ్నించారు. సాధారణ ఎన్నికలకు మరో రెండు సంవత్సరాలు మాత్రమే వుందని, ఒకవేళ ముందస్తుగా వచ్చే ఏడాదిలో డిసెంబర్‌లో ఎన్నికలు వస్తే మరో ఏడాది పాటే పదవి ఉంటుందని సి.ఎం అన్నారు. ఒక ఏడాది ఒక ఏడాది వుండే ఎమ్మెల్యే వైసీపీకి అంతగా పూనకం ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. దీనావస్థలో వున్న భూమా కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలను ఆదుకోవాలని ఆయన కోరారు. గతంలో ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలిపిన ఘనత తనదేనన్నారు. నంద్యాలలో వీధిలైట్లు వెలుగుతున్నాయో లేదో కూడా తాను విజయవాడలో కూడా తెలుసుకోగలనన్నారు.

అన్ని పనులు చేశాం, ఇంకా చేస్తాం

నంద్యాలలో అన్ని పనులు చేశామని, అవసరాన్ని బట్టి ఇంకా కావాల్నివస్తే మరిన్ని పనులు చేసేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో మతం పేరిట దాడులు జరుగవన్నారు. క్రిస్టియన్లల్లోనూ పేదవారు వున్నారన్నారు. వారిని ఆదుకుందామంటూ ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలను మోసగించడానికే గెడ్డాలు, బుగ్గలు పట్టుకుంటాడని ఆయన జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్ష నేత దాదాపు పదిహేను రోజుల నుంచి నంద్యాలలోనే వున్నాడని, కాల్చేయాలి, చంపేయాలని మాట్లాడుతున్నాడని, మాటలు అనే ముందు ఆలోచించాలన్నారు. వస్తువులపై తనకు వ్యామోహం లేదని, అందువల్లే తనకు గడియారం, ఉంగరాలు ➪ 7వ పేజీలో...

పతాక స్థాయికి... ప్రచారం - 2లో



ఆయేషా కేసులో

సిట్‌కు ఎదురుదెబ్బ

పునర్విచారణ పిటిషన్ తిరస్కరణ



ఎన్డీయేలోకి జేడీయూ

- జాతీయ కార్యవర్గం నిర్ణయం
- లాలూ ర్యాలీకి హాజరైతే వేటే
- శరద్ యాదవ్‌కు వార్నింగ్



అక్రమ టపాసుల యూనిట్‌లో పేలుడు

- ఐదుగురి దుర్మరణం
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు

7లో

పట్టాలు తప్పిన ఉత్కళ్

- యూపీలోని ముజఫర్‌నగర్ వద్ద ప్రమాదం
- 23 మంది మృతి
- 50 మందికి పైగా గాయాలు
- పల్టీ కొట్టిన 14 బోగీలు, కొన్ని ఇళ్లలోకి...
- పలువురికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- హుటాహుటిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు... 35 అంబులెన్స్‌లు
- మృతులకు ఒడిషా సర్కార్ రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా, రైల్వేశాఖ మరో రూ.3.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు
- రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ దిగ్భ్రాంతి

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు కన్నీరు మిగిల్చింది. ఒడిశాలోని పూరీ నుంచి హరిద్వార్ వెళుతున్న రైలు శనివారం సాయంత్రం పట్టాలు తప్పిన ఘటనలో 23 మంది ప్రయాణికులు మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. సుమారు 50 మందికి పైగా తీవ్రంగా గాయాల పాలైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. రాష్ట్ర అధికారులతో పాటు రైల్వే అధికార యంత్రాంగం సంఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. విపత్తు నిర్వహణ బృందాలు కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటివరకు 80 మంది ప్రయాణీకులను రక్షించినట్లు ఎన్డీఆర్ఎస్ బృందం వెల్లడించింది. ఢిల్లీ ప్రధాన రహదారికి 100 కిలోమీటర్ల దూరంలో గల ముజఫర్‌నగర్‌కు సమీపంలో పట్టాలు తప్పిన ట్రైన్ ఓ ఇంటిపైకి దూసుకెళ్ళింది. దీంతో, ఆ ఇళ్ళు పూర్తిగా ధ్వంసమైంది. మరోవైపు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక ఐజీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు. కాగా, మృతుల కుటుంబీకులకు రూ. 3.5 లక్షలు, తీవ్రగాయాలైన వారికి రూ. 50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని రైల్వే మంత్రి సురేష్ ప్రభు వెల్లడించారు. ఒడిశా ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల పరిహారాన్ని ప్రకటించింది. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నామని రైల్వే మంత్రి వెల్లడించారు. కారుకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కమిటీని విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. సహాయక కార్యక్రమాలను తాను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రపతి రామ్‌నాథ్... ప్రధాని మోడీ... రాహుల్ గాంధీ



దిగ్భ్రాంతి : కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన తమను తీవ్రంగా బాధించినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. క్షతగ్రాతులు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. రైల్వే మంత్రిత్వ శాఖ సమర్థవంతంగా రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహిస్తుందని హామీనిచ్చారు.

మోడీ సర్కారు ఎప్పుడు మేల్కొంటుంది: కాంగ్రెస్ : దేశంలో ఒక ఘటన మరవక ముందే మరో చోట రైలు ప్రమాదం చోటు చేసుకుంటుందని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో రైల్వే ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నట్లు వెల్లడించింది. ఇన్ని ఘటనలు జరిగి సామాన్య ప్రయాణికులు ప్రాణాలు పోతున్నా, మోడీ సర్కారు మేల్కొవటం లేదని ➪ 7వ పేజీలో...

దెయ్యాలతో గొడవలొద్దు



జీవితంలో నిజం చెప్పని నారా

- తిరోగమనానికి చంద్రబాబే కారణం
- పేదలకు ఒక్క ఇల్లైనా కట్టించారా?
- అలవికాని హామీలు బాబు సొంతం
- రోడ్‌షోలో వైసీపీ అధినేత జగన్

నంద్యాల, కెఎన్ఎన్ : రాష్ట్రంలో ఎన్నో అనర్థాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూల కారణమని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. జీవితంలో నిజాలు చెప్పని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు నాయుడుకే చెల్లుతుందని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన నంద్యాల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు విధానాలను తూర్పార బట్టారు. చంద్రబాబు అవినీతి సొమ్ముతో మీ వద్దకు వస్తున్నారని, అవినీతి సొమ్ములో నుంచి రూ. 5 వేలు మీ చేతిలో పెట్టి ఓటు వేయించుకొనే కార్యక్రమం చేస్తారని జగన్ ఆరోపించారు. దెయ్యాలతో గొడవ పడాల్సిన పని లేదని, మనసులో ఆ దేవుడిని తలచుకొని ధర్మం వైపు నిలబడాలని పిలుపునిచ్చారు. ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను చంద్రబాబు ప్రక్కన పెట్టారని అన్నారు. విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్ళు కాదు, పదేళ్ళు కావాలన్న చంద్రబాబు అధికారం లోకి వచ్చాక హోదాను తీసుకురాలేదని గుర్తు చేశారు. మూడేళ్ళలో బెల్ట్ షాపులు తీసి వేయడం దేవుడేరుగు ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో బెల్ట్ షాపులను అందుబాటులోకి తెచ్చి మద్యం ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్నారని ఎద్దేవా చేశారు.

నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 11వ రోజు నంద్యాల పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ఎవరినో ఎమ్మెల్యే చేయడానికి ఓటు వేయడం లేదని, మూడేళ్ళుగా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలకు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నామన్నారు. చంద్రబాబు చేసిన దుర్మార్గం, అన్యాయానికి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నామని చెప్పుకొచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెన్నుపోటు పొడవడటం చంద్రబాబుకు న్యాయమేనా అని ప్రశ్నించారు. నంద్యాలలో వైఎస్సార్ సీపీ పోటీ పెట్టకపోతే నంద్యాలకు బాబు వచ్చేవారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్ళు కట్టిస్తామన్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్క ఇల్లు అయినా కట్టించలేదన్నారు. మూడేళ్ళ పాలనలో ➪ 7వ పేజీలో...

కారం మిల్లులపై దాడులు



- గుంటూరులో భారీగా సరుకు సీజ్
- 36 మిల్లుల్లో 19 బృందాలు తనిఖీలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోనే గుంటూరు జిల్లా కల్తీలకు కేంద్రంగా మారిందని ప్రభుత్వానికి ఫిర్యాదు అందిన నేపథ్యంలో గత రెండ్రోజులుగా గుంటూరు నగర పరిసరాల్లో నాణ్యత లేని పచ్చళ్ళ, కారం కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి, భారీగా నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. ఆటోనగర్‌లో పచ్చడి తయారీ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.50 లక్షలపై విలువగల నాణ్యతలేని పచ్చళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా శనివారం ఆహార పరిరక్షణ, భద్రత అధికారుల 19 బృందాలు నగరంలోని 36 కారం మిల్లులపై దాడులు నిర్వహించి నమూనాలను ➪ 7వ పేజీలో...

వర్షం.. వర్షం... కర్షకుల హర్షం

- కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- సీమలోనూ పంటలకు ఊపిరి
- వరి, ఆరుతడి పంటలకు ఊరట
- నేడు భారీ వర్షసూచన

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఒక శనివారం కోస్తాలో రికార్డుస్థాయి వర్షపాతం నమోదయ్యింది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. వర రామచంద్రాపురంలో అత్యధికంగా ➪ 7వ పేజీలో...

ప్రేమోన్మాది ఘాతుకం

- కిరోసిన్ పోసి నిప్పంటించాడు
- సజీవదహనమైన యువతి
- భయంతో రైలు కింద పడి ఆత్మహత్య



విశాఖపట్నం(భీమునిపట్నం), కెఎన్ఎన్ బ్యూరో: ప్రేమించిన యువతి తనను పట్టించుకోలేదని ఆమెను సజీవ దహనం చేసిన ఘటన శనివారం భీమునిపట్నం మండలం టి.నగరంపాలెం గ్రామంలో సంచలనం రేకెత్తించింది. ఘటనకు సంబంధించి వివరాలు .... టి.నగరంపాలెం గ్రామానికి చెందిన పొట్నూరు రూప (20) స్థానిక బాసరా డిగ్రీ కళాశాలలో బిఎస్సీ చదువుతోంది. కాగా గత కొద్ది కాలంగా ఆమె వెంట పతివాడ సతీష్ అనే యువకుడు తిరుగుతూ ప్రేమించమని కోరేవాడు. ఇందుకు రూప నిరాకరించింది. అయినప్పటికీ సతీష్ నుంచి పదే పదే ఆమెను వేధించడంతో ఆమె తల్లిదండ్రులు సతీష్‌ను మందలించారు. అయినా సతీష్‌లో ఎటువంటి ➪ 7వ పేజీలో...

బై ఎలక్షన్ నంద్యాల బాక్సింగ్

పతాకస్థాయికి... ప్రచారం

•పోటాపోటీగా వ్యూహాలకు పదును •నంద్యాలలో చంద్రబాబు, జగన్ మకాం •మరో 36 గంటలే గడువు

నంద్యాల, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికలలో ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. నువ్వా, నేనాఅనే రీతిలో పోటీ వున్న నేపథ్యంలో ప్రచారానికి మరో 36 గంటలే గడువు వుండటంతో ప్రధాన పార్టీలు తమ ప్రచారానికి పదును పెట్టాయి. ప్రత్యేకించి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలు శనివారం పోటీ పోటీగా రోడ్‌షోలు నిర్వహించి ప్రచారాన్ని హోరెత్తించారు. మరోవైపు శాసనమండలిలో మాజీ ప్రతిపక్షనేత సి.రామ చంద్రయ్య సైతం శనివారం కాంగ్రెస్ తరపున తీవ్రస్థాయిలో ప్రచారం చేశారు. ముగ్గురు నేతలు తమ పార్టీల తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రాకతో ఊపు వచ్చిన ప్రచారంలో భాగంగా ఆయన వివిధ వర్గాలను కలుసుకున్నారు. ఒకవైపు రోడ్‌షో నిర్వహిస్తూనే, మరోవైపు ప్రజలతో మమేకమయ్యారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ముఖ్యమంత్రి మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ అనుసరిస్తున్న విధానాలను తూర్పార బట్టారు.ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్ రెడ్డి వాడిన భాషపై కూడా సీరియస్‌గా స్పందించారు. ఇలాంటి విపక్ష నేతను ఎక్కడా చూడలేదని పేర్కొన్న ముఖ్యమంత్రి భావితరాలకు జగన్ ఏమి సందేశమిస్తారని ప్రశ్నించారు. టీడీపీకి ఎందుకు ఓటు వేయాలో విడమర్చి చెప్పిన చంద్రబాబునాయుడు ఎన్నికల్లో విజయంపై ధీమాను వ్యక్తం చేశారు. అదే విధంగా ఇక అభ్యర్థికి భూమా బ్రహ్మానందరెడ్డికి మెజారిటీ సాధించే విషయమై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పక్కాగా వ్యవహరించి విజయం సాధించే దిశగా దూసుకువెళ్ళాలని పేర్కొన్న ఓటర్లలో చైతన్యం వుండాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగకుండా టిడిపికి ఓటు వేయాలని, కనీసం పది సార్లయినా నంద్యాలకు వచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. కాగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికూడా రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై విరుచుకుపడుతూ ప్రచారాన్ని కొనసాగించారు. గత 11 రోజులుగా సర్కారు విధానాలను తూర్పారబడుతున్న జగన్మోహన్ రెడ్డి మరోవైపు శనివారం కూడా చంద్రబాబుపై వ్యక్తిగత విమర్శల పరంపరను కొనసాగించారు. అవినీతి సొమ్ముతో టీడీపీ వర్గాలు నంద్యాల బాట పట్టాయని, ప్రతి ఓ టరుకు రెండు వేల నుంచి అయిదు వేల రూపాయల దాకా ఇస్తున్నారని విమర్శించారు. బహి రంగంగా డబ్బులు పంచుతున్నప్పటికీ పోలీసులు అటువైపు తొంగిచూడటం లేదని, వైసీపీ శ్రేణులను మాత్రం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దేశంలో నిజాలు చెప్పని నేత ఎవరైనా వున్నారంటే అది చంద్రబాబుకే దక్కుతుందని ప్రకటించిన జగన్‌మోహన్ రెడ్డి టిడిపి వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకుని ధర్మానికి, న్యాయానికి ఓటు వేయాలని కోరారు. ప్రచార గడువు ముగిసేదాకా ఇక్కడే వుండాలని, ప్రచారం కొనసాగించాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి మాత్రం తన ప్రచారాన్ని ఆదివారంతో ముగిస్తున్నారు.

ఉదయం పదిన్నరకు మైనారిటీలతో, 11.30 గంటలకు బలిజలతో సమావేశమైన అనంతరం చంద్రబాబు విజయ వాడకు తిరుగు పయనమవుతారు. పరస్పరం వైసీపీ, టీడీపీ నేతలు జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు దూషణల పర్వాన్ని కొనసాగించిన నేపథ్యంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. అయితే ప్రచార గడువు సమీపించిన నేపథ్యంలో ఇక పార్టీలు ఓటును రాబట్టుకునే దిశగా కసరత్తు ప్రారంభించాయి. ఇది అత్యంత కీలక దశ కావడంతో ఎన్నిక దగ్గర పడుతున్న ఈ తరుణంలో మైకులకు ఇక పని వుండదు. ఫలితంగానే వైసీపీ శ్రేణులపై పాలకపక్షం నిఘాపెట్టిందనే విమర్శలున్నాయి. ఈ మేరకు తెలుగుదేశం గట్టి నిఘా వుంచిందని జగన్ పార్టీపేర్కొంది. టిడిపి శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వున్నాయని, వైసీపీ శ్రేణుల ప్రతి కదలికపై నిఘా పెట్టినట్టు శనివారం బాగా ప్రచారం జరిగింది. ముఖ్యంగా డబ్బు పంపిణీ జరుగకుండా వుండేలా కాపలా వుంటున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసుల సహాయాన్ని అధికార పార్టీ తీసుకుంటోందని వైసీపీ అనుమానిస్తోంది. నంద్యాలలో తాజాగా దాదాపు ఇరవై మంది వైసీపీ కార్యకర్తలు డబ్బులు పంచుతూ దొరికిపోయారు. వారి దగ్గర కొంత సొమ్ము కూడా వుంది. వీరిని పట్టించింది అధికార పార్టీ కార్యకర్తలే అని చెబుతున్నారు. అదే విధంగా నంద్యాలలోని అన్ని ప్రాంతాలలోనూ టీడీపీ పటిష్టమైన నెట్‌వర్క్ ఏర్పాటు చేసిందని ప్రచారం జరుగుతోంది. ఓటు మేనేజ్‌మెంట్ చేయాల్సిన ఈ కీలక దశలో వైసీపీని టిడిపి బాగా కట్టడి చేస్తున్నదనే ప్రచారం వుంది. కాగా క్షేత్రస్థాయిలో ఇలా వుంటే పై స్థాయిలో వైసీపీపై ఎన్నికల సంఘానికి టిడిపి నేతలు ఫిర్యాదులు చేయడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని, ప్రజలకు కొన్ని స్లిప్పులు ఇచ్చి శిల్పా సహకార సంస్థ వద్ద సొమ్ము ఇస్తున్నారంటూ టిడిపి నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ టి.డి.జనార్దన్ రావు ఇసికి లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయానికి ఆయనతో పాటు ఎంపిలు కేశినేని నాని, కొనకళ్ళ నారాయణ, కూడా వెళ్ళారు. నిబంధనలకు విరుద్ధంగా నంద్యాలలో వైఎస్సార్‌సిపి సొమ్ము పంచుతోందని ఆరోపించారు. మరోవైపు వైసీపీ కూడా ఇదే తహాలో ఫిర్యాదుచేయడం విశేషం. అధికారాన్ని అడ్డుపెట్టుకునిటిడిపి నందయాలలో డబ్బు పంచుతోందని ఆరోపించింది. ఈ సందర్భంగా టిడిపి ఎంపి కేశినేని మాట్లాడుతూ సిఎం స్థాయిలో వున్న వ్యక్తిపై ఉరితీయమని, కాల్చి వేయమని వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఫ్యాక్షన్ ప్రాంతమైన రాయలసీమలో ఇలా మాట్లాడటం హింసను ప్రేరేపించడం అవుతుందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. నిజానికి బూత్ స్థాయిలోనే సమయం వెచ్చించాల్సిన కీలక సమ యంలో పార్టీలు పరస్పరం నిందించుకోవడం, ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం జరుగుతోంది.








ఇంటింటి ప్రచారంలో శిల్పా కుమార్తె

ఓటుతో శిల్పాను తరిమేయండి

● సీఎం ఎన్నికల ప్రచారంలో మంత్రి అఖిలప్రియ



ప్రచారంలో ప్రసంగిస్తున్న మంత్రి అఖిలప్రియ

నంద్యాల రూరల్, కెఎన్ఎన్ : భూమా నాగిరెడ్డి మీద ఉన్న ప్రేమతో ముఖ్యమంత్రి నంద్యాల నియోజకవర్గాన్ని పెళ్లి కూతురులా తయారు చేస్తున్నారని మంత్రి అఖిలప్రియ అన్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో శిల్పా మోహన్‌రెడ్డిని నంద్యాల నుంచే కాకుండా జిల్లా నుంచి తరిమివేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని అయ్యలూరు మెట్ట వద్ద జరిగిన ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచార సభలో ఆమె ముందుగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి నంద్యాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. భూమానాగిరెడ్డి బతికి ఉంటే ఈ రోజు ఎంతో సంతోష పడేవారన్నారు. నాగిరెడ్డి హఠాత్ మరణం తర్వాత అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీకి కట్టుబడి నంద్యాలను అభివృద్ధిపథం వైపు నడిపిస్తున్నారన్నారు. ఆనాడు భూమా కుటుంబాన్ని, నంద్యాల ప్రజలను ఆదుకుంటానని ఇచ్చిన హామీని నెరవేరుస్తుండటంతో తమ కుటుంబానికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలో భూమా కుటుంబానికి అండగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తుంటే ప్రతిపక్షాలు విమర్శించడానికి కారణాలు లేక వ్యక్తిగతంగా దూషిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిని కాల్చి చంపాలని, ఉరి తీయాలని ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటాన్ని ఆమె తప్పు పట్టారు. పేదవారికి ఇళ్ళు కట్టిస్తున్నారని, ఆడ పడుచులకు రుణాలు కల్పిస్తున్నందుకా, నంద్యాలను అభివృద్ధి చేస్తున్నందుకు చంద్రబాబును ఉరి తీయాలని జగన్‌ను ప్రశ్నించారు. భూమానాగిరెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి 13 ఏళ్ళ తర్వాత టీడీపీ ఆధ్వర్యంలో అదే అధినేత చంద్రబాబు నేతృత్వంలో జరుగుతుందన్నారు. వచ్చే 50 ఏళ్ళ వరకు నంద్యాల ప్రజలు అభివృద్ధి అని అడగకుండా పనులను చేపడుతున్న ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నంద్యాలలో సీఎం రెండో రోజు పర్యటన

● ముఖాముఖి భేటీ కానున్న చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నంద్యాల చేరుకున్న సీఎం చంద్రబాబు మొదటిరోజు నియోజవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రబాబు రెండో రోజు పర్యటన కూడా నంద్యాల్లో కొనసాగనుంది. అదివారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ షాదీఖానా వద్ద ముస్లిం మత పెద్దలతో చంద్ర బాబు ముఖాముఖి బేటీ కానున్నారు. అనంతరం ఉదయం 11.15 గంటలకు మున్సిపల్ టౌన్ హాల్ లో బలిజ నాయకులతో సమావేశం కానున్నారు.

జగన్‌కు మతిభ్రమించింది: ఎంపీ జేసీ

నంద్యాల క్రైం, కెఎన్ఎన్: ప్రచారంలో జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని స్పష్టం చేశారు. శుక్రవారం నంద్యాలలోని పద్మావతినగర్‌లో పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి ఏరాసు ప్రతాప్‌రెడ్డి స్వగృహంలో ఆయన మాట్లాడారు. జగన్ అసందర్భ వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు.

వైసీపీ డబ్బు పంపిణీపై చర్యలు తీసుకోండి

● ఎన్నికల సంఘానికి టీడీపీ కార్యదర్శి జనార్దన్‌రావు వినతి

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ నేతలు, వారి అనుచరులు పెద్ద ఎత్తున డబ్బులు పంచుతున్నారనీ దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కార్యదర్శి టిడి జనార్థన్‌రావు ఎన్నికల సంఘానికి, కర్నూలు కలెక్టర్, నంద్యాల ఎన్నికల అధికారికి విన్నవించారు. ఈ మేరకు గుంటూరు నుంచి దీనికి సంబంధించిన లేఖను శనివారం రాత్రి ఆయన విడుదల చేశారు. వైసిపి నేతలు పాలుకూరి వెంకటరామిరెడ్డి, సోదరుడు పాలుకూరి దస్తగిరిరెడ్డి వద్ద రూ.47,40,000 లక్షల డబ్బు లభించిందని ఓటర్లకు పంచేందుకే ఈ డబ్బు ఉపయోగిస్తున్నారనీ ఆరోపించారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వైసిపి నేతలు పెద్ద ఎత్తున డబ్బులు పంచుతున్నట్లు తాము ఫిర్యాదులు చేశామన్నారు. నిబంధనకు విరుద్ధంగా వైసిపి నేతలు డబ్బులు పంచేందుకు సిద్ధమవుతున్నారనీ ఆరోపించారు. ప్రశాంతంగా ఎన్నికల జరిగేలా వైసిపినేతలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అబద్ధాల కోరు జగన్

● కర్నూలులో ఉర్దూ వర్సిటీలో కనిపించడంలేదా?: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల్లో పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రతిపక్ష నేత జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఉప ఎన్నికల ఓటమి ఖరారు కావడాన్ని జీర్ణించుకోలేక దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. నంద్యాల ఉప ఎన్నికలతో సంబంధం లేకుండా రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని జగన్‌మోహన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. ఉప ఎన్నికల కంటే ముందు జగన్ నంద్యాలలో అడుగుపెట్ట లేదన్నారు. కానీ చంద్రబాబు ఎన్నికల కంటే ముందే ఐదుసార్లు నంద్యాలలో పర్యటించిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఆగస్టు 15న కర్నూలులో ఉర్దూ వర్సిటీ పెడతానని సీఎం హామీ ఇచ్చారు. ఉర్దూ వర్సిటీ ఎక్కడైనా కనిపించిందా..? అని ప్రతిపక్ష నేత ప్రశ్నిస్తున్నారన్నారు. కానీ, కర్నూలు జిల్లాలో రెండు సంవత్సరాల క్రితమే తాత్కాలిక భవనంలో ఉర్దూ వర్సిటీ ప్రారంభించారన్నారు. ఇప్పటికే 2వ విద్యా సంవత్సరం కూడా మొదలయిందని తెలిపారు. వీసీని, అధ్యాపకులను కూడా నియమించి ప్రతిరోజూ తరగతులు నిర్వహిస్తున్నారని స్పష్టంచేశారు. మరోవైపు వర్సిటీకి శాశ్వత భవనాన్నికూడా ఏర్పాటుచేయడానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసి కోట్లరూపాయలు నిధులు కూడా కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. సీబీఐ ముందు, ఈడీ ముందు అబద్ధాలు చెప్పిన విధంగానే ప్రజలకు కూడా అబద్ధాలుచెబుతున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధికోసమే జగన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నంద్యాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

23న నంద్యాలకు

పవిత్రమైన రోజు

•గెలుస్తున్నాం... మెజారిటీపైనే ఇక దృష్టి •రాబోయే నాలుగు రోజులు కీలకం
•ఇంటికొక్కరు కార్యకర్తగా మారాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు



నంద్యాల, ఆంధ్రప్రభ : గెలుపు తమదే అనే నిర్ణయానికి నంద్యాల ప్రజలు వచ్చారని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. తమ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి గెలవడం ఖాయమని, కావల్సింది మెజారిటీ మాత్రమేనని అన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రిని శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన పలువురు నాయకులు, వివిధ వర్గాలకు చెందిన వారు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కాపులకు, వాల్మీకులకు ఇచ్చిన హామీలన్నిటినీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. రిజర్వేషన్లను కూడా కేంద్రం ఇవ్వాల్సిన అవసరం వుందని, అందుకు అవసరమైన ప్రయత్నాలు చేస్తామన్నారు. రాబోయే నాలుగు రోజులలో ఇంటికొక్కరు చొప్పున టీడీపీ కార్యకర్తగా మారాలన్నారు. ఈ నెల 23వ తేదీ నంద్యాలకు పవిత్రమైన రోజని చంద్రబాబు పేర్కొన్నారు. అందరూ ఓటును వినియోగించుకోవాలన్నారు.

ప్రజలు ఇచ్చే మెజారిటీ తనకు పెద్ద శక్తిని ఇస్తుందన్నారు. భవిష్యత్తులో అయిదు సార్లు కాదు కదా, పదిసార్లు అయినా వచ్చి నంద్యాలను సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దుతానన్నారు. రాయలసీమలో కియా మోటార్స్ వంటి పెద్దకంపెనీలు వచ్చాయని, రెండు నెలల కాలంలో నిరుద్యోగ భృతి ఇచ్చి యువతకు అండగా వుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను విస్తరిస్తామని, అవినీతిని పూర్తిగా నిర్మూలిస్తున్నామని, ఆస్తులు వివరాలు తెలుసుకునేందుకు అంతా ఆన్‌లైన్ చేశామన్నారు. 15 నిమిషాల్లో ఆస్తుల వివరాలు పట్టాదారు పాస్ బుక్‌లు మీ సేవ కేంద్రాల ద్వారా అందజేసే విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎవరికి ఇబ్బంది కలిగినా 1100 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

భేటీలు

చంద్రబాబు నాయుడు పొన్నాపురం కాలనీలో క్రిస్టియన్ మైనారిటీలు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నందువల్ల , ఫలితాల అనంతరం వాటిపై దృష్టిసారిస్తానన్నారు. వివిధ సమస్యలపై కూడా ఆయన లోతుగా చర్చించిన చంద్రబాబు వారికి నిర్దిష్టమైన హామీని ఇచ్చారు.

ఒపీనియన్ పోల్ సర్వేల నిషేధంపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నంద్యాల శాసనసభ నియోజకవర్గంలో ఒపీనియన్ పోల్ సర్వేలపై నిషేధం విధిస్తూ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టు లో పిటిషన్ దాఖలైంది. ఒపీనియన్ పోల్స్ సర్వేలపై ఇప్పటి వరకు ఏ చట్ట ప్రకారం నిషేధం లేదన్నారు. చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) సూచనల మేరకు రిటర్నింగ్ అధికారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126ఏ(1) ప్రకారం ఎన్నికలకు 48 గంటల ముందు ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ఫలితాల ప్రచురణలపై నిషేధం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. నంద్యాల శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉపఎన్నిక ముగిసే వరకు విద్యార్థులు, ఎన్జీవోలు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నిర్వహించే అన్ని విధాలైన ఓటర్ల ప్రజాభిప్రాయ సర్వేలను నిషేధిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి , కర్నూలు జాయింట్ కలెక్టర్ ఈ నెల 15న జారీ చేసిన ఉత్తర్వులను జారీ చేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సోషియో పొలిటిక్ అనాలిసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ పీఏఆర్ సీ) కార్యదర్శి ఎన్.రాంబాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అందువల్ల ఆర్వో జారీ చేసిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని పిటిషనర్ హైకోర్టును అభ్యర్థించారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టే అవకాశం ఉంది.

నేడు ఈసీకి పీసీసీ నేతల ఫిర్యాదు

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల అక్రమాలపై ఆదివారం ఉదయం 10 గంటలకు ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి నేతృత్వంలో మాజీ కేంద్ర మంత్రులు, ఏపీసీసీ నాయకులు నంద్యాల ఎన్నికల కమిషన్ అధికారికి పిర్యాదు చేయనున్నారు. ఏపీసీసీ కార్యాలయం నుండి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉప ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ ఆక్రమాలపై నంద్యాలలో ఎన్నికల అధికారికి, హైదరాబాద్‌లో ఏపీ ఎన్నికల సంఘం (సీఈవో), ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)కు కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. హింసాత్మక చర్యలకు వైసీపీ ప్రోత్సహిస్తోందని, ఓటమి భయంతో టీడీపీ ప్రలోభాలకు తెరలేపిందని, ప్రభుత్వ యంత్రాంగం అంతా నంద్యాల్లో మకాం వేసిందని, విచ్చలవిడిగా డబ్బు సంచులను కుమ్మరిస్తుంటే పోలీసు యంత్రాంగం నియంత్రించలేకపోతుందని, టీడీపీకి ఓట్లు వేయకుంటే పథకాలు వర్తింపచేయమని బెదిరిస్తున్నారనే అంశాలపై ఏపీసీసీ నేతలు ఎన్నికల కమిషన్ కలిసి ఫిర్యాదు చేయనున్నారు.

ముఖ్యమంత్రి ఆహార భద్రత వ్యాన్‌పై

వైసీపీ నేతల దౌర్జన్యం

● జగన్ విశ్వసనీయత కోల్పోయారు: మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


నంద్యాల (బండిఆత్మకూరు), కెఎన్ఎన్ : ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు విశ్వసనీయత కోల్పోయారని, ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహార భద్రత వ్యాన్‌లో డబ్బులు తరలిస్తున్నారని వైసీపీ నాయకులు దౌర్జన్యం చేసి అభాసుపాలయ్యారని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం నంద్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న ముఖ్యమంత్రి ఆహారభద్రత వ్యాన్‌లో డబ్బులు తరలిస్తున్నారని వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి సిబ్బంది వీరంగం సృష్టించి సీఎం సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి, వ్యాన్ తాళం పగుల కొట్టారన్నారు. అందులో ఉన్న వంకాయలు, బెండకాయలు చూసి నోరెళ్ళ బెట్టారని విమర్శించారు. అనవసర రాద్ధాంతం సృష్టించిన వైకాపా నేతలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. రోజా సీఎం చంద్రబాబు వల్ల రాష్ట్రంలో వర్షాలు పడటం లేదంటున్నారని, కానీ రోజా చరిత్ర చూస్తే ఆమె ఐరన్ లెగ్ అని తెలుస్తోందన్నారు. ఆమె జగన్ వెంట ఉండి నోరు పారేసుకుంటే తమకు ఓట్లు వస్తాయని సోమిరెడ్డి తెలియజేశారు. ఉప ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పాల్గొన్న ముఖ్యమంత్రికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి సుమారు 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే రామారావు, బద్వేల్ ఎమ్మెల్యే జయరామయ్య, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు పంచిన వైకాపా నేతలపై కేసులు పెట్టాలి: ఎంపి కొనకళ్ళ

ఓటమి భయంతోనే వైకాపా నాయకులు దిగజారుడు ప్రకటనలు చేస్తూ తమ పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు పన్నుతోందని టీడీపీ పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ళ నారాయణ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి భోజన వాహనంలో డబ్బులు ఉన్నాయని వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు తప్పుడు ఆరోపణలు చేసి అధికారులను తప్పుదోవ పట్టించి అభాసుపాలయ్యారని విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. దీనిపై ఎన్నికల సంఘం స్పందించాలని నారాయణ డిమాండ్ చేశారు. జగన్ అక్రమ ఆస్తుల కేసుల విచారణ సిబిఐ వేగిరపరుస్తోందని, దీంతో జైలుకు పోవడం ఖాయమని తెల్చుకున్న జగన్ చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నంద్యాల ఎన్నికల్లో డబ్బులు విచ్చలవిడిగా పంపిణీ చేస్తూ వైకాపా కార్యకర్తలు దొరికిపోయారని, వైకాపా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించి ఆ పార్టీ నేతల వైఖరిని బయటపెట్టుకున్నారని ఆయన అన్నారు. నంద్యాలలో తెదేపా గెలుపు ఖాయమని అర్థం చేసుకున్న వైకాపా నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని నారాయణ ఆరోపించారు.

ఎన్నికల సంఘాన్నే తప్పుదారి పట్టిస్తున్న వైకాపా: కేశినేని నాని

ప్రజాదరణ కోల్పోయిన జగన్, ఆయన అనుచరులు తప్పుడు నివేదికలతో ఎన్నికల కమిషన్‌ను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కేశినేని శ్రీనివాస్ అన్నారు. వైకాపా నేతలు చెబుతున్న అవాస్తవాలు, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని కేశినేని అన్నారు. ఆధారరహిత ఆరోపణలను, వారి ప్రవర్తనను ఎన్నికల కమిషన్ నిశితంగా పరిశీలించాలని కేశినేని నాని కోరారు. సాటి మహిళ ధరించిన దుస్తులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రోజాపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కేశినేని నాని కోరారు.



అభివృద్ధికే పట్టం: ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు

నంద్యాల ప్రజలు తెలుగుదేశంవైపే మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ సీనియర్ శాసనసభ్యుడు తోట త్రిమూర్తులు అన్నారు. ఈ ఎన్నిక ఏకపక్షంగా సాగబోతోందన్నారు. ఆయన నంద్యాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన 'ఆంధ్రప్రభ' ప్రతినిధితో మాట్లాడుతూ నంద్యాల ఓటర్లు అభివృద్ధికే పట్టం కడతారన్నారు. చామ కాల్వకు నిధులు, 13,000 ఇళ్ళ నిర్మాణం, కుందూ నది అభివృద్ధి వంటి పనులను తమ ప్రభుత్వమే చేపట్టిందన్నారు. ఎన్నికలు లేకున్నా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోనూ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భూమా నాగిరెడ్డి ఇచ్చిన హామీలను తాను పూర్తి చేస్తానంటూ ముఖ్యమంత్రి వాగ్దానం చేశారని తెలిపారు. సీఎం విధానాల వల్ల నంద్యాల ప్రాంతంలో ఫ్యాక్షన్ లేకుండా పోయిందని, అందరూ అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. జగన్‌లో నిరాశా నిస్పృహ నెలకొన్నదని, రాజకీయాలలో వున్నప్పుడు సంయమనంతో వుండాలని, కానీ జగన్‌లో అవి లోపించాయన్నారు. సి.ఎం వంటి వ్యక్తిని కాల్చేయాలి, ఉరి తీయాలని అని వ్యాఖ్యానించడం ప్రతిపక్ష నాయకునికి తగదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే ప్రజలు హర్షిస్తారని, ఎవరు ముఖ్యమంత్రిగా వుండాలనేది ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

అదే పోరు... అదే పంథా...

• ఉన్నత విలువలే లక్ష్యం • ప్రజా సంక్షేమమే పరమావధి
• ఉద్యమాల ఖిల్లా ఖమ్మంలో ఆంధ్రప్రభ మరో మజిలీ
• నూతన ప్రచురణా కేంద్రం ప్రారంభం



ఖమ్మం ఎడిషన్‌ను ప్రారంభిస్తున్న ఎండీ ముత్తా గౌతమ్, ముద్రణాయంత్రాన్ని ఆపరేట్ చేస్తున్న కంచి శ్రీనివాస్ (జీఎం ఫైనాన్స్)

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : చరిత్రకు వర్తమానానికి, భవిష్యత్‌కు మధ్య వారధిగా వెలుగొందుతున్న ఆంధ్రప్రభ దినపత్రిక ఉద్యమఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంతో తమ నూతన ప్రచురణాకేంద్రాన్ని శనివారం ప్రారంభించింది. ఎనిమిది దశాబ్ధాల సుదీర్ఘ ప్రయాణంలో ఏనాడూ విలువలకు ఏమాత్రం తిలోదకాలివ్వకుండా ఆవిర్భావ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్ళడంతో పాటు జర్నలిజం ఫస్ట్ అన్న నినాదాన్ని మనసావాచా కర్మణా అమలు చేస్తున్న ఆంధ్రప్రభ ఆదినుంచి అనేక నూతన ఆవిష్కరణలకు చిరునామాగా మారింది. కొత్త ప్రచురణకేంద్ర ప్రారంభోత్సవసందర్భంలో ఆంధ్రప్రభ సుదీర్ఘ చరిత్రను పాఠకులు, సిబ్బంది మరోసారి గుర్తుచేస్తున్నారు. కణ కణ మండుతున్న అగ్నిజ్వాలల్నుంచే ఆంధ్రప్రభ ఆవిర్భవించింది. రాకాసి మూకల్ని రాజ్యం నుంచి తరిమికొట్టాలన్న భారత ప్రజల విప్లవాగ్నిశిఖల్నుంచి ఈ పత్రిక పుట్టుకొచ్చింది. ఆంధ్రప్రభ జననమే ఓ పోరాటం.. గమనమే మరో పోరాటం.. అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రప్రభ ఈ పోరాటపంథాను వదల్లేదు. 1938ఆగస్టు 15న అప్పటి మద్రాస్ రాష్ట్రం చెన్నైలో పురుడుపోసుకున్న ఆంధ్రప్రభ అంచెలంచెలుగా పోరాటపంథాను మరింత ద్విగిణీకృతం చేస్తూనే కాలానికనుగుణంగా అనేకసాంకేతిక మార్పుల్ని ఆవాహనం చేసుకుంది. తెలుగుప్రజల ముంగిళ్ళకు తెలతెలవారుతుండగానే చేరే లక్ష్యంతో ముద్రణా కేంద్రాల సంఖ్యను పెంచుతోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంది. అత్యున్నత ఆశయసాధనతో రామ్‌నాథ్‌గోయంకా స్థాపించిన ఈ పత్రిక ఏనాడూ తన లక్ష్యసాధనలో లక్ష్మణగీత దాటలేదు. 2003లో యాజమాన్యం మారినప్పటికీ నూతనాధిపతి, మాజీమంత్రి ముత్తా గోపాలకృష్ణ అదే ఒరవడిని కొనసాగించారు. కాలానుగుణంగా కొత్తశీర్షికలు ప్రవేశపెట్టినా.. పత్రికకు రంగులద్దినా.. పేజీలు పెంచినా.. ఎక్కడా పత్రికానిర్వహణ ప్రధాన లక్ష్యాన్నిలేశమాత్రంగా కూడా పక్కకు జరపలేదు. ఇదే ఒరవడిలో సాగుతున్న ఆంధ్రప్రభ పత్రిక శనివారం తన 13వ ప్రచురణాకేంద్రాన్ని తెలంగాణారాష్ట్రంలోని ఉద్యమఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రారంభించుకుంది.

19వ శతాబ్ధం తొలిరోజుల్లో తెలుగువార్తాపత్రికలు ఆవిర్భవించాయి. అయితే అప్పట్లో వార, మాసపత్రికలు మాత్రమే వెలువడేవి. సాంఘిక దురాచారాలపై పోరాటానికి పత్రికలు ప్రాధాన్యతనిచ్చాయి. అలాంటిదశలో అప్పటికే ఇంగ్లీష్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తున్న రామ్‌నాథ్ గోయంకా ప్రాంతీయ భాషల్లో పత్రిక ముద్రణకు పూనుకున్నారు. తద్వారా క్షేత్రస్థాయి నుంచి స్వతంత్రపోరాట కాంక్షను రగుల్కొల్పడంలో తనవంతు పాత్ర నిర్వహించాలని ఆశించారు. ఇందుకనుగుణంగా 1938ఆగస్టు15న ఆంధ్రప్రభ తొలిసంచిక విడుదలైంది. అయితే ఇదికూడా యుద్ధవార్తల్నే మోసుకొచ్చింది. అప్పటికే రెండోప్రపంచయుద్ధం సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచదేశాలు రెండుకూటములుగా విడిపోయాయి. హిట్లర్‌ను అంతర్జాతీయ శత్రువుగా గుర్తించడం మొదలైంది. మరోవైపు ప్రపంచాన్నేలే సామర్థ్యం, హక్కు భగవంతుడు నాజీలకుమాత్రమే కల్పించాడన్న బలమైన విశ్వాసాన్ని హిట్లర్ ప్రదర్శించడం మొదలెట్టాడు. ఇందుకనుగుణంగా ప్రపంచ దురాక్రమణకు ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలోనే ఆగస్టు 14న హిట్లర్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలు గుర్తించాయి. జర్మనీకి సహకరిస్తున్న జపాన్ అప్పటికే యుద్ధవిమానాల సమూహాన్ని దాడికి సిద్ధం చేసింది. దీంతో ఐరోపా దేశాలు తీవ్ర ఆందోళనకు గురౌతున్నాయి. సరిగ్గా ఇదే వార్తను ఆంధ్రప్రభ తొలిసంచికలో ప్రధానంగా ప్రచురించింది. అప్పట్లో కంప్యూటర్లు లేవు. దేశీయంగా వార్తాహరుల సంఖ్య నామమాత్రం. అప్పటికింకా తెలుగు జర్నలిజం వృద్ధిచెందలేదు. కొందరు సామాజిక ఆసక్తిపరులు మాత్రం సమస్యలపై పత్రికల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేప్రయత్నం చేసేవారు. ఇక జాతీయ వార్తల కోసం ఏజెన్సీలపైనే ఆధారపడేవారు. అంతర్జాతీయ వార్తల సేకరణకు రాయటర్స్ ఒక్కటే మార్గం. అయితే రాయటర్స్‌లో బ్రిటీష్ అనుకూల వార్తల్ని మాత్రమే భారత్‌లో విడుదల చేసేవారు. ఆసక్తుంటే వాటినే తర్జుమా చేసి ప్రచురించాలి. అంతకుమించి సొంత వార్తాసేకరణకు తగిన మార్గాంతరం లేదు. మార్స్‌కోడ్ విధానం ఒక్కటే అందుబాటులో ఉండేది. అలాగే సీసంతో తయారుచేసిన తెలుగు అక్షరాల్ని ఒద్దికగా పొందుపర్చి యంత్రంపై ప్రింట్‌చేసేవారు. వీటిని సుదూర ప్రాంతాలకు పంపేందుకు తగిన రవాణా సదుపాయాలుండేవికావు. ఎక్కువగా రైళ్ళ ద్వారానే పత్రికల్ని చేరవేసేవారు. అప్పట్లో కూడా ప్రధాన రైళ్ళు చిన్న చిన్న స్టేషన్లలో ఆగేవికావు. కానీ రైల్వేగార్డ్ సంబంధిత స్టేషన్ వద్ద పేపర్ కట్టను పరిగెడుతున్న రైలునుంచే ప్లాట్‌ఫారంపైకి విసిరేసేవారు. వాటికోసం పాఠకులు కళ్ళుకాయలుకాసేలా రైల్వే స్టేషన్లలో ఎదురుచూడాల్సిన పరిస్థితుండేది.అప్పట్నుంచి మొదలైన ఆంధ్రప్రభ ప్రస్తానంలో ఎన్నో పోరాటాలు.. యుద్ధ వార్తతో ప్రారంభమైన ఆంధ్రప్రభ రెండోప్రపంచ యుద్ధ వివరాల్ని అత్యద్భుతంగా పాఠకులకు అందించింది. అదే సమయంలో ఉధృతమైన స్వతంత్రపోరాట సంగతుల్ని కూడా సకాలంలో పాఠకుల దరిచేర్చింది. స్వతంత్రానంతరం కూడా ఆంధ్రప్రభ పోరాట పటిమను ఏమాత్రం సడలించలేదు. ప్రధాని నెహ్రూ నిర్ణయాల్ని కూడా పలు సందర్భాల్లో నేరుగా ప్రశ్నించింది.

అమెరికా, సోవియట్‌లకు సమానదూరం పాటిస్తూ తృతీయ ప్రపంచ కూటమి ఏర్పాటుకు ఇదే సమయమంటూ సంపాదకీయాలు వెలువరించింది. అలీనకూటమి ఏర్పాటుకు పరోక్షంగా శ్రీకారం చుట్టింది. ఇందిర హయాంలో ఎమర్జన్సీపై కేంద్రాన్ని నిలదీసింది. బ్రిటీష్‌కాలయాటికంటే కూడా ఇందిర హయాంలోనే ఎక్కువ అణచివేతకు గురైంది. ప్రెస్‌సెన్సార్‌షిప్‌పై బహిరంగంగా విరుచుకుపడింది. కేంద్రంలో కాంగ్రెస్సేతర పార్టీల కూటమి జనతపార్టీ ఏర్పాటులోనూ కీలకపాత్ర పోషించింది. భారతస్వతంత్రం, దేశ విభజన అనంతర పరిణామాలు, చైనాతో యుద్ధం, లాల్ బహదూర్‌శాస్త్రి మరణం, బంగ్లా ఆవిర్భావం వంటి కీలక ఘట్టాల్ని సవివరంగా పాఠకులకు చేరవేసింది. కార్గిల్‌యుద్ధాన్ని కళ్ళకుకట్టినట్లు వివరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు కేంద్రాల్నుంచి వెలువడ్డ ఆంధ్రప్రభను 2003లో ముత్తా గోపాలకృష్ణ చేపట్టిన అనంతరం మరింత దినదిన ప్రవర్ధమానమౌతోంది. ఎడిషన్ కేంద్రాల్ని పెంచుకుంటూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ వేకువకు ముందే పాఠకుల చెంతకు చేరుతోంది. ఎన్ని అవాంతరాలొచ్చినా.. మరెన్ని ఆధునిక సొబగులు అద్దుకున్నా అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రప్రభ పంథాలో ఏ మార్పురాలేదు. ఎప్పుడూ ప్రజా సంక్షేమాన్నే పరమావధిగా తలకెత్తుకుంటోంది. సమస్యలపై ప్రజల్ని చైతన్యపర్చడంలో తనవంతు విద్యుక్తధర్మాన్ని నిక్కచ్చిగా నిర్వర్తిస్తోంది.

26న ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా
పేదల గృహాలకు శంకుస్థాపన

• 16వేల ఇళ్ళకు భూసమీకరణ
• మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెండో విడత పట్టణ పేదల గృహాలకు ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఈ నెల 26వతేదిన శంకుస్థాపన చేయించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. శనివారం ఆయన విజయవాడలోని జక్కంపూడి గృహనిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి 2లక్షల 25వేల ఇళ్ల రెండో విడతలో మంజూరయ్యాయని అన్నారు. మొదటి విడతలో మంజూరైన లక్షా 93వేల ఇళ్ళ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఇందులో లక్షా 56వేల ఇళ్లు బహుళ అంతస్థుల భవనాలుగా నిర్మిస్తున్నామని అన్నారు. రెండో విడత మంజూరైన ఇళ్లను కూడా సెప్టెంబర్ చివరినాటికి టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వనంతగా నాణ్యమైన ఇళ్ళను నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు పదేళ్లలో నిర్మించిన ఇళ్లు ఇప్పటికి పూర్తికాలేదన్నారు. విజయవాడలో రెండో విడతలో 28వేల ఇళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. జక్కంపూడి వద్ద వంద ఎకరాల్లో 12వేల ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. మరో 16వేల ఇళ్లకు సంబంధించి భూమి సమీకరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. విజయవాడ జక్కంపూడిలో అసంపూర్తిగా వదిలేసిన 640 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పూర్తిచేస్తామన్నారు. జక్కంపూడిలో డ్రైన్‌లు, శానిటేషన్ తదితర సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.



భూగర్భ జలాల దోపిడీని అరికట్టాలి

• నీటిని వాణిజ్యం చేస్తూ కోట్లు అర్జించే బహుళజాతి కంపెనీలను నియంత్రించాలి • పటిష్టమైన పాలసీతో విచ్చలవిడిగా అనుమతలు ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలి • జలవనరుల పార్లమెంటరీ స్టాడింగ్ కమిటీ చైర్మన్ హుకుమ్‌సింగ్

విశాఖపట్నం, కెఎస్ఎన్ బ్యూరో: నీటిని వాణిజ్యం చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జించే బహుళ జాతి కంపెనీలను నియంత్రించి, భూగర్భ జలాల దోపిడీని అరికట్టాలని జలవనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుమ్‌సింగ్ ఆదేశించారు. ఆయన నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం విశాఖ నగరానికి వచ్చిన జలవనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఒక ప్రయివేటు హోటల్‌లో తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు పనుల ప్రగతి, భూగర్భ, ఉపరిత జలవనరుల నిర్వహణ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ హుకుమ్‌సింగ్ మాట్లాడుతూ అత్యంత శక్తివంతమైన నాయకుడు చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. బహుళ జాతి కంపెనీలకు కళ్లెం వేయడం, భూగర్భ జలాల దోపిడీని అరికట్టడం వీరికి ఎంతో సులువన్నారు. భూగర్భ జలాల నిర్వహణపై రాష్ట్రంలో అమలుచేస్తున్న వోల్టా చట్టంతోపాటు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర భూ గర్భ జలవనరుల బోర్డు ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, సూచనలు, సలహాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు పరిస్తే మరింత మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. భూగర్భ జలాల వినియోగాన్ని మరింత నియంత్రించేందుకు, విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చే విధానానికి స్వస్తి పలికేందుకు అవసరమయితే మరింత పటిష్టమైన పాలసీని రూపొందించాలని రాష్ట్ర జలవనరులు, భూ గర్భ జలాల శాఖల అధికారులకు ఆయన సూచించారు. ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా వున్న ప్రకాశం జిల్లా లాంటి ప్రాంతాల్లో ఉపరితల జలాలను వినియోగించుకునేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన కార్పొరేషన్లు లాభాపేక్ష లేకుండా పనిచేస్తాయని అటువంటి కార్పొరేషన్ల సేవలను వినియోగించుకుంటే మంచి ఫలితాలు వుంటాయన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అటువంటి కార్పొరేషన్లకు ఆయా గ్రామాలను దత్తత ఇచ్చే విధానానికి శ్రీకారం చుట్టాలన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జలవనరుల నిర్వహణకు అమలు చేస్తున్న విధానాలను, తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు. రాష్ట్రంలో జలవనరుల నిర్వహణకు సంబంధించి నీతి ఆయోగ్ రాష్ట్రానికి మంచి మార్కులను కేటాయించిందని కమిటీకి వివరించారు. కమిటీ సభ్యులు ఎం.మురళీమోహన్, పి.అపురూప, వి.సత్యభామ, హర్షవర్ధన్, సర్దార్ బల్విందర్, సిద్ధాంత్ మహాపాత్రా, రాపోలు ఆనంద్ భాస్కర్, సుభాష్‌పాటిల్, కేంద్ర జల వనరులశాఖ డైరెక్టర్ టి.డి.శర్మ, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ జి.రామ్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్ సింఘాల్, పార్లమెంట్ డిప్యూటీ సెక్రటరీ ఎస్.జి.గార్గు, వేప్‌కోస్ చీఫ్ ఇంజినీర్ డి.వి.ఎస్.మూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.ఎన్.ఎన్.ప్రసాద్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సభ్యులు ఇ.సంభత్‌కుమార్, తోటపల్లి ప్రాజెక్టు ఎస్ఇడి.తిరుమలరావు, జలవనరులశాఖ సీఈ ఎం.టి.రాజు, ఎస్ఇఆర్ నాగేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఇలా అయితే... పోలవరం పూర్తికాదు

అమరావతి, ఆంధ్రప్రభ : గడచిన మూడేళ్ళలో బహుళార్ధక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుకు రూ. 3 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశారని, ఇలా అయితే 10 ఏళ్ళయినా ప్రాజెక్టు నిర్మాణం పూర్తవదని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి నాయకులు జలవరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుం సింగ్‌కు విన్నవించారు. ఈమేరకు వారు శనివారం విజయవాడలో హుకుం సింగ్‌తోపాటు ఆయన బృందాన్ని కలిసి పోలవరం సహా పలు సాగునీటి ప్రాజెక్టులపై వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జాతీ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టును కేంద్రప్రభుత్వమే పూర్తి ఖర్చులతో నిర్మింప చేయాల్సి ఉందన్నారు. త్వరితగతిన ప్రాజెక్టు పూర్తిచేసేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే నిర్మాణ బాధ్యతను అప్పగించినట్లు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టంచేసినట్లు తెలిపారు.

అయితే పెరిగిన అంచనాల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికయ్యే పూర్తి వ్యయం సుమారుగా రూ. 40 వేల కోట్లను తాము భరించబోమని, కేవలం 2010-11 అచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ. 16,010.45 కోట్లను నూరు శాతం భరిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేస్తోందన్నారు. అనుకున్న ప్రకారం ఐదేళ్ళ కాల వ్యవధిలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయలేని పక్షంలో ఈ మొత్తం ఆర్ధిక సాయాన్ని అప్పుగా పరిగణిస్తామని షరతులు విధించడాన్ని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా నాలుగు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం బేషరతుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్రప్రభుత్వమే భరించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో పారదర్శకంగా నిర్ణీత వ్యవధిలో జరిగేలా కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలని, అమరావతి రాజధాని నగరంలో మురుగు నీరు కృష్ణా నదిలో కలవకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, నదీ ఘాట్లు నిర్మించాల్సిందిగా కేంద్రప్రభుత్వానికి స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేయాలనే డిమాండ్లను వారు ఈ సందర్భంగా హుకుం సింగ్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి నేతలు చేసిన విన్నపాలను సావధానంగా విన్న హుకుం సింగ్ ఈ విషయాలన్నింటినీ కేంద్రం దృష్టికి తీసుకెళ్ళి తగు న్యాయం చేస్తానని తెలిపారు. పార్లమెంటరీ స్టాండింగ్‌కమిటీ (జలవనరులు) చైర్మన్ హుకుం సింగ్, ఇతర కమిటీ సభ్యులను కలిసినవారిలో కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి కన్వీనర్ కొలనుకొండ శివాజీ మాజీ ఎంఎల్ఏ, వైకాపా నాయకులు మల్లాది విష్ణు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి నరసింహారావు, సీపీఎం రైతు సంఘం అధ్యక్షులు వై.కేశవరావు, సీపీఐ రైతు సంఘం నాయకులు యల్లమందరావు, యువ రైతు సంఘం నాయకులు అల్లం రాజేష్ తదితరులు ఉన్నారు.

కర్షక రత్న కేసీఆర్

• అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డుకు తెలంగాణ ముఖ్యమంత్రిని ఎంపిక చేసిన కేంద్రం
• రైతు సంక్షేమ కృషికి అరుదైన గౌరవం
• అభినందించిన గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గడిచిన మూడేళ్ళుగా అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ కీర్తి పతాకాన్ని దేశం నలుమూలలా చాటుతున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన రైతు బాంధవుడన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వ్యవసాయ రంగాభివృద్ధి, చిన్న సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు అహర్నిషలూ కృషి చేస్తున్న కేసీఆర్‌కు ప్రతిష్టాత్మకమైన అగ్రికల్చర్ లీడర్‌షిప్-2017 అవార్డు లభించింది. పాలసీ లీడర్‌షిప్ కేటగిరీ కింద ఆయనను అవార్డుకు ఎంపిక చేశారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని కమిటీ అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డుకు తెలంగాణ ముఖ్యమంత్రి పేరును ఖరారు చేసింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధీనంలోని ''భారత ఆహార, వ్యవసాయ మండలి'' (ఐసీఎఫ్ఏ) 2008 నుంచి ప్రతియేటా ఈ అవార్డులను అందజేస్తూ వస్తోంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక అవార్డుకు అన్ని అర్హతలున్న సీఎం కేసీఆర్‌ను ఎంపిక చేశారు. 10వ గ్లోబల్ అగ్రికల్చర్ లీడర్‌షిప్ సమ్మిట్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 5న రాత్రి 7.30 గంటలకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావును అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేసినట్లు భారత ఆహార, వ్యవసాయ మండలి స్పష్టం చేసింది. ఈ అవార్డుకు ఎంపికైన విషయాన్ని తెలియజేస్తూ ఐసీఎఫ్ఏ చైర్మన్ డాక్టర్ ఎంజే ఖాన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అవార్డును అందుకునేందుకు ఢిల్లీ రావాల్సిందిగా ఆహ్వానించారు.

ఇది విశిష్ట గుర్తింపు : గవర్నర్

తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ పనితీరుకు ఈ అవార్డు నిదర్శనమని ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర ప్రతిష్టకు ప్రత్యేక గుర్తింపు తెస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన సీఎం కేసీఆర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా సాగునీటి వనరులను అభివృద్ధి సేస్తూ, ప్రాజెక్టులను నిర్మిస్తూ తెలంగాణ సస్య శ్యామలం కావడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ అమలవుతున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతు రుణ విముక్తి పథకాలు, వచ్చే ఏడాది నుంచి కార్యరూపంలోకి రానున్న పంట పెట్టుబడి రాయితీ పథకాలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులపై చంద్రబాబుకు అమితమైన ప్రేమ

• మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆర్యవైశ్యులంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అమితమైన ప్రేమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖామంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, అనేక కీలకపదవులు ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. శనివారం నంద్యాలలోని బొమ్మలసత్రం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వ్యాపారులు , ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మంత్రి శిద్దా రాఘవరావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో చట్టసభలకు ఒక ఆర్యవైశ్యుడు కూడా ప్రాతినిథ్యం వహించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక మంది ఆర్యవైశ్యులను చట్టసభలకు ప్రాతినిథ్యం వహించే అవకాశాన్ని కల్పించారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో నంద్యాల పూర్తిగా వెనుకబడిపోయిందని విమర్శించారు. కొత్తరాష్ట్రంలో అనేక ఆర్ధిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి ప్రక్రియకు ఎలాంటి ఢోకా లేదని మంత్రి తెలిపారు. రూ. 1400కోట్లతో నంద్యాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రూ. 800కోట్ల వ్యయంతో 13వేల ఇళ్లను నిరుపేదల కోసం నిర్మిస్తున్న విషయాన్ని మంత్రి రాఘవరావు గుర్తుచేశారు. మరో 20 సం.ల పాటు తెలుగుదేశం పార్టీనే అధికారంలో కొనసాగుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. వైకాపాకు వేసే ఓటు చెల్లని నాణెం లాంటిదని, ప్రలోబాలకు లొంగకుండా , అభివృద్ధికి పట్టం కట్టాలని మంత్రి శిద్ధారాఘవరావు కోరారు. జగన్ సీఎం అవుతారన్న భ్రమలో ఉన్నారని, ఇది ఎప్పటికి సాధ్యం కాదని అన్నారు.



సీఎం భద్రతతో ఆటలా...

• ఓటమి భయంతో ప్రజల్ని రెచ్చగొడుతున్న వైసీపీ • అసత్య ఆరోపణలతో సీఎం భద్రతకు విఘాతం • రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

అమరావతి, ఆంధ్రప్రభ : వైసీపీ నాయకుల అసత్య ఆరోపణలను నమ్మి అత్యంత భద్రత కలిగిన చంద్రబాబు పాంట్రీ వాహనాన్ని తనిఖీ చేయటం సబబు కాదని, జడ్ ప్లస్ కేటగిరి కలిగిన చంద్రబాబు భద్రతతో ఆటలాడొద్దని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణప్రసాద్ హితవు పలికారు. శనివారం రాష్ట్ర టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడిన ఆయన సీఎం భద్రతను ప్రభావితం చేసే విధంగా అసత్య ఆరోపణలు చేసిన వైసిపీ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, దీని వెనుక ఉన్న కుట్రని పరిశోధించాలని డిమాండ్ చేశారు. ఈదేశంలో జడ్ ప్లస్ కేటగిరి కలిగిన నాయకులు17మంది ఉంటే వారిలో చంద్రబాబు ఒకరని, ఈకేటగిరి నాయకులకు అత్యంత సుశిక్షుతులైన ఎన్ఎస్‌జీ, సీఆర్‌పీఎఫ్, ఎస్‌పీజీ లాంటి వారితో భద్రత కల్పించటం జరుగుతుందన్నారు. అలాంటిది చంద్రబాబుకు చెందిన ఆహార పదార్ధాలు కలిగిన ఫుడ్ కంటైనర్‌ను అసత్య ఆరోపణలు నమ్మి తనిఖీ పేరుతో తాళాలు పగలగొట్టి తనిఖీ చేయటం దారుణమని, ఇది సీఎం భద్రతపై ప్రభావం చూపిస్తుందన్నారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన నాయుకుని వాహనాలను ఈవిధంగా తనిఖీ చేయటం దేశ చరిత్రలో ఇంతవరకు జరగలేదన్నారు. ముఖ్యమంత్రిని కాల్చమని, ఉరితీయమని రెచ్చగొడుతూ గత 10 రోజులుగా నంద్యాలలో ప్రచారం చేస్తున్న జగన్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమీషన్‌ను డిమాండ్ చేశారు. అదేవిదంగా నంద్యాల్లో వైసిపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచుతూ తెలుగుదేశం పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటమి భయంతోనే వైసీసీ నాయకులు ప్రజల్ని రెచ్చగొడుతూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. వైసిసి అభ్యర్ధి శిల్పా మోహన్ రెడ్డి సోదరి, వారి అనుచరులు డబ్బులు పంచుతున్న ఆధారాలు ఎన్నికల కమిషన్ కు ఫిర్యాధు చేశామని, దానిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ను కోరారు. ఈసమావేశంలో టిడిపి నాయకులు లుక్కా సాయిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికులకు
మంత్రి ఆనందబాబు వీడ్కోలు

అమరావతి, ఆంధ్రప్రభ : మక్కాకు వెళ్తున్న 447 మంది హజ్ యాత్రీకులకు సాంఘిక సంక్షేమ శాఖామంత్రి నక్కా ఆనందబాబు శనివారం హైదరాబాద్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో బయలుదేరిన యాత్రికులు మధ్యాహ్నం 12 గంటలకు జెడ్డా ఎయిర్‌పోర్టుకు క్షేమంగా చేరుకోగా, అక్కడ నుంచి రాత్రి 10 గంటలకు మరో 450 మందితోకల్సి మక్కా వెళ్లారు. హజ్‌యాత్రికులకు సహాయం అందించేందుకు రెండు విమానాల్లో నలుగురు వాలంటీర్లు కూడా వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని నాంపల్లి హజ్‌హౌస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి ఆనందబాబు యాత్రికులకు శుభాకాంక్షలు తెలుపుతూ హజ్‌యాత్ర ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది విజయవాడ నుంచే హజ్ యాత్రకు పంపించడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. విజయవాడ, కడపలలో ఆధునిక సౌకర్యాలతో హజ్ భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అహ్మద్ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి పి.ఉషాకుమారి, హజ్ కమిటీ సభ్యులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, కార్యదర్శి జలీల్, ప్రత్యేకాధికారి షకూర్, ఈవో లియాఖత్ ఆలీ, పలువురు మతపెద్దలు పాల్గొన్నారు.


మొక్కలతోనే జీవరాశుల మనుగడ

• స్పీకర్ కోడెల శివప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ : జీవరాశుల మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉందని, అందుకే విధిగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు అన్నారు. శనివారం విజయవాడలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్, బ్యుటిఫికేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన జాతీయ మొక్కలపెంపకం సెమినార్‌కు స్పీకర్‌కోడెల శివప్రసాద్‌రావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. 20శాతం ఉన్న అటవీ ప్రాంతాన్ని 40శాతానికి పెంపొందించేందుకు ప్రతి ఏడాది లక్షల మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. మొక్కల పెంపకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. 60ఏళ్ల క్రితమే చెట్లను సంరక్షించుకోవాలని ఒక కవి సినిమా పాటను కూడా రాసిన సందర్భాన్ని స్పీకర్ కోడెల గుర్తుచేశారు. అశోక చక్రవర్తి పరిపాలనలో రోడ్ల వెయిడి మొక్కలు నాటారని, దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ఎక్కడైనా పెద్ద పెద్ద వృక్షాలను తొలగించాల్సిన పరిస్థితి వస్తే ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున వాటిని వేరే చోట నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వాటిని వేరే చోట నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. చెట్లను నరికే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటే కొంత వరకైనా చెట్లను పరిరక్షించుకునే అవకాశం ఉందన్నారు. ఈ సెమినార్‌లో ఏ.పి అటవి అభివృద్ధి కార్పొరేషన్ ఎం.డి మల్లిఖార్జున్‌రావు, అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యుటిఫికేషన్ కార్పొరేషన్ ఎం.డి చంద్రమోహన్‌రెడ్డి, సిఐఐ డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎస్. రఘుపతి, నగర మేయర్ కోనేరు శ్రీధర్, చైనా దేశప్రతినిధులు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసరచన



అమెరికాలో అంతర్యుద్ధ పోకడలు

ఆధిపత్య ధోరణులు అన్ని రంగాల్లో, అన్ని దేశాల్లో ఉన్నాయి. వాటికి వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి ధోరణులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ఒకెత్తు, ఆనాటి స్మారక చిహ్నాలను నేలమట్టం చేయడం మరో ఎత్తు. చరిత్రను మరుగుపర్చలేం. ముఖ్యంగా, ప్రాచీనకాలం నాటి శిల్పకళా సంపదనూ, కళాఖండాలను కాపాడుకోవడం మన బాధ్యత. ఎవరిమీదో కోపంతో ఆనాటి శిల్పకళా సంస్కృతులను తెరమరుగుచేయాలనుకోవడం అవివేకమే.

పూర్వ పాలకుల స్మారక చిహ్నాలపై ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం, వాటిని ధ్వంసం చేయడం ప్రస్తుతం అన్ని దేశాల్లో కనిపిస్తు్న దృశ్యం. కాలమాన పరిస్థితులను బట్టి ప్రజల మనోభావాలు మారతాయి. తరాల మార్పుతో వారి అభిరుచులు, ఆరాధనలు కూడా మారతాయి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మానవ హక్కుల కోసం పోరాడే వర్గాలు జాగృతమవుతున్నాయి. పూర్వపు యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యూఎస్ఎస్ఆర్) కుప్పకూలిన తర్వాత ఆనాటి పాలకులైన జోసెఫ్ స్టాలిన్ వంటి విగ్రహాలను ప్రజలు నేలమట్టం చేశారు. ఇరాక్‌లో తిరుగులేని అధికారాలతో పాలన సాగించిన సద్దాం హుస్సేన్‌ని హీరోగా ఆరాధించేవారు ఇప్పటికీ ఉన్నారు. సద్దాం విగ్రహాలను ప్రజలు కూల్చివేసిన సంఘటనలు కూడా మన స్మృతి పథంలో ఉన్నాయి.

ఇప్పుడీ జాడ్యం అమెరికాకు సోకింది. అంతర్యుద్ధ కాలంలో ఉత్తర వర్జీనియాలో సమాఖ్య సైన్యానికి నేతృత్వం వహించిన రాబర్ట్ ఈ లీ విగ్రహాన్ని చార్లెట్టెస్ విల్లేలో పడగొట్టారు. ఉత్తర కరోలినాలోని దుర్హామ్‌లో కూడా ప్రదర్శకులు సమాఖ్య సైనికుల స్మృతి చిహ్నాలను నేలమట్టం చేశారు. బాల్టిమోర్‌లోనూ విగ్రహాల విధ్వంసం విశృంఖలంగా సాగింది. అమెరికాలో శ్వేత జాతీయుల దురంహకార ధోరణులకు సాక్షీభూతంగా నిలిచే సంఘటనలు ఈ మధ్యకాలంలో చోటు చేసుకుంటున్నాయి. చార్లోట్స్ విల్లేలో రాబర్ట్ లీ విగ్రహం కూల్చివేత సంఘటనను ఈ కోణం నుంచే చూడాలి. రెండేళ్ళ క్రితం నాటి సంఘటన దీనికి ప్రేరణ. దక్షిణ కరోలినాలోని చార్లెస్టన్‌లో నల్లజాతీయులు అధిక సంఖ్యలో హాజరైన చర్చిలో డైలాన్ రూఫ్ అనే శ్వేత జాతీయుడు జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది మరణించారు. సమాఖ్య పతాకంతో రూఫ్ చిత్రాలు ఈ సంఘటన తర్వాత ప్రముఖంగా కనిపించాయి.దీంతో దక్షిణ కరోలినాలో సమాఖ్య పతాకాన్ని దించేయాలన్న ఆందోళనలు ప్రారంభమయ్యాయి. చివరికి ప్రభుత్వం ఇందుకు అంగీకరించింది.అధికారికంగానే ఆ పతాకాన్ని అవనతం చేసింది.

అప్పటి నుంచి అనేక నగరాలు, రాష్ట్రాల్లో ముఖ్యంగా దక్షిణాన సమాఖ్య చిహ్నాలపై ఆగ్రహం వ్యక్తం చేయడం మొదలు పెట్టారు. సమాఖ్య సేనలు అప్పట్లో శ్వేత జాతీయుల ఆధిపత్యాన్ని నిలబెట్టేందుకు బానిసత్వాన్ని కొనసాగించేందుకు తోడ్పడ్డాయి. అమెరికాలో శ్వేత జాతీయుల అహంకారం ఎలాంటిదో ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం.

నల్లజాతీయుల హక్కుల కోసం మార్టిన్ లూథర్ కింగ్ వంటి యోధులు ప్రాణాలకు తెగించి పోరాడారు. సమాఖ్య సైన్యంలో పెద్ద పదవులు నిర్వహించి పై వారి మెప్పుకోసం ప్రజలపై ఉక్కుపాదం మోపిన వారి చిహ్నాలు కనిపించగానే ప్రజలలో కట్టలు తెగిన ఆగ్రహం తన్నుకు వస్తోంది. వారంతా రాబర్ట్ లీ వంటి మాజీ సైనికాధికారుల విగ్రహాలు, స్మారక చిహ్నాలపై పడ్డారు.

అమెరికా దక్షిణాది ప్రతిష్ఠకు చిహ్నాలు

ఈ విగ్రహాలను పడగొట్టేవారు ఆయా అధికారులు, నాయకుల నేపథ్యం గురించే ఆలోచిస్తున్నారు కానీ, ఆనాటి శిల్పకళా సంస్కృతులను కాపాడుకోవాలన్న ఇంగితాన్ని పాటిం చడం లేదని విగ్రహ విధ్వంసక వ్యతిరేకులు పేర్కొంటున్నారు. సమాఖ్య చిహ్నాలు అమెరికా చరిత్రకు దర్పణాలనీ, ఆనాటి శిల్పకళా వైభవాన్ని కాపాడుకోవల్సిన అవసర ముందనీ వీరు వాదిస్తున్నారు.

ట్రంప్ వాదనా అదే

ఈ వాదాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సమర్థిస్తున్నారు. ఈ వారంలో రాబర్ట్ ఈ లీ విగ్రహాన్నీ, స్టోన్‌వాల్ జాక్సన్ విగ్రహాన్ని పడగొట్టారు. వచ్చే వారం జార్జి వాషింగ్టన్ విగ్రహాన్ని పడగొడతారా? ఈ విషయమై ఎవరిమటుకు వారు ప్రశ్నించుకోవాలి. ఎక్కడికి పోతున్నాం మనం? దీనికి అంతం ఎక్కడ? అని ట్విట్టర్‌లో ఆయన తన వాదాన్ని వినిపించారు. ఇలాంటివి అవివేకమైన చర్యలని ఆయన ఖండించారు. ముఖ్యంగా, అలనాటి చిహ్నాలను పడగొట్టాలనుకోవడం మూర్ఖత్వమేనన్నారు.

వివాదాస్పదమవుతున్న చర్చ

విగ్రహాల కూల్చివేతకు అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ సాగుతున్న చర్చ వివాదమవుతోంది. ఏ వాదానికి అదే సమర్థనీయంగా కనిపిస్తుంది. సమాఖ్య దేనికోసం నిలిచింది. బానిసత్వాన్ని కొనసాగించడం కోసమేనా? అలా అయితే, ఆనాటి పాలకుల విగ్రహాలను ఇప్పటికీ కొనసాగించడం అంటే బానిసత్వాన్ని సమర్థించడమా? శ్వేత దురంహంకారాన్ని సమర్థించడమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చారిత్రక ఆధారాలు ఆనాటి రికార్డుల్లో స్పష్టంగానే కనిపిస్తుంటాయి. సమాఖ్య తత్వం ఎప్పుడూ శ్వేత జాతీయుల ఆధిపత్యం కోసమే నిలిచింది. ఆనాటి పాలకుల దురహంకారానికి ప్రతీకలుగా విగ్రహాలు నిలిచాయి. శ్వేత జాతి సంస్కృతి వారసత్వాలను కాపాడుకోవడం ఎంతైనా అవసరమని వాదించేవారూ అమెరికాలో ఉన్నారు. అలా అని వారి వాదం సమర్థనీయమని కాదు. ఎవరి వాదం వారిది.

దక్షిణ కరోలినాలో సమాఖ్య పతాకాలను కిందికి దించేస్తున్నారు. అనేక నగరాలు, రాష్ట్రాల్లో ఇదే తరహా వాతావరణం కనిపిస్తోంది. పతాకాలు మాత్రమే కాదు, విగ్రహాలు, ఇతర చిహ్నాలు తొలగిస్తున్నారు. సమాఖ్యను గౌరవించే చిహ్నాలు ఏవీ కనిపించడం లేదు. ఇలాంటి చిహ్నాలు అనేకమున్నాయి. దక్షిణ పావర్టీ లా సెంటర్ నిర్వహించిన సర్వేలో పబ్లిక్ ప్రదేశాల్లో సమాఖ్య చిహ్నాలు, పేర్లు అనేకం కనిపించాయి.

ఈ ఏడాది ఆరంభంలో న్యూ ఓర్లాన్స్‌లో సమాఖ్య చిహ్నాలను ధ్వంసం చేశారు. విగ్రహాలను నేలమట్టం చేశారు. వీటిల్లో 1891నాటి విగ్రహం ఉంది. 1874లో రక్తపాతం సృష్టించిన తిరుగుబాటుకు చిహ్నంగా నిలిచింది కూడా ఉంది. ఆనాటి అధ్యక్షుడు జఫర్‌సన్ డేవి, జనరల్ పిజిటి బ్యూర్‌గార్డ్ విగ్రహాలు కూడా ఉన్నాయి. వీళ్ళలో కొందరు దేశానికి వ్యతిరేకంగా పోరాడిన వారున్నారు. అంతర్యుద్ధ కాలంలో యూనియన్‌కి వ్యతిరేకంగా పోరాడిన వారున్నారు.

చార్లోట్స్ విల్లేలో...

వర్జీనియాలోని చార్లెట్స్ విల్లేలో రాబర్ట్ లీ, స్టోన్‌వాల్ జాక్సన్ విగ్రహాలను కూల్చి వేశారు. ఇందుకు సిటీ కౌన్సిల్ ఆమోదం కూడా తెలిపింది. ప్రస్తుతంజస్టిస్ పార్క్‌గా ఉన్న జాక్సన్ పార్క్ ను కూడా ధ్వంసం చేశారు. ఈ చర్యలన్నింటిపైనా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఈ చర్యలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ విగ్రహాలు, స్మారక చిహ్నాలు జిమ్ క్రో హయాంలో ఏర్పాటయ్యాయి. పౌర హక్కుల ఉద్యమానికి వీటితో జవాబు చెప్పారు. అప్పట్లో పోలీసులు, రాష్ట్ర మిలీషియాల జాత్యహంకార ధోరణులకు వ్యతిరేకంగా పోరాడిన వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు.

వలసలకు ట్రంప్ వ్యతిరేకం

దేశాధ్యక్షుడు ట్రంప్ ఎవరి వైపు అనేది ఆయన ప్రసంగాలను బట్టే స్పష్టమవుతోంది. వలసలకు వ్యతిరేకంగా ఆయన ఎన్నికల ప్రచారంలో పెద్ద హామీలు ఇచ్చారు. ఆఫ్రికా నుంచి వచ్చిన వారు, ఇతర వర్ణాల వారి పెత్తనం పెరిగిపోతోందన్నారు. తాను అధికారంలోకి వస్తే వలసలను అరికడతానని హామీ ఇచ్చారు. అందుకు తగినట్టుగానే ఏడు ముస్లిం దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించకుండా నిషేధం విధించారు. నల్లజాతి ప్రతినిధిగా బరాక్ ఒబామా అధ్యక్షునిగా ఎనిమిదేళ్ళ పాటు అధికారంలో కొనసాగడాన్ని శ్వేతజాతీయులు సరిపెట్టుకోలేకపోతున్నారు. నిజానికి ఒబామా ఎటువంటి వివక్ష లేకుండా అందరి అభిమానాన్ని చూరగొనేందుకే తన పదవీ కాలమంతా పని చేశారు. ఒబామాపై ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇలాంటి వాదాలు పుట్టుకుని రావడానికి కారణమైంది.

ఆఫ్ఘనిస్థాన్‌లో బుద్ధ విగ్రహాలూ ధ్వంసం

ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలో ఉన్నప్పుడు చారిత్రక ప్రసిద్ధమైన బుద్ధుని విగ్రహాలను పడగొట్టారు. తాలిబన్లను ఉన్మాదులుగా అభివర్ణించేవారు. వారు మానవ జాతికే మాయని మచ్చనేవారు. మధ్యయుగం నాటి సంప్రదాయాలను ప్రవేశపెట్టి పౌరులను వేధించేవారు. ముఖ్యంగా మహిళలు చదువుకోరాదనీ, గడపదాటరాదని ఆంక్షలు విధించేవారు. ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా పాకిస్తాన్‌లో పోరాడిన యూసఫ్ మాలాలాకు నోబెల్ బహుమతి లభించింది.

ఇరాక్‌లోనూ అంతే

ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ని కీర్తించిన వారే ఆయన గద్దెదిగగానే ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఇచ్చారు. ఆయనకు ఉరిశిక్ష అమలు జరిగేట్టు చేశారు. ఆయన విగ్రహాలను ధ్వంసం చేశారు. ఇలాంటి చర్యలు దుందుడుకు స్వభావానికి అద్దం పడతాయి. అమెరికాలో కూడా పూర్వపు పాలకులు, ఆర్మీ జనరల్స్ విగ్రహాల విధ్వంసం ఇప్పుడు అడ్డు,అదుపులేకుండా సాగుతోంది. అంతమాత్రాన చరిత్ర కనుమరుగు అవుతుందా?



నాటి పరిణామాలే ఉత్ప్రేరకాలా!

బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన నేతల విగ్రహాలను తొలగించాలన్న నిర్ణయం ఇప్పుడు అమెరికాలో 150 ఏళ్ళనాటి పరిస్థితులను జ్ఞప్తికి తెస్తోంది. అప్పట్లో చోటుచేసుకున్న అంతర్యుద్ధపు చివరి బుల్లెట్ శబ్దాలను ప్రస్తుత నేతలు మననం చేసుకుంటున్నారు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన నాయకుల వందలాది విగ్రహాలను స్థానిక ప్రభుత్వాలు ప్రస్తుతం తొలగిస్తున్నారు. ఇది అమెరికా చరిత్రను తుడిపేయాలనుకోవడమే తప్ప మరోటి కాదని, దీన్ని వ్యతిరేకిస్తున్న వారు అంటున్నారు.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... వివాదాస్పద విగ్రహాలన్నీ చాలా అందంగా ఉన్నాయి.. త్వరలో అవి అదృశ్యమవుతాయి.. వాటి అందాలను పట్టణాలు కోల్పోతాయి.. అంటూ చేసిన ట్వీట్ వివాదాన్ని రగిల్చింది. వాటినెప్పుడు ప్రతిష్ఠించారని కూడా ఆయన ఆ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఆ తరవాతే విగ్రహాల తొలగింపు మొదలైంది. 1865లో అంతర్యుద్ధం ముగిసిన ఒక తరం తరవాత వీటిని అమెరికాలోని వివిధ ప్రాంతాలలో ప్రతిష్ఠించారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ నుంచి కూడా కాన్ఫడరేట్ విగ్రహాలను తొలగించాలని డెమోక్రాట్లు పిలుపునిచ్చారు. ఆఫ్రికన్-అమెరికన్లకు సమాన హక్కులు కావాలని 1950-1960 మధ్య కాలంలో రెండోసారి ఆందోళన తలెత్తింది. అమెరికాలో మొత్తం 700 కాన్ఫెడెరేట్ స్మారకాలున్నాయి. ఇవన్నీ దక్షిణ అమెరికా ప్రాంతంలోనే కొలువయ్యాయి. కొన్నింటిని సైనికులకు అంకితమిచ్చారు. రాబర్ట్ ఇ లీ, థామస్ స్టోన్‌వెల్ జాక్సన్ వంటి ప్రముఖ జనరల్స్ విగ్రహాలూ ఇందులో కొలువుదీరాయి. మాన్యుమెంట్స్ మస్ట్ గో అంటూ ట్విటర్‌లో వరద మొదలవడంతో రిచ్‌మండ్ అధికారులకు వీటిని షేర్ చేశారు. దేశంలో పెరుగుతున్న అసహనానికీ, జ్ఞాపక శక్తిని దుర్వినియోగం చేస్తున్న దానికీ ఉదాహరణగా రాబర్ట్ లీ ముని మనవడు పేర్కొన్నారు. కు క్లక్స్ క్లాన్, నియో-నాజీ మద్దతు దారులు నిర్వహించిన యునైట్ ది రైట్ ర్యాలీ అనంతరం ఆయన వ్యాఖ్య చేశారు. లీ విగ్రహాన్ని తొలగించాలన్న సిటీ కౌన్సిల్ నిర్ణయం తప్పని వారు నిరసన వ్యక్తంచేశారు. జాతి వివక్ష తప్ప ఇది మరొకటి కాదన్నారు.

విగ్రహాలు బానిసత్వాన్ని గుర్తుచేయడానికి కాదని, వాటిని తొలగిస్తున్నవారు వాదిస్తున్నారు. ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకంగా దేశ హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. కాన్ఫడెరేట్ పతాకం, ఈ ప్రాంత చరిత్రనూ, సంస్కృతినీ ప్రతిబింబిస్తుందన్నారు. చరిత్రకారులు మాత్రం ఈ స్మారకాలు బానిసత్వానికి గుర్తులనీ అంగీకరిస్తున్నారు. బ్లాక్ అమెరికన్లు సమాజంలో తిరగడమే తప్పుగా భావిస్తారు.

స్మారకాలను తొలగించడమంటే చరిత్రను చెరిపేయడమేనని మెయిన్ గవర్నర్ పాల్ లీపేగ్ అంటున్నారు. భావితరాలకు చరిత్ర ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. వాటిని తొలగిస్తుంటే తనకు 2001 సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్, పెంటగాన్‌పై దాడులు గుర్తొస్తున్నాయని తీవ్ర వ్యాఖ్య చేశారు. సమాఖ్య పతాకాన్ని ప్రజలు ఇంకా ఎందుకు ఎగరేస్తున్నారో ఒక్కసారి ఆలోచించండి. విగ్రహాలను తొలగించడం ఎంత తప్పో అర్థమవుతుందన్నారు.

2015లో అంతర్యుద్ధానికి 150వ వార్షికోత్సవాన్ని నిర్వహించిన కొద్ది రోజుల తరవాత ఒక శ్వేత జాతీయుడు సౌత్ కరోలినాలోని ఆఫ్రికన్ అమెరికన్ చర్చిలో తొమ్మిదిమందిని కాల్చి చంపాడు. ఆ సమయంలో అతను కాన్ఫడెరేట్ పతాకాలను ధరించి ఉన్నాడు. విప్లవ స్ఫూర్తిని గుర్తుచేయడానికి చేసిన ఇటువంటి చర్యను శాంతియుత చర్యగా భావించగలమా అంటూ మీడియా వ్యాఖ్యానించింది.

అమృత గుళికల్ని ఆస్వాదిద్దాం!

సాహిత్యం సమాజ తీరుతెన్నుల్ని మన ముందుంచుతుంది. అంటే మారుతున్న ధోరణుల్ని మనం సాహిత్యంతో బేరీజు వేసుకోవచ్చు. ఒక ప్రక్రియ పుట్టినప్పటి నుంచి నేటివరకు పరిశీలించటం ఒకవంతయితే, రచయితాపరంగా వారి సాహిత్యాన్ని అధ్యయనం చేసి అర్థం చేసుకోవటం మరోవంతు.

అందుకే కథానికా ప్రక్రియకు శతజయంతి చేసుకోవడమే కాకుండా గురజాడ, గిడుగు లాంటి మహానుభావుల స్వర్ణోత్తర శతజయంతుల్నీ జరుపుకున్నాం. అలాగే పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, కాళోజీ, వట్టికోట ఆళ్వార్‌స్వామి, కొనకళ్ల వెంకటరత్నం లాంటి ప్రభృతుల శతజయంతులనూ నిర్వహించుకున్నాం. వాళ్ల సాహిత్యాన్ని పునర్ముద్రించుకుని ముందుతరాలవాళ్లకు అందిస్తున్నారు. ఇప్పుడు ఈ నెలలో చక్రవర్తి రంగస్వామిగారి శతజయంతి ప్రారంభమైంది. ఆ సందర్భంలో ఆయన గురించి, ఆయన రచనల గురించి ఆలోచించడం చాలా అవసరం-



చక్రవర్తి రంగస్వామి

నా దృష్టిలో వ్యక్తివేరు, సాహిత్యం వేరు కానేకాదు. వ్యక్తిత్వాన్ని బట్టి భావజాలం, ఆలోచనలు, వాటినిబట్టే స్పందన ఉంటుంది! స్పందనే సాహిత్య సృష్టికి మూలం. సున్నిత విషయాలకూ స్పందించే వ్యక్తులే రచయితలవుతారు. లేకపోతే రచయితలకు సున్నిత మనస్తత్వం ఉంటుంది!

ఇలా ఆలోచించే నాకు ఆంధ్రభూమిలో పనిచేసేప్పుడు సహచరులలో చక్రవర్తి రంగస్వామిగారంటే ఓ ప్రత్యేక అభిప్రాయముండేది. అందరినీ గౌరవించే మనస్తత్వం, మితభాషణం, వీటన్నింటికన్నా మంచి కథానికా రచయితన్న విషయం అందుకు కారణాలు. ఆ రోజుల్లోనే నేను కథానికలు రాయడం ప్రారంభించింది. అందుకని కాస్త సమయం దొరికితే ఆయన దగ్గరకు చేరేవాణ్ణి. వయసులతో సంబంధం లేకుండా మా ఇద్దరి మధ్యా సంభాషణలన్నీ మా ఇద్దరికీ ఇష్టమైన కథానికల చుట్టూనే తిరుగుతుండేవి. ఇది దాదాపు ఓ నలభై, నలభై అయిదు సంవత్సరాల నాటి మాట! ఆయన చక్కటి కథానికల్ని రాశారు. అంతేకాకుండా ఆయన నవలలు, కవిత్వం, బాల సాహిత్యం రాసినా, కథానికలే ఆయనకి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. అందుకే కథానికలపై రాయడంకన్నా ముందు రంగస్వామి గార్ని నా జ్ఞాపకాలలోంచి బయటకు తీసి మీకు పరిచయం చేయాలనే తాపత్రయంతోటే ముందు ఇంతటి ఉపోద్ఘాతం!

ఇది ఆయన సమగ్ర కథానికా సంపుటి. ఆయనను పరిపూర్ణ కథానికా రచయితగా ఆవిష్కరిస్తుంది. రచయిత సంస్కారవంతుడు కాబట్టి కథానికలలో సంస్కారానికి పెద్దపీట వేశారు. సంస్కారవంతమైన పాత్రలు రంగస్వామిగారి కథానికలో విరివిగా కనిపిస్తాయి. వీరి కథానికల్లో మానవ సంబంధాలు, సంస్కరణవాదం, అభ్యుదయవాద, అంటరానితనానికి వ్యతిరేకత, అన్యాయ ఖండనలాంటి వస్తువులు కనిపిస్తాయి. అంతేకాదు, ప్రత్యేక శిల్పం రంగస్వామిగారి సొత్తు! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖ వారి మాసపత్రిక ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన కథానికల పోటీల్లో వెన్నెలవాడ కథానిక మొదటి బహుమతి పొందింది. కులం తక్కువ సుధాకర్ని వివాహం చేసుకోవడానికి కుమార్తె వసు ఇష్టపడుతోందన్న విషయాన్ని తమ్ముడు లక్ష్మయ్య ద్వారా తెలుసుకున్న రామయ్య మండిపడతాడు. పెళ్లి చేసుకోని లక్ష్మయ్య, అన్నపిల్లల్ని తన పిల్లలకన్నా మిన్నగా పెంచుతాడు. రామయ్య ఆడపిల్లలకంత చదువెందుకని వాదించినా పట్టుబట్టిన లక్ష్మయ్య, వసు వైద్యవిద్య చదవడానికి కారణమవుతాడు.

బాబాయి నుంచి సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్న వసుకి కుల మత భేదాలు లేవు. గుణమే ప్రధానంగా భావించి సుధాకర్ని వివాహం చేసుకోవడానికి ఇష్టపడుతుంది. దాంతో రామలక్ష్మణులు లాంటి రామయ్య, లక్ష్మయ్యల మధ్య సంబంధాలు దెబ్బతింటాయి. తమ గ్రామంలో వర్ణవైషమ్యాల్ని నశింపచేయాలని తీవ్రంగా కృషిచేస్తాడు లక్ష్మయ్య. అందరికీ పనిదొరుకుతుంది. గ్రామ ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుంది. ఊరి స్వభావాన్నే మార్చిన తమ్ముడు పట్ల అన్న విముఖత క్రమంగా తగ్గిపోతుంది. అన్నదమ్ములేకమవుతారు. సుధాకర్‌తో వసు పెళ్ళికి రామయ్య ఒప్పుకోవడంతో ఆ వూరు వెన్నెలవాడే అవుతుంది. అరవై ఏళ్ళక్రితం స్త్రీ విద్యావశ్యకత, మూఢనమ్మకాలు, కుల మత భేదంలేని సమసమాజం కావాలంటూ అభ్యుదయ భావాలతో ఇంత చక్కటి కథానికని రాసారు రంగస్వామిగారు.

కిటుకు తెలిసినవాడు కథానికని బక్కటి మనిషి గుర్రంమీద బయల్దేరాడు. ఆ గుర్రానికి ముందొకరు వెనుక పక్కలా కొందరు గొలుసులు, మోకులు, పలుగులు పట్టుకు నడిచేవాళ్ళు...! అంటూ ప్రారంభించి ఇప్పుడా గుర్రం మాత్రం లేదు కాని, దానికి బదులు సింహపుతల ఉండే చేతికర్రపుచ్చుకుని నడుస్తుంటే అతనికి ముందు, వెనుక, పక్కలా ఎవరూ లేరు. కానీ బీదముఖాలతో ఇద్దరు గుమాస్తాలు కాడికి కట్టిన ఎద్దుల్లా నడుస్తున్నారు అంటూ ముగిస్తారు. మధ్య జరిగిన కథ తేలికగా అర్థమైపోతుంది. ఇతివృత్తం అంటే వస్తువు వృత్తంలా ఎక్కడ నుంచి ప్రారంభమైందో అక్కడికే తీసుకువచ్చి ఆపాలి. ఆ లక్షణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది ఈ కథానికలో. ముగింపు పూర్తవగానే పాఠకుడికి ప్రారంభం గుర్తుకు రావాలి అంటారు పాలగుమ్మి పద్మరాజుగారు. కథానికకు ప్రారంభం, ముగింపు ప్రత్యేకంగా కనిపించాలి అంటారు బుచ్చిబాబు గారు. ఈ లక్షణాలు రంగస్వామిగారి ఈ కథానికలోనే కాదు, చాలా కథానికల్లో కనిపిస్తాయి. సులభశైలిలో కథానికలన్నీ చకచకా చదివింపజేస్తాయి. క్లుప్తతకూడా ఈయన కథానికల్లో కనిపిస్తుంది. ఆమెకు కనపడ్డ చంద్రుడు లేని ఆకాశం సర్వసుఖభోగాలకూ తిలోదకాలిచ్చిన తన జీవితంలా అనంతంగా భయంభయంగా తోచింది సరోజినికి అంటూ చీకటిగుండె కథానికని ముగిస్తారు. ఈ ముగింపు వాక్యంతో సరోజిని జీవితమంతా మన కళ్ళముందుకి వస్తుంది. చీకటి గుండె శీర్షికల్ని అర్థవంతంగా పెట్టడం ఈ రచయిత ప్రత్యేకం. స్త్రీలోని సర్వమూ అయిన సహనము, పవిత్రత ముందు అల్పత్వంతో అతను అఘాధంలోకి ఎలా జారిపోయాడో చెబుతుంది స్త్రీ కథానిక. అంజి జీవితంలోకి ఆలస్యంగా వచ్చిన వసంతం లత.

పెళ్ళితో బాధ్యత పెరగడం కాదు, బరువు తగ్గుతోందని చెప్పిన చక్కని కథానిక. మెరుగుపడని గ్రామ ఆరోగ్యాన్ని కళ్ళముందుంచే కథానిక జనపదమా? జనస్థానమా? గతంలాగే శశి జ్ఞాపకాలు అతనికి నీలినీడలు ఎలా మారాయో నీలి నీడలు కథానిక చెబుతుంది. ఇలా ఏ కథానిక ప్రత్యేకత ఆ కథానికది. కథానికలను ఎంత అలవోకగా పరిచయం చేస్తున్నానో, అంతకన్నా అలవోకంగా ఆ కథానికల్ని మీరు చకచకా చదివేయగల రు. అది నా నమ్మకమే కాదు, యథార్థం కూడా!

-డా. వేదగిరి రాంబాబు
93913 43916

ఆచి.. తూచి.. అడుగేయాలి!

సమయం చూసుకోకుండా దుకాణాల చుట్టూ తిరిగి ఏరికోరి కొనుక్కొచ్చిన చీరలను పక్కింటి ఆంటీకి చూపించేవరకూ నిద్రపోదు అమ్మడు.

చీరలన్నీ చాలా బాగున్నాయి. అసలు నీ సెలక్షన్ బ్రహ్మాండం. ఏ చీరకాచీర చాలా గొప్పగా ఉందనుకో. ఇది బాగుంది, అది బాలేదు అని చెప్పలేం. అని ఆంటీ కితాబు నిస్తుంటే మనసు ఆనంద డోలికల్లో తేలిపోతుంటుంది.

పిన్నిగారూ! చీరెల హడావిడిలో పడి మీకు కాఫీ ఇవ్వటమే మరిచిపోయాను సుమీ! ఉండండి, ఒక్క క్షణంలో కాఫీ తెస్తా అంటూ వంటింట్లోకి పరుగులు తీస్తుందా ఇల్లాలు.

ఒక్క చీరలనే కాదు, ప్రతి దానికీ తెలిసిన వారినో సన్నిహితులనో అభిప్రాయాలను సలహాలను కోరటం మనందరికీ అలవాటే.

నా హెయిర్ స్టైల్ ఎలా ఉంది? ఫేస్‌బుక్‌లో నా ఫొటో పై నీ కామెంట్ ఏమిటి? కొత్త పెన్ను కొన్నాను, ఎలా ఉంది? ఈ మొబైల్ పీస్ ఇప్పుడే మార్కెట్‌లోకి వస్తే పట్టుకొచ్చాను. బావుందా? వంటి చిన్న విషయాల నుంచి, ఏ కారు కొనమంటావు? ఎలాంటమ్మాయిని చేసుకోమంటావు? వంటి పెద్ద నిర్ణయాల వరకూ ఇతరుల అభిప్రాయాలు తీసుకోనిదే అడుగు ముందుకు పడదు.

అమెరికా వారు కూడా ఈ విషయంలో మనకంటే రెండాకులు ఎక్కువే చదివారనిపిస్తుంది. ముఖపరిచయంకూడా లేకపోయినా, ఎదుటివారిలో ఏదైనా నచ్చితే బాహాటంగానే బావుందని ప్రశంసల జల్లు కురిపించేస్తారు.

మీ నెయిల్ పాలిష్ అద్భుతం అని అబ్బాయి కితాబునిస్తే, ఆ నెయిల్ పాలిష్ కలర్ ఎంచుకోవటానికి ఎన్నిషాపులు తిరిగిందీ, చివరకు ఆఫర్‌లో ఎంతకు కొన్నదీ, పాత పాలిష్ వదల గొట్టటానికి ఎంత ప్రయాస పడిందీ వైనవైనాలుగా సినిమా స్కోప్‌లో కళ్లకు కట్టిస్తుంది అమ్మడు.

అభిప్రాయాలు కోరడం, వ్యక్తిగత విషయాలకే పరిమితం కాదు. ఆఫీసుల్లో ముందే బాసు నిర్ణయాలు తీసుకుని స్టాఫ్ మీటింగులో అభిప్రాయసేకరణ పేరిట చర్చకు పెడతాడు.

మీరేమనుకుంటున్నారో చెప్పండి. ఏమైనా మార్పులు అవసరమనిపిస్తే చేద్దాం అని బాసు చాలా ప్రజాస్వామ్యయుతంగా ఉన్నట్లు ప్రకటిస్తారు.

బాసు నిర్ణయాలను భేష్ అంటూ కీర్తించే వారేగానీ బాగాలేవు అని నిష్కర్షగా చెప్పే అమాయకులెవరూ ఉండరు.

ఇంకొందరు బాసులు సమావేశ నిర్ణయాలను ముందుగానే



మేనేజ్ చేస్తారు. శంఖంలో పోస్తేగానీ తీర్థం కాదన్నట్లు సమావేశంలో చర్చకు పెడితే గానీ ఆమోదించలేని సందర్భాల్లో తమ మనసెరిగి నడుచుకునే వారిని సన్నద్ధం చేస్తారు.

ఫలానా వారి పేరును నువ్వు ప్రతిపాదిస్తే ఇతడు బలపరుస్తాడు. ఇలా చేస్తే బావుంటుందని నువ్వు ప్రతిపాదించు, దానికి అతగాడు వత్తాసు పలుకుతాడు. అంటూ సమావేశ నిర్ణయాలను ముందే ప్రభావితం చేసేవారూ ఉంటారు.

ఎదుటివారి అభిప్రాయాలను, సలహాలను ఎవరైనా ఎందుకు కోరతారు?

తమ ఎంపిక లేదా నిర్ణయం బాగుందని ఎదుటివారు చెప్తే పొంగిపోతారు.

వారి అభిప్రాయం సానుకూలంగాలేనపుడు ముఖం చిట్లిస్తారు. అప్పుడు పల్లవి మారుస్తారు.

నాకైతే ఇది చాలాబాగా నచ్చింది. లోకోభిన్నరుచి అంటారు కదా! బహుశ మీకు ఆ రంగునప్పుతుందేమో.

నాకు బావుండదు అంటూ తమ నిర్ణయాన్ని సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తారు.

మన నిర్ణయంతో విభేదించినా, ఎదుటివారు చెపుతున్నది సబబుగా తోచినపుడు పెద్దమనసుతో ఆ విషయాన్ని ఒప్పుకోగలగాలి.

చీటికి మాటికి అయిన దానికి కాని దానికి ఇతరుల అభిప్రాయాలు కోరడాన్ని మానుకోవాలి. ఎటూ తేల్చుకోలేని సందర్భాల్లో ఆ విషయంపై పట్టు, అవగాహన ఉన్నవారిని సలహా అడగడంలో తప్పులేదు. అప్పుడు సందేహాలు తొలగి ధైర్యంగా అడుగుముందుకు వేయటానికి వీలవుతుంది.

అంతేగానీ ఎవరిని పడితే వారిని అభిప్రాయాలు కోరితే ప్రయోజనం లేకపోగా మరింత గందరగోళంలో పడతాం.

అలాగే రాగద్వేషాలకు అతీతంగా అభిప్రాయం, సలహా చెపుతున్నారా? లోపల అక్కసో అసూయో పెట్టుకుని మనల్ని పెడదారి పట్టిస్తున్నారా? అనేదీ తరచి చూడాలి.

కొందరు మనకెందుకొచ్చిన గొడవ అనుకుంటూ కర్ర విరగకుండా, పాము చావకుండా సలహా పారేస్తారు.

ఇంకొందరు మెరమెచ్చు కబుర్లతో బురిడీ కొట్టిస్తారు.

మరికొందరు అడగకుండానే ఉచిత సలహాలు విసురుతారు. మన బుర్రను పాడుచేస్తారు. అప్పటిదాకా ఆనందంగా ఉన్న మనసు అల్లకల్లోల మవుతుంది.

ఫలానా వ్యక్తితో పెళ్లని చెప్పగానే ఆ వ్యక్తి జాతకం మొత్తం తనకే తెలిసినట్లు చిట్టా విప్పుతారు.

ఈ చిట్టాలో సత్యమేదో, అసత్యమేదో తేల్చుకోలేక, అలా అని చెప్పి ఆ విషయాలను పక్కన బెట్టే ధైర్యం లేక తిప్పలు పడతారు.

ఎందుకు రిస్కు తీసుకోవడం. అనుకునే అతి జాగ్రత్త పరులు పెళ్లిని రద్దు చేసుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు.

పైకి కటువుగా అన్పించినా ఎదుటివారు చెప్తున్న అభిప్రాయంలో వాలిడ్ పాయింట్ ఉందనుకున్నపుడు, దాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఒకరిద్దరి మాటలతో ఎటూ తేల్చుకోలేనపుడు మరికొందరినీ రంగంలోకి దింపవచ్చు. అప్పుడు కూడా తొందరపడకుండా ఆచి తూచి అడుగేయటం మంచిది.

ఎవరు ఏం చెప్పినా చివరకు మనసు మాట వినాలి. మనసుకు తర్కం తెలీకపోవచ్చు. ఆ విషయంలో పరిజ్ఞానం లేకపోవచ్చు. కానీ మనసుకు మించిన ఆత్మీయనేస్తం, ఆప్తబంధువు ఎవరుంటారు?

ఇంతకీ మీరు ఏయే విషయాల్లో ఇతరుల అభిప్రాయాలను కోరుతుంటారు?

వాటి నుంచి మీరు ఏమి ఆశిస్తున్నారు?

-గోవిందరాజు చక్రధర్
98498 70250

విలీనం ఖాయం


ట్విట్టర్‌లో పన్నీరుసెల్వం



చెన్నై: అన్నాడీఎంకే విలీనానికి విబేధాలు లేవని తమిళనాడు మాజీ ముఖ్య మంత్రి ఓ పన్నీరుసెల్వం స్పష్టం చేశారు. ఎం జీఆర్, అమ్మా ఆశయాల సాధన కోసం తాము ఏకమవుతున్నట్లు శనివారం ఆయన వెల్లడించారు. విలీనంఖా యమైందని చెప్పారు. సంప్రదింపులు సుహృద్భావ వాతావరణంలో జరుగుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు పన్నీరు ట్వీట్ట ర్ ద్వారా వెల్లడించారు. జయలలిత సమాధి వద్ద ముఖ్యమంత్రి పళనిస్వామి, పన్నీ రుసెల్వం ఇరువురు విలీనంపై సంయుక్త ప్రకటన చేస్తారని పార్టీవర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే, తమ డిమాండ్లను పూర్తిగా అంగీకరించాలని పన్నీరు షరతులు పెట్టినట్లు తెలిసింది. తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి పళనిస్వామికి 122 మంది ఎమ్మెల్యేల మద్ధతు ఉండగా, పన్నీరుసెల్వంకు 11 మంది శాసన సభ్యుల సపోర్టు ఉంది. అయితే, తమ వెంట కూడా 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ టీటీవీ దినకరన్ ప్రకటించడం గమనార్హం. జయలలిత మృతిపై ఈపీఎస్ సర్కారు విచారణకు ఆదేశించడాన్ని ఓపీఎస్ వర్గం స్వాగతించింది. అయితే, పార్టీ ప్రధాన కార్యదర్శి వికే శశికళ, డిప్యూటీ ప్రధాన కార్య దర్శి టీటీవీ దినకరన్‌లను పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్‌ను ఓపీఎస్ వర్గీయులు గట్టిగా వినిపిస్తున్నారు. రెండు వర్గాల విలీనానికి మెరీనా బీచ్‌లోని అమ్మ సమాధి వద్ద ఏర్పాటు చేయడంతో ఏ క్షణం ఎలాంటి ప్రకటన పార్టీ శ్రేణులు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

చైనాకు విద్యుత్ షాక్

● డ్రాగన్ బల్బు ఆరిపోయేలా భారత్ నిబంధనల తయారీ? ● స్మార్ట్‌నాణ్యత విషయంలో రాజీకి తావు లేకుండా సీఈఏ సిఫార్సులు!
● చైనా లక్ష్యం కాదంటున్న కేంద్రం ● కానీ దెబ్బ తగిలేది ఆ దేశం కంపెనీలకేనని నిపుణుల అంచనా



న్యూఢిల్లీ: భారత్, చైనాల మధ్య వివాదాలు, ఘర్షణలు హిమాలయాలు, ఆ సమీపంలోనే జరుగుతుంటాయి. అయితే.. చైనా తెంపరితనానికి విరుగుడు భారత్ అక్కడ కాకుండా వేరే చోట చూపుతోంది. మరో చోట స్విచ్ నొక్కితే.. ఇక్కడ చైనా బల్బు ఆరిపోయేలా పావులు కదుపుతోంది. విద్యుత్ పరికరాల సరఫరా విషయంలో భారత్ నిబంధనలు చైనాకు షాక్ కొడుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ నెట్‌వర్క్‌ను కాపాడుకోవడానికి, పవర్ స్టేషన్లు భద్రంగా ఉండడానికి, సైబర్ దాడులకు విద్యుత్ గ్రిడ్ పాడవకుండా ఉండేలా కొత్త నిబంధనలు రూపొందించడానికి భారత్ సన్నద్ధమవుతోంది. దీంతో ఈ పనుల కోసం పోటీ పడడం చైనా కంపెనీలకు కష్టమవుతుంది. విదేశీ కంపెనీలకు కంట్రాక్టులు ఇచ్చేటప్పుడు భారత్ కంపెనీలకు కూడా ఆయా దేశాల్లో పనులు దొరికేలా నిబంధనలు పెడతామని విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల ప్రకటించారు. చైనాను దృష్టిలో పెట్టుకునే ఆయన ఈ ప్రకటన చేసారని తెలుస్తోంది. ఒక దేశానికి వ్యతిరేకంగా తాము పని చేయడం లేదని ప్రభుత్వం చెబుతున్నా, చైనాను దృష్టిలో పెట్టుకునే ఈ వ్యాఖ్యలు చేసారని సమాచారొ౦ఞ. ప్రభుత్వం నిబంధనలు విధిస్తున్న విద్యుత్ రంగంలో ఎక్కువగా చైనా కంపెనీలు కంట్రాక్టుల కోసం పోటీపడుతున్నాయి. అయితే.. మన గ్రిడ్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేయకుండా ఉండేందుకేఈ నిబంధనలని చెబుతున్నారు కానీ, ఆయా నిబంధనలను చైనా కంపెనీల బలహీనతలను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారని అంచనా. ప్రభుత్వ వర్గాలు మాత్రం విద్యుత్ వ్యవస్థకు నష్టం జరగకుండానే జాగ్రత్తలని, అన్నీ ఆన్‌లైన్‌లోనే జరిగే ఈ కాలంలో సైబర్ దాడులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేమని అధికారులు అంటున్నారు. వివిధ ఎలక్ట్రికల్ పరికరాల్లో ఎలక్ట్రానిక్ సర్క్యూట్లు ఉంటున్నాయి. నెట్‌వర్క్ తో అనుసంధానమైన వీటిని సైబర్ దాడులతో పనికిరాకుండా చేయొచ్చు. అందుకే ఆయా పరికరాలు సైబర్ దాడులకు గురి కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) చైర్మన్ వీకే వర్మ అన్నారు. అప్పుడు చైనా కంపెనీలు సదరు పరికరాలను తక్కువ ధరకు తయారు చేసి మనకు అమ్మడం కుదరదు. చైనా బలమంతా ఇందులోనే ఉండడంతో.. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే జాగ్రత్తలతో చైనాకు షాక్ తప్పదని తెలుస్తోంది. అదానీ పవర్, లాంకో పవర్, రిలయన్స్ పవర్, ఎస్సార్ పవర్ వంటి సంస్థల్లో పలు చైనా కంపెనీలు కంట్రాక్టులు పొందాయి. ప్రస్తుతం రూపొందుతున్న నివేదికలోని అంశాలు నిబంధనలైతే, ఆయా కంట్రాక్టులు పొందే కంపెనీలు భారత్‌లో పది ఏళ్ల పాటు పని చేసి ఉండాలని, ఆయా కంపెనీల భారత్ విభాగాల్లో అత్యున్నత స్థానాల్లో భారతీయులే ఉండాలని సిఫార్సులు పొందుపర్చారని సమాచారం. విద్యుత్ సరఫరా వ్యవస్థల మూలం, వైరస్‌ను ఎదుర్కోవడానికి ఆయా పరికరాలకు ముందు జాగ్రత్తలు ఏమిటో కూడా ఆయా కంపెనీలు తెలియజేయాల్సి ఉంటుంది.

చైనాకే షాక్ ఎందుకంట?

ఈ నిబంధనలతో చైనాకు మాత్రమే షాక్ ఎందుకన్న సంశయం వస్తుంది. ఈ పరికరాలను ఇప్పటికే పశ్చిమ 'దేశాల కంపెనీలు సదరు విద్యుత్ పరికరాలను ఆయా నిబంధనల మేరకు తయారు చేస్తున్నాయి. చైనా మాత్రం కొన్ని నాణ్యతా ప్రమాణాలు లేకుండా తక్కువ ధరకు భారత్ కంపెనీల కంట్రాక్టులను కొట్టేస్తోంది. దీంతో ఇప్పటికే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న పశ్చిమ దేశాల కంపెనీలకు వీటితో నష్టం లేదు. భారత్‌లో ఇలాంటి వస్తువుల ఉత్పత్తి తక్కువగా ఉంటుందన్న కారణంతో చైనా కంపెనీలు కంట్రాక్టులు ఎగరేసుకుపోతున్నాయి. అయితే.. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే.. ఆయా నాణ్యతా నిబంధనలు చైనా కూడా పాటించక తప్పదు. అప్పుడు 19 నగరాల్లో స్మార్ట్ గ్రిడ్ కంట్రాక్టులు పొందిన చైనా కంపెనీలు వాటిని వదులుకోవాల్సిన పరిస్థితి వస్తుంది లేదా భవిష్యత్‌లో ఆ కంట్రాక్టులను కొనసాగంచలేని స్థితి కనబడుతుంది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఆడిట్లో ఈ భద్రతా ప్రమాణాల లొసుగులు బయటపడ్డాయి. సమయానికి అంది వచ్చిన అవకాశంలా ప్రభుత్వానికి ఇది చైనాను కట్టడి చేసే అవకాశంగానూ కనబడుతోంది.

మోడీ మిస్సింగ్

● వారణాసిలో పోస్టర్లు
● తొలగించిన పోలీసులు



వారణాసి: అదిగో వారణాసి.. అంటే ఇదిగో మోడీ అనేంతగా ఈ నియోజకవర్గం పాపులర్ అయింది. ఇక్కడి నుంచి గెలిచిన మోడీ ప్రధాని కావడంతో వారణాసి పేరుతో ఒక పార్లమెంటరీ నియోజకవర్గం ఉందని అందరికీ తెలిసింది. అయితే.. అక్కడ కూడా మోడీ అంటే గిట్టని వారున్నారు. ప్రత్యర్థి పార్టీల వారో, మరెవరో కానీ, మోడీ కనిపించడం లేదని పోస్టర్లు వేసారు. ప్రధాని మోడీ వారణాసిలో ఈ ఏడాది మార్చి 4,5,6 తేదీల్లో కనిపించారని, ఆ తరువాత నుంచి కనిపించడం లేదని ఆ పోస్టర్ల సారాంశం. ఓట్లు అడగడానికే అప్పుడు ఆయన వచ్చారని, పని అయిపోగానే కనిపించడం మానేసారని రాసారు. నగరం మొత్తం వెలసిన ఈ పోస్టర్లు తొలగించిన పోలీసులు ఈ తుంటరి పని చేసిన వారెవరో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పోస్టర్లలో చెప్పిన విధంగా కాక, మోడీ ఇక్కడ గెలిచిన నాటి నుంచి జౌళి పరిశ్రమ మార్పులకు గురవుతోందని, యువకులకు నైపుణ్య అభివృద్ధిలో మోడీ శిక్షణ ఇప్పిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే హండియా - వారణాసి రహదారిని ఆరు లేన్లుగా మార్చడానికి కేబినెట్ ఆమోదించింది. దీంతో మిస్సింగ్ పోస్టర్లు తుంటరుల పనేనని స్థానిక బీజేపీ నేతల భావన.

ట్రంప్ వ్యూహకర్తకు ఉద్వాసన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌కు ఇక ఆ బాధ్యతలు లేవు. ఈ మేరకు శ్వేతసౌధం ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే.. ఆయన రాజీనామా చేసారా లేదా ఉద్వాసనకు గురయ్యారా అనేది స్పష్టం చేయలేదు. విశ్వసనీయ వర్గాల ప్రకారం ఆయనను పదవిలోంచి ట్రంప్ తీసేసారని తెలుస్తోంది. నిరుడు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో బానన్ వ్యూహాలు ట్రంప్ గెలుపునకు కారణమయ్యాయని అంచనా. దీంతో ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఆయనకు కీలక బాధ్యతలు దక్కాయి. శ్వేతసౌధంలో మూడో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అయితే.. ప్రతిపక్షమైన డెమోక్రాట్లతో పాటు ఇతర వర్గాల నుంచి బానన్ ఊస్టింగ్ కోసం డిమాండ్లు వచ్చాయి. దీంతో స్వయంగా బాననే శ్వేతసౌధం నుంచి వెళ్లిపోయారని, చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీతో ఆయన చర్చల తరువాతే ఈ నిర్ణయం జరిగిందని వైట్ హౌస్ ప్రతినిధి సారా సాండర్స్ ప్రకటిం చారు. దీంతో ట్రంప్ అనుయాయుల్లో ఉద్వాసనకు గురైన మూడో వ్యక్తి బానన్. ఆయన చాలా మంచి వ్యక్తని ట్రంప్ ప్రకటించిన మూడో రోజునే ఉద్వాసనకు గురవడం గమనార్హం.

వందేమాతరంపై గందరగోళం, మజ్లిస్ సభ్యుల సస్పెన్షన్

ఔరంగాబాద్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో వందేమాతరం గీతాన్ని ఆలాపించినప్పుడు ప్రతిపక్షమైన ఆలిండియా మజ్లిస్ పార్టీ సభ్యులు లేచినిలబడకపోవడంతో శివసేన,బీజేపీ సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. వారు సభాధ్యక్షుని వేదిక వద్దకు వెళ్ళి మజ్లిస్ సభ్యులపై చర్య తీసుకోవాలనినినాదాలు చేశారు. దాంతో మజ్లిస్ సభ్యులు సమావేశంలో మైక్రోఫోన్‌లు,ఫర్నిచర్ విరిచేసి గందరగోళం సృష్టించారు.సమావేశంలో అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు మజ్లిస్ కార్పొరేటర్లను మేయర్ సస్పెండ్ చేశారు. దాంతో మజ్లిస్ సభ్యులు మరింతగా ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు.

మజ్లిస్ వర్గం నాయకుడ,శాసనసభ్యుడు ఇంతియాజ్ జలీల్ మాట్లాడుతూ , వందేమాతరం ఆలపించడం,ఆ సమయంలో లేచి నిలబడటం చట్టబద్ధమేమీ కాదనీ, అయినప్పటికీ చాలా కాలంగా వస్తున్న సంప్రదాయాన్ని పాటిస్తున్నామనీ, ఆ గీతాన్ని ఆలాపించినసమయంలో లేచి నిలబడనందుకు తమ పార్టీ సభ్యులపై చర్య తీసుకోవాలనడం చట్ట విరుద్ధమని వాదించారు.ఔరంగాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో మజ్లిస్ సభ్యులు25 మంది వరకూ ఉన్నారు.ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతోంది.ఈ విషయమై సమావేశంలో ఏం జరిగిందో పూర్తి వివరాలు తెలుసుకుంటానని ఆయన అన్నారు.

ఒవైసీ ఖండన: ఔరంగాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో వందేమాతరం గీతం ఆలపించినప్పుడు తమ పార్టీ సభ్యులు లేచి నిలబడలేదని సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు.వందేమాతరం గీతాన్ని ఆలపించేటప్పుడు లేచినిలబడాలన్న నిబంధనఏమీ లేదనీ, అటువంటప్పుడు తమ పార్టీ కార్పొరేటర్లపై చర్య ఎలా తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ,శివసేన కార్పొరేటర్లు పట్టుపట్టడం వల్లనే మజ్లిస్ కార్పొరేటర్లను మేయర్ సస్పెండ్ చేశారు.ఈ విషయమై ఉద్దేశ్య పూర్వకంగానే శివసేన,బిజేపీ రాద్ధాంతంచేసిందని మజ్లిస్ పార్టీ ఆరోపించింది.

గోరఖ్‌పూర్ ఏం పాపం చేసింది

● వ్యాధి నిర్ధారణలోపే ఎక్కువ మంది మృత్యువాత
● మెదడు వాపుపై యోగి యుద్ధం



గోరఖ్ పూర్: ఆరోగ్యభారతం గురించి మన నాయకులు ప్రస్తావించే అంశాలు ఆచరణకు వచ్చే సరికి గాలిలో దీపంలా తయారౌతున్నాయి. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్..అక్కడి ప్రజలను పట్టిపీడిస్తూన్నా... శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానంలో కిడ్నీలు పాడై ప్రజలు మంచాలకే పరిమితమైపోతున్నా.. పరిష్కారమార్గాలు మాత్రం లభించడం లేదు. నివారణా చర్యల మాటెలా ఉన్నా...ఆయా వ్యాధుల మూలాలపై దాడి జరగకపోవడం ఆందోళన కలి గించే అంశం.ఉత్తర్ ప్రదేశ్ లోని గోరఖ్ పూర్‌లో ముక్కుపచ్చలారని చిన్నారులు రోజుకు పదుల సంఖ్యలో పిట్టల్లా రాలుతున్నా...రోగానికి కారణమైన అసలు మూలాలను నాశనం చేయలేకపోతున్నారు. పాలకుల నిర్లక్ష్యమో..వైద్యుల వైఫల్యమో గానీ పదికాలాల పాటు చల్లగా ఉండాల్సిన వారు పసిప్రాయంలోనే పాడెక్కు తున్నారు.ఉత్తర్ ప్రదేశ్ లోని గోరఖ్ పూర్ బాబా రాఘవదాస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో రోజుకు పదుల సంఖ్యలో పసిమొగ్గలు నేలరాలడం వారి తల్లిదండ్రులనే కాదు..మీడియాలో చూసిన ప్రతీ ఒక్కరినీ కన్నీళ్లు పెట్టిస్తోంది. యూపీలో ఇలాంటి ఘటనలు మొదటిసారి కాకపోయినా... ఈ వార్తను ప్రపంచవ్యాప్తం చేసిన పుణ్యం సోషల్ మీడియాదే. కేవలం ఆక్సిజన్ అందకపోవడంతోనే పసిపిల్లలు పిట్టాల్లా రాలుతుంటే...అసలు వ్యాధి బారిన పడిన వారు ఇంకెంతమందో అన్న ప్రశ్న ప్రతి ఒక్కరిలో ఉద్భవిస్తోంది. చిన్నారులను పట్టిపీడిస్తున్న మెదడువాపు వ్యాధి అక్కడి ప్రజలకు కంటిమీదకునుకు లేకుండా చేస్తోందిఒక్క బీఆర్డీ ఆస్పత్రిలోని బాధిత చిన్నారులే. కానీ ఆ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లోని ఏ గ్రామాలను మెదడువాపు మహమ్మారిలా పట్టిపీడిస్తోంది. దీంతో మాకేఈ రోగం ఎందుకొచ్చిందా అన్న ఆలోచన స్థానికులను కలచివేస్తోంది.

మెదడువాపు కారణంగా గోరఖ్ పూర్ పరిసర ప్రాంతాల్లో7వేల మంది మృత్యువాతపడ్డారు. 2005లోనూ వేలాదిమంది మెదడువాపు వ్యాధితో బీఆర్డీ ఆస్పత్రిలో చేరారు. వ్యాధి చివరిదశకు వచ్చిన తర్వాత ఆస్పత్రిలో చేరడంతో అప్పుడు కూడా కళ్లముందే వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారు.

రాహుల్ పై యోగి వ్యంగ్యాస్త్రాలు

గోరఖ్ పూర్ ఆస్పత్రి విషాదం తర్వాత కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తర్ ప్రదేశ్ లో అడుగుపెట్టడంపై యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాహుల్ గాంధీ విహారయాత్రకు వచ్చినట్లు ఆస్పత్రిని సందర్శించారనిమండిపడ్డారు. గోరఖ్ పూర్ పిక్నిక్ ప్రాంతంకాదంటూ సెటైర్లు వేశారు.ఢిల్లీలో కూర్చునే యువరాజు ఒక్కరున్నారు.ఆయనకు స్వచ్ఛభారత్ అభియాన్ అంటే కూడా తెలియదు..ఆయనిప్పుడు గోరఖ్ పూర్‌ను విహారయాత్ర ప్రాంతంగా మార్చేందుకు వచ్చారు..మనం అలాంటి అవకాశం ఇవ్వకూడదు అంటూ విమర్శలు సంధించారు. రాహుల్ పర్యటనపై విమర్శల నేపథ్యంలో బీఆర్డీ ఆస్పత్రిలో చిన్నారులను పరామర్శించకుండానే యువనేత వెనుదిరిగినట్లు కాంగ్రెస్ ప్రకటించింది.

ఉనికే లేనిచోట గెలుపే లక్ష్యంగా...

ఆపరేషన్ దక్షిణ్ భారత్

విస్తృత వ్యూహాలతో బీజేపీ ముందడుగు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : 2019 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఆపరేషన్ దక్షిణ్ భారత్ ప్రారంభిం చింది. అసలు పట్టు లేని రాష్ట్రాల్లో ఖాతా తెరవడమే కష్టమనుకునేపరిస్థితుల్లో బీజేపీ భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆ దిశగా పార్టీ శ్రేణుల్ని పరుగులు తీయిస్తోంది. 'టార్గెట్ 350 ప్లస్' పేరుతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ఇంత వరకు పార్టీకి పెద్దగా బలం లేని రాష్ట్రాల్లోనూ గెలవాలి. అప్పుడే పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు కారణంగా సీట్లు తగ్గినా, ఆ మొత్తం సీట్లను పట్టు లేని రాష్ట్రాల నుంచి భర్తీ చేసే అవకాశం ఉంటుంది. బహుముఖ వ్యూహం, విస్తృత ప్రణాళికలతో ముందుకెళ్తున్న బీజేపీ ఈ క్రమంలో బీజేపీకి పట్టు లేని దక్షిణాది రాష్ట్రాలపై ప్రధానంగా కన్నేసింది.

ద్వితీయస్థానంలో నిలిచిన స్థానాల్లో అమలు చేసే వ్యూహాలు ఒకెత్తయితే, అసలేమాత్రం ఉనికి లేని చోట గెలుపొందడం అత్యంత సవాళ్లతో కూడిన లక్ష్యం. ఈ దిశగానూ అమిత్ షా పార్టీ శ్రేణుల్ని సమయాత్తపరుస్తున్నారు. బీజేపీకి బలం లేని రాష్ట్రాల జాబితాను ఓసారి పరిశీలిస్తే, ఒక్క కర్ణాటక మినహాయించి మొత్తం దక్షిణాది రాష్ట్రాలు అని చెప్పుకోవచ్చు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఆ పార్టీకి అసలు ఉనికే లేదు. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో కలిసి పోటీ చేసి ఒకట్రెండు సీట్లు సాధించినా అవి ఆ పార్టీ ఉనికి చాటడానికి తప్ప బలం చాటడానికి మాత్రం కాదు. దక్షిణాదితో పాటు తూర్పు తీర రాష్ట్రాల్లోనూ బీజేపీకి పెద్దగా బలం లేదు. ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇస్తోంది. అక్కడ ఇన్నాళ్లూ ద్వితీయ స్థానంలో ఉన్న రాజకీయ పార్టీలను పక్కకునెట్టి ఆ స్థానాన్ని ఆక్రమించుకుంటోంది. 2019 నాటికి స్థానిక ప్రభుత్వాల మీద ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకతను కలుపుకుని ఇక్కడ గతం కంటే వీలైనన్ని ఎక్కువ సీట్లు సాధించడంపై బీజేపీ కన్నేసింది.

తమిళనాడు విషయానికొస్తే.. ప్రస్తుతం అన్నా డీఎంకే విలీనంపై బీజేపీ దృష్టి పెట్టింది. దాదాపు మరో నాలుగేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించాల్సిన చోట బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ద్రవిడ రాజకీయ పార్టీలు తప్ప జాతీయ పార్టీలకు ఏ మాత్రం చోటు కల్పించని తమిళనాట, అక్కడి ప్రజల మనసు గెలుచుకునేందుకు ఏది చేయడానికైనా సిద్ధంగా ఉంది. పైపెచ్చు అన్నా డీఎంకేకి పోటీగా డీఎంకే నిలబడే పరిస్థితి లేదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. స్టాలిన్ నేతృత్వంలో పార్టీ ఒక్కసారి కూడా ఎన్నికలకు వెళ్లకపోవడమే ఇందుకు నిదర్శమని, స్టాలిన్ కూడా తనను తాను నిరూపించుకునే ప్రయత్నమేదీ ఇప్పటి వరకు చేయలేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. తద్వారా అక్కడ రాజకీయ శూన్యత ఏర్పడిందని, అది తమకు సవాళ్లతో కూడిన అవకాశాలు కల్పిస్తుందని వారు వివరిస్తున్నారు.

దక్షిణాదిలో బీజేపీ ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. అందుక్కారణం ఇక్కడ బీజేపీకి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. 4 శతాబ్దాలుగా నైజాం పాలనలో ఉన్న తెలంగాణలో రజాకార్ల అరాచకాలు, ఆ గాయాలు ఇప్పటికీ ఉన్నాయని బీజేపీ భావిస్తోంది. రజాకార్ల అకృత్యాల నుంచి విముక్తి లభించిన తేదీ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా బీజేపీ ప్రతియేటా నిర్వహిస్తోంది. అయితే అధికార పార్టీ మైనారిటీ ఓట్ల వేటలో విమోచన దినం నిర్వహించకపోవడం తమకే లాభిస్తుందని బీజేపీ అంచనా వేస్తోంది. అమిత్ షా తెలంగాణ రాష్ట్ర పర్యటనలో రజాకార్లకు సంబంధించిన అంశాలపైనే ఎక్కువగా ఫోకస్ చేయడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ అంశంతో ఓటర్ల భావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ వ్యూహాలకు చెక్ పెట్టాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.



మాంద్యంలో భారత ఐటీ రంగం!

న్యూఢిల్లీ: భారత సాఫ్ట్‌వేర్ పరిశ్రమ గత ఏడేళ్లలో కనీవినీ ఎరుగని మాంద్యాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి ఆర్థిక వ్యవహారాల సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తన నివేదికలో పేర్కొన్నారు. ఐటి రంగంలో భారత దేశం తిరుగులేని రీతిలో అభివృద్ధి చెందిందనీ,కానీ,ఇటీవల కాలంలో అంతర్జాతీయ రంగంలో వచ్చిన మార్పులు కారణంగా ఇప్పుడు ఐటి ఎగుమతలపై మాంద్యం ప్రభావం పడిందని ఆయన అన్నారు ఈ పరిస్థితికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అమెరికాకే తొలి ప్రాధాన్యమనే విధానం కూడా కారణమని ఆయన అన్నారు. భారత ఐటి రంగం మాంద్యాన్ని ఎదుర్కొంటున్న మాట నిజమేనని విదేశీ మీడియా కూడా ధ్రువీకరించింది.ఉద్యోగాల కల్పనలో ఐటి రంగమే ముందుందనీ,ఈ మాంద్యం కారణంగా ఇప్పుడు వెనకబడిందని మీడియా పేర్కొంది.2014 ఎన్నికల్లో ఉద్యోగాలను పెంచుతామన్న హామీతోనే మోడీ అధికారంలోకి వచ్చారనీ, 2019లో కూడా అదే అంశం ప్రాధాన్యత వహించవచ్చనీ, కానీ,ప్రస్తుత పరిస్థితి అందుకు అనుకూలంగా లేదని విదేశీ మీడియా పేర్కొంది.ఆటోమేషన్ వల్ల భారత్‌లో 69 శాతం ఉద్యోగాలకు హాని జరగవచ్చని మీడియా పేర్కొంది.సాంకేతిక రంగానికి చెందిన ఉద్యోగాలు కూడా2020నాటికి వేలల్లో కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది.ఐటి పరిశ్రమ గతంలో ఉన్నంత ప్రాభవాన్ని కలిగి లేదనికూడా పేర్కొంది. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో రెండవ స్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌లో ఏర్పడిన అంతర్గత సంక్షోభం ప్రభావం కూడా ఈపరిశ్రమపై ఉండి తీరుతుందని విదేశీ మీడియా పేర్కొంది.ఐటి ఎగుమతులను పెంచేందుకు ఇన్ఫోసిస్ తీసుకున్న చర్యలు ఫలించాయనీ.ఇప్పుడు ఆసంస్థలో సంక్షోభం వల్ల అవన్నీ నిరుపయోగమయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది.



సీఈవో ఎంపిక సవాలే!

● కంపెనీలోని వ్యక్తులకే కీలక బాధ్యతలు ● బయటి వ్యక్తుల ప్రవేశానికి తాత్కాలికంగా తెర

● రేసులో ప్రవీణ్‌రావు, రంగనాథ్, రవికుమార్, మోహిత్‌జోషి ● ● చట్ట ఉల్లంఘన ఆరోపణలపై అమెరికాలో న్యాయవిచారణ

బెంగళూరు: ఇన్ఫీ సీఈవో, ఎండీ బాధ్యతల నుంచి విశాల్ సిక్కా తప్పుకోవడం దిగ్గజ ఐటీ సంస్థకు ఎదురుదెబ్బే. సిక్కా స్థానాన్ని భర్తీచేయడం సులువైన ప్రక్రియ కాబోదు. నూతన సీఈవోను గుర్తించడం ఎలా అన్నది ఇన్ఫోసిస్‌కు సమస్యగా పరిణమించనుంది. గత అనుభవాలను ఈ సందర్భంగా సీనియర్ అధికారులు గుర్తుచేస్తున్నారు. 2014లో కొత్త సీఈవోను ఎంపికచేసే సమయంలో సమస్యలు ఎదుర్కొన్న అధికారులే ఈ విషయాన్ని చెబుతున్నారు. గ్రూప్ వ్యవస్థాపకులు కాక, మొదటిసారి బయట వ్యక్తి విశాల్ సిక్కా ఆ పదవిలోకి వచ్చారు. కానీ ప్రస్తుతం విశాల్ సిక్కా వైదొలగడంతో, ఈ కంపెనీకి కొత్త సీఈవోను నియమించాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పట్లోనే బయట వ్యక్తిని వెతికి నియమించడం చాలా కష్టమైందని, ప్రస్తుతం ఇది మరింత జటిలమని ఓ అధికారి చెప్పారు. కానీ ఈ సారి బయట వ్యక్తులకు అవకాశాలు తక్కువేనని కూడా తెలిపారు. కంపెనీలో పనిచేసే వారినే ఈ సారి సీఈవోగా నియమించే అవకాశం కనిపిస్తోంది.

నూతన సారథికి కఠిన సవాళ్లు..

కొత్తగా రాబోతున్న సీఈవోకు కఠిన సవాళ్లు స్వాగతం పలకనున్నాయి. సిక్కా కంటే మరింత సమర్థవంతంగా పనిచేయాల్సి వుంటుంది. కొత్త ఏరియాలు క్లౌడ్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లపై ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వచ్చే సీఈవో బ్రెగ్జిట్, అమెరికాలో అనిశ్చిత పరిస్థితులు, వీసా విధానాల్లో మార్పులు వంటి వాటన్నింటినీ భరిస్తూ.. ఇన్ఫీని మరింత మెరుగైన బాటలో నడిపించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెప్పారు.

మరోవైపు నుంచి కొత్త సీఈవోగా ఓ నలుగురు పేర్లు టెక్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వారిలో ఒకరు ఈ బాధ్యతలు చేపట్టవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఇన్ఫీ తాత్కాలిక సీఈవోగా వచ్చిన యూబీ ప్రవీణ్ రావుతోపాటు సీఎఫ్ఓ రంగనాథ్ డీ మావినకేరి, డిప్యూటీ సీఓఓ రవి కుమార్, బీఎఫ్ఎస్ఐ హెడ్ మోహిత్ జోషి పేర్లు తెరమీదకు వచ్చాయి.





తాత్కాలిక సీఈవోగా పదవిలోకి వచ్చిన యూబీ ప్రవీణ్ రావు, 1986 నుంచి సంస్థలో పనిచేస్తున్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ హెడ్ వంటి అతిపెద్ద నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. ఇక సీఎఫ్ఓ రంగనాథ్ దాదాపు 15 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఫైనాన్స్, విలీనాలు, కొనుగోళ్లు, కార్పొరేట్ ప్లానింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి వాటిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అన్ని ఇండస్ట్రి సెగ్మెంట్లలో ఇన్ఫోసిస్‌ను అంతర్జాతీయంగా సముచిత స్థానంలో నిల్పోబెట్టిన ఘనత డిప్యూటీ సీఓఓ కుమార్‌కి దక్కుతుంది. బీఎఫ్ఎస్ఐ అధినేత, ప్రెసిడెంట్ జోషి సంస్థ వ్యాప్తంగా జరిగే విక్రయ కార్యకలాపాలను, రిపోర్టింగ్ ప్రక్రియలను చూసుకుంటున్నారు.



అమెరికాలో న్యాయ విచారణ

సిక్కా రాజీనామాతో శుక్రవారం తొలి షాక్‌ను ఎదుర్కొన్న ఇన్ఫోసిస్‌కు తాజాగా మరో షాక్ ఎదురైంది. అమెరికా న్యాయ సంస్థలు ఆ కంపెనీపై న్యాయ విచారణకు దిగాయి. ఫెడరల్ సెక్యూరిటీస్ చట్టాలను దేశీయ ఈ కంపెనీ, దాని అధికారులు, డైరెక్టర్లు ఉల్లంఘించిన ఆరోపణల నేపథ్యంలో మదుపరుల తరపున నాలుగు అమెరికా న్యాయ సంస్థలు విచారణ ప్రారంభించాయి. బ్రోన్‌స్టెయిన్, జి వెర్జ్ అండ్ గ్రాస్మాన్, రోసెన్ న్యాయ సంస్థ, పోమెరాంట్జ్, గోల్డ్ బర్గ్ లా పీసీలు ఈ విచారణ చేపట్టాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలతోపాటు అమెరికా స్టాక్ మార్కెట్‌లోనూ ఇన్ఫీ లిస్టయివుంది.

పెట్టుబడిదారుల తరుపున పొటెన్షియల్ సెక్యూరిటీ క్లయిమ్స్‌పై విచారణ జరుపు తున్నామని రోసెన్ చెప్పింది. ప్రజలు పెట్టుబడులు పెట్టడానికి భౌతికంగా తప్పుదోవ పట్టించే వ్యాపార సమాచారాన్ని ఆ సంస్థ జారీ చేసినట్టు ఆరోపణలు వస్తున్నా యన్నది. ఇన్వెస్టర్లు పోగొట్టుకున్న మొత్తాలను రికవరీ చేయడానికి కంపెనీ క్లాస్ యాక్షన్ దావాకు కూడా సిద్ధమై ఉండాలని హెచ్చరించింది. కొందరు ఆఫీసర్లు, డైరెక్టర్లు ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలకు అనుగుణంగా పనిచేశారా లేదా అన్నది విచారిస్తున్నా మని బ్రోన్‌స్టెయిన్ పేర్కొంది. సెక్యూరిటీస్ మోసానికి లేదా చట్టవిరుద్ధమైన వ్యాపార విధానాలకు వారు పాల్పడారా? లేదా? అన్నది తేల్చుతామని పోమెరాంట్జ్ తెలిపింది.



ఇన్ఫీ బైబ్యాక్ ధర రూ. 1,150

ముప్పై ఆరేళ్ల చరిత్రలోనే తొలిసారిగా ఇన్ఫోసిస్ షేర్లను తిరిగి కొనుగోలు(బైబ్యాక్) చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు శనివారం సంస్థ నుంచి ప్రకటన వెలువడింది. రూ. 13వేల కోట్లతో షేర్ల బైబ్యాక్ చేయనున్నట్లు ప్రకటించింది. ఒక్కో షేరును రూ.1,150 ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొంది. శనివారం నాటి మార్కెట్ ట్రేడింగ్‌లో ఇన్ఫీ షేరు ముగింపు ధర రూ. 932కు 25శాతం ప్రీమియం ఇస్తూ ఈ షేర్లను తిరిగి కొనుగోలు చేస్తామని తెలిపింది. వాటాదార్లకిచ్చిన షేర్లను తిరిగి వారి నుంచే సదరు కంపెనీ కొనుగోలు చేయడాన్ని బైబ్యాక్ అంటారు. దీని వల్ల షేరు వారి ఆర్జన పెరగడమే గాక, వాటాదర్లకు కంపెనీ వద్ద ఉన్న అదనపు నగదు ఇవ్వడానికి వీలవుతుంది. జూన్ 30, 2017 నాటికి ఇన్ఫోసిస్ వద్ద రూ. 22750కోట్ల అదనపు నగదు ఉంది. కాగా.. ఇన్ఫీ కి ముందే.. పలు ఐటీ కంపెనీలు షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించాయి. టీసీఎస్ రూ. 16వేల కోట్ల మెగా బైబ్యాక్‌ను ఆఫర్ చేయగా.. విప్రో రూ. 2500 కోట్లతో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ. 3,500కోట్లతో బైబ్యాక్‌ను ప్రకటించాయి.



సింగరేణి లాభం రూ.395.38కోట్లు

● రూ.17,853కోట్లకు పెరిగిన టర్నోవర్

● ..మూడు కొత్తగనులకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి సంస్థ 2016-17ఆర్థిక సంవత్సరంలో 17,853కోట్ల టర్నోవర్ సాధించింది. నికర టర్నోవర్ రూ.13,891కోట్లుగా నమోదైంది. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో శనివారం జరిగిన 541వ బోర్డు సమావేశంలో 2016-17సంవత్సరానికి సంబంధించిన వార్షిక లెక్కలను బోర్డు ఆమోదించింది. వివరాలను సంస్థ చైర్మన్ శ్రీధర్ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ ట్యాక్సుల కింద కంపెనీ రూ.6056కోట్లు చెల్లించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.3,168కోట్లు చెల్లించగా, కేంద్రానికి రూ.2,888కోట్లు చెల్లించినట్లు శ్రీధర్ వెల్లడించారు. టాక్స్ చెల్లింపుల అనంతరం నికరలాభాలు రూ.395.38కోట్లుగా కంపెనీ ప్రకటించింది. సింగరేణి సంస్థ 2016-17ఆర్థిక సంవత్సరంలో కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.30కోట్లు వెచ్చించిన అంశంపై బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు సమావేశంలో కొత్త గనుల కోసం సంబంధించి ఆర్థిక అంచనాలకు ఆమోదం తెలిపారు. ఇందారం ఓపెన్‌కాస్ట్ గని(శ్రీరాంపూర్), కెటికె ఓసి-2 (భూపాలపల్లి), శాంతిఖని లాంగ్‌వాల్ (మందమర్రి)లకు సవరించబడిన బడ్జెట్టుకు బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ అధ్యక్షత వహించగా, రాష్ట్రప్రభుత్వ ఇంధనశాఖ కార్యదర్శి అజయ్ మిశ్రా, కేంద్ర బొగ్గుశాఖ డైరెక్టర్ జెఎస్ బింద్రా, సింగరేణి డైరెక్టర్లు భాస్కర్ రావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్‌శంకర్, కంపెనీ కార్యదర్శి జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వింటర్ హాలిడే బజార్


హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాబోయే హాలిడే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులు చేసే కొనుగోళ్ళపై అత్యుత్తమ విలువ కలిగిన డీల్స్‌ను అందించడానికి అగ్రశ్రేణి ట్రావెల్ అండ్ టూరిజం కంపెనీ ఎస్‌వోటీసీ హైదరాబాద్‌లో వింటర్ హాలిడే బజార్‌ను నిర్వహించబోతుంది. ఈనెల 20వ తేదీన జరిగే ఈ బజార్‌లో ట్రావెలర్లు ఉత్సాహపూరితమైన ఆఫర్లు, రాయితీలు అందుకోచ్చునని ఎస్ఓటీఎస్ ట్రావెల్ హెడ్ సేల్స్ డానియేట్ డిసౌజా అన్నారు.

ప్రతి ట్రావెలర్ తాము కోరుకున్న హాలిడే డెస్టినేషన్‌పై అధికంగా ఆదా చేసేందుకు తగిన అవకాశాలకు ఎస్‌వోటీసీ భరోసా కల్పిస్తుందని ఆయన అన్నారు. ఎస్‌వోటీసీ వింటర్ హాలిడే ప్యాకేజీలలో రిటర్న్ ఎయిర్‌ఫేర్స్, భారతీయ ఆహార అవకాశాలు, సైట్‌సీయింగ్ కోసం టూర్ మేనేజర్, లీజర్ ఆప్షన్స్ ఉంటాయి. తమ నగదుకు తగ్గ విలువను కోరుకునే భారతీయులను లక్ష్యంగా చేసుకుని విస్తృత శ్రేణిలో వ్యక్తిగతంగా క్యూరేట్ చేసిన ఆఫర్లను ఎస్‌వోటీసీ అందిస్తుందని ఆయన అన్నారు. ఈ సీజన్‌లో వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేకమైన హాలీడే ప్యాకేజీలను పరిచయం చేయడం, భారతీయ పర్యాటకులందరికీ అందుబాటు ధరల్లో హాలీడేస్‌ను తీర్చిదిద్దాలని తాము ప్రయత్నిస్తున్నామని, తాము నిర్వహించే ఫెస్టివల్ ప్యాకేజీలు దీనికి నిదర్శనంగా నిలుస్తాయని డిసౌజా అన్నారు.

భారత్‌లోకి మరో చైనా కంపెనీ

● ఒకేసారి 3 స్మార్ట్‌ఫోన్లు విడుదల

న్యూఢిల్లీ: భారత స్మార్ట్‌ఫోన్ విపణిలో రాజ్యమేలుతున్న చైనీస్ కంపెనీల హవా కొనసాగుతూనే ఉంది. తాజాగా మరో చైనీస్ కంపెనీ భారత మార్కెట్‌లోకి ప్రవేశించింది. ఓడీఎం టాప్‌వైజ్ కమ్యూనికేషన్ కంపెనీ మూడు బడ్జెట్ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఆ స్మార్ట్‌ఫోన్లు.. కామియో సీ1, కామియో ఎస్1, కామియో పీ1. ఈ కంపెనీ తొలిసారి భారత మార్కెట్‌లో ఫోన్లను లాంచ్ చేసింది. ఈ ఫోన్ల లాంచింగ్‌తోపాటు, భారత్‌లో తమ బ్రాండు అంబాసిడర్‌గా యామీ గౌతమిని నియమిస్తూ ఒప్పందం కుదుర్చుకుంది. కామియో సీ1 ధర 5,999 రూపాయలు. మెల్లో గోల్డ్, స్పేస్ బ్లాక్ రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. కామియో ఎస్1 ధర 8,999 రూపాయలు. ఇది రాయల్ బ్లాక్, సన్‌రైజ్ గోల్డ్ రంగుల్లో మార్కెట్‌లో లభ్యం కానుంది. చివరిగా కామియో పీ1 దీని ధర 9,999 రూపాయలు. మెటల్ గ్రే, సన్‌రైజ్ గోల్డ్ రెండు రంగుల్లో ఇది అందుబాటులో ఉండనుంది. వచ్చే వారాల్లో అన్ని దిగ్గజ ఆఫ్‌లైన్ స్టోర్లలో ఇవి విక్రయానికి వస్తున్నాయి. వీటి లాంచింగ్ ఆఫర్లలో భాగంగా బైబ్యాక్ ఆఫర్లు, 30 రోజులు రీప్లేస్‌మెంట్ వారెంటీ, స్క్రీన్ డ్యామేజ్ వారెంటీ, మిగతావి కంపెనీ అందించనుంది.



రేపటి నుంచి హెచ్‌ఆర్‌ఎంఏఐ వారోత్సవాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మానవ వనరుల మేనేజ్‌మెంట్ 'హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (హెచ్‌ఆర్‌ఎంఎఐ) సభ్యత్వ వారోత్సవాలను ఈనెల 21వ తేదీనుంచి నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ రంగ నిపుణులు, హెచ్‌ఆర్ సంస్థలు, విద్యార్థులు, ఉద్యోగులను ఒక్క వేదికగా తీసుకురావడం కోసం ముందుకు వెళుతున్నామని అన్నారు. తద్వారా హెచ్‌ఆర్ రంగంలో ఉద్యోగులు మరింత అభివృద్ధి సాధించడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఆర్‌ఎంఏఐలో సభ్యులుగా చేరేవారిని తాము ఆహ్వానిస్తున్నామని, హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్ వృత్తిగా కొనసాగుతున్న వారు, హెచ్‌ఆర్ కళాశాలలు, విద్యార్థులు, నిపుణులు ఈ వారోత్సవాలలో సభ్యులుగా చేరవచ్చునని శ్రీనివాసన్ వివరించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీవరకు జరగనున్న వారోత్సవాలలో సభ్యులుగా చేరవచ్చని చెప్పారు.

త్వరలో గూగుల్ సెర్చ్ లైట్ యాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ :సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ గూగుల్ త్వరలో తన సెర్చ్ యాప్‌క ు లైట్ వెర్షన్‌ను విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ యాప్‌ను గూగుల్ అంతర్గతంగా పరీక్షిస్తోంది. ఈ యేడాదిలోనే గూగుల్ సెర్చ్ లైట్ యాప్ యూజర్లకు అందుబాటులోకి రానుంది. ఈ యాప్ వల్ల డివైస్‌లో మొబైల్ డేటా ఎంత స్లోగా ఉన్నప్పటికీ ఇంటర్నెట్‌లో సమాచారాన్ని వెదకడం తేలికవుతుంది. వాతావరణం, వార్తలు, ఆఫ్‌లైన్ పేజీలు, ఇమేజ్‌లు వంటి అంశాలను సులువుగా సెర్చ్ చేసుకోవచ్చు. అందుకు అనుగుణంగా యాప్‌లో పలు క్విక్ షార్ట్‌కట్ బటన్లను పొందుపరచనున్నారు.

రైల్వే ప్రాజెక్టులకు జీఎస్టీ దెబ్బ

● దేశవ్యాప్తంగా లక్షల కోట్ల ప్రాజెక్టు పనులకు బ్రేక్ ● 4 శాతంగా ఉన్న సేవా పన్ను 18 శాతానికి పెంచడంపై కాంట్రాక్టర్ల ఆందోళన ● అర్థాంతర పన్ను భారం ప్రభుత్వమే భరించాలని డిమాండ్

చెన్నై: జీఎస్టీ అమలు రైల్వే ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపింది. దేశంలోని మెజార్టీ ప్రాజెక్టులు వస్తుసేవల పన్ను మూలంగా స్తంభించాయి. ముఖ్యంగా రైల్వే లైన్ల విస్తరణ పనులకు ఆటంకం కలుగుతోంది. చెన్నైబీచ్-కొరుక్కుపేట్, సెంగొట్టాయ్-పునలూర్ గేజ్ కన్వర్సన్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. వీటి అంచనా విలువ సుమారు లక్ష కోట్ల రూపాయలు. వస్తుసేవల సమస్య పరిష్కారం కాకుంటే దేశవ్యాప్తంగా ఆగస్టు 20 నుంచి పనులను ఆపివేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ-ఝాన్సి, ఝాన్సి- భోపాల్ సెక్షన్‌లో సబ్‌వే, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలపైనా జీఎస్టీ ప్రభావం పడింది.

జీఎస్టీకి ముందు ఆయా రాష్ట్రాలను బట్టి కాంట్రాక్టర్లు గరిష్టంగా నాలుగు శాతం సేవా పన్ను చెల్లించేవారు. కానీ జులై 1 తర్వాత జీఎస్టీ శ్లాబ్ మేరకు 18 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీనిని 12 శాతానికి తగ్గిస్తామని రైల్వేశాఖ హామీ ఇచ్చినా ఇంతవరకు దీనిపై స్పష్టత రాలేదు. తక్కువ పన్ను కాలంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులపై నాలుగు రెట్లు అధికంగా పన్ను చెల్లించాల్సి వస్తే, తాము నష్టపోవాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జులై 1కి ముందు చేపట్టిన పనులపై పాత పన్నునే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



భారాన్ని ప్రభుత్వమే భరించాలి

ఒప్పందానికి భిన్నంగా కాంట్రాక్టర్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చినా, వారి బాధ్యతల పనితీరుతో వ్యయభారం ఎక్కువైనా వారు పరిహారానికి అర్హులని ఆగస్టు 14 భారతీయ రైల్వే ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (ఐఆర్ఐపీఏ) ప్రధానికి మెమొరాండం సమర్పించింది. జులై 1 తర్వాత కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెద్దమొత్తాలను ఆపివేశారని ఐఆర్ఐపీఏ ప్రధాన కార్యదర్శి రాజేష్ కుమార్ మెన్‌ఘాయ్ చెప్పారు. తమ మూలధన పెట్టుబడిని అదనపు పన్నుభారం తినేస్తున్నదని, దీంతో బిల్లులు తీసుకునేందుకు కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారని తెలిపారు.

పన్నుభారంపై చర్చించేందుకు జులై 31న రైల్వే బోర్డు కమిటీని ఏర్పాటు చేసింది. కాగా మెటీరియల్‌పై కాంట్రాక్టర్లు చెల్లిస్తున్న 12శాతం ఇన్‌పుట్ క్రెడిట్ పన్నును 6 శాతానికి పరిమితం చేయాలని, మిగతా మొత్తాన్ని రైల్వే భరించాలని సదరు కమిటీ మధ్యేమార్గంగా సూచన చేసింది.



పారదీప్ రిఫైనరీ డీల్ కొలిక్కి

● ఐవోసీ పన్ను రాయితీకి ఒడిశా ఆమోదం


● ఏటా రూ. 700 కోట్లు వడ్డీ రహిత రుణం

● 15 ఏళ్లపాటు రుణాల సమకూర్పునకు ఓకే

న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు రాయితీల అంశంపై ఒడిశా ప్రభుత్వం మెట్టుదిగింది. పారదీప్ రిఫైనరీకి సంబంధించి గతంలో రూ. 34,555 కోట్ల రూపాయల పన్ను రాయితీలను ఒడిశా ప్రభుత్వం రద్దుచేసింది. దీనిపై కేంద్రం జోక్యంతో ఒడిశా తన వైఖరిని మార్చుకుంది. కొన్ని రాయితీలను పునరుద్ధరించడంతోపాటు ప్రతియేటా700 కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణంగా సమకూర్చేందుకు అంగీకరించింది. ఈ విషయాన్ని కేంద్ర చమురుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శనివారం మీడియాకు తెలిపారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో కేంద్ర మంత్రి శుక్రవారం జరిపిన చర్చలు ఫలితాన్నిచ్చాయి. వచ్చే 15 ఏళ్లకు వడ్డీలేని రుణాలకు నవీన్ ప్రభుత్వం సానుకూలత వ్యక్తంచేసింది. వ్యాట్ భారాన్ని భరిస్తామని రాష్ట్రప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పునరుద్ధరణ ఒప్పందానికి ఐవోసీ, నవీన్ ప్రభుత్వం అంగీకారం తెలిపాయి. దీనిపై ఇరువురూ సంతకాలు చేశారు. రాష్ట్రంలో విక్రయించే పారదీప్ ఉత్పత్తులపై అమ్మకం పన్నును 11 ఏళ్లు వాయిదా వేసే హామీని విరమించుకుంటున్నట్లు గత ఫిబ్రవరి 22న ఐవోసీకి రాష్ట్రప్రభుత్వం లేఖ రాసింది. పన్ను రూపంలో ప్రతియేటా ఐవోసీకి ప్రతియేటా 2వేల కోట్ల రూపాయలు ఆదా అవుతోంది. వడ్డీ రహిత రుణాల ద్వారా రాష్ట్రానికి అదనపు ఆదాయం సమకూరుతుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతియేటా రూ. 1500 కోట్ల రాబడి లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

లగేజీపై చార్జీల మోత

న్యూఢిల్లీ : దేశీయ అతిపెద్ద ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణీకుల జేబుకు చిల్లుపెట్టేందుకు సిద్ధమైంది. అదనపు లగేజీపై చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. స్పైస్‌జెట్ శుక్రవారం చార్జీల మోత నిర్ణయాన్ని వెల్లడించగా, ఇండిగో సైతం అదే బాటలో పయనించాలని నిర్ణయించింది. 15 కేజీలకు మించిన లగేజీపై వడ్డింపునకు రంగం సిద్ధంచేసింది. 20 కేజీల లగేజీ చార్జీని 1425 రూపాయలుగా నిర్ణయించింది. మొన్నటి వరకు ఇది రూ. 500గా ఉండేది. అదేవిధంగా ముందస్తు బుకింగ్‌పై 10కేజీ, 15 కేజీ, 30 కేజీ లగేజీపై వరుసగా రూ. 2850, రూ. 4275, రూ 8550 వసూలు చేయనుంది. ముందస్తుగా బుకింగ్ చేసుకోని లగేజీపై కేజీ ఒక్కింటికి రూ. 300 చార్జీగా నిర్ణయించింది. ఇండిగో సంస్థ దేశీయ విమానయాన మార్కెట్‌లో 40శాతం వాటా కలిగివుంది.



ఇంతకు మునుపు విమానయాన సంస్థలు 20 కేజీల లగేజీని అనుమతించేవి. దీన్ని ఇప్పుడు 15 కేజీలకు తగ్గించాయి. అదనపు లగేజీపై కేజీకి రూ. 100 చార్జీ మాత్రమే వసూలు చేయాలంటూ పౌరవిమానయాన సంస్థడైరెక్టరేట్ జనరల్ ఇచ్చిన ఆదేశాలపై నాలుగు రోజుల కిందట ఢిల్లీ కోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో తాజాగా ఇండిగో నిర్ణయం ప్రయాణికులను కలవరపరిచేలా ఉంది. 2014లో విపణిలోకి ప్రవేశించిన ఎయిర్ ఏసియా ఇండియా ఉచిత లగేజీకి తొలుత నిరాకరించింది. కాగా, ఇతర విమానయాన సంస్థల మాదిరిగానే 15 కేజీల వరకు ఉచిత లగేజీ చెకిన్‌కు అనుమతి ఇవ్వాల్సిందేనని డీజీసీఏ ఆదేశించింది. ఇదిలావుంటే ఎయిర్ ఇండియా మాత్రం ఎకానమి తరగతి దేశీయ ప్రయాణాల్లో 25 కేజీల వరకు ఎలాంటి చార్జీలు వసూలు చేయడం లేదు.

సంస్థల పరిరక్షణకే ప్రాధాన్యం

● మొండి బకాయిల సమస్యకు పరిష్కారంపై జైట్లీ వ్యాఖ్య

● బ్యాంకులకు నిధుల అందజేతపై ఆర్బీఐ-కేంద్రం చర్యలు


● 9.6శాతం ఎన్‌పీఏలు ఆందోళనకరమే: ఆర్బీఐ గవర్నర్

ముంబై: బ్యాలెన్స్ షీట్ ఒత్తిళ్లను అధిగమించే యత్నంలోభాగంగా, నిధులు సమకూర్పు కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలను ఆర్థికశాఖ మంత్రి జైట్లీ తోసిపుచ్చారు. మొండి బకాయిల పరిష్కార చర్యలను వక్రీకరించడం తగదన్నారు. సంస్థలకు ఆర్థిక సహాయం కంటే వాటిని రక్షించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. శనివారం సీఐఐ ఏర్పాటు చేసిన దివాలా సదస్సులో జైట్లీ మాట్లాడారు. కొత్త దివాలా చట్టం రుణం ఎగవేతదారు- రుణదాత సంబంధాన్ని గణనీయంగా తిరగవేసింది. అల్టిమేట్ లక్ష్యం మాత్రం ఆస్తుల పరిసమాప్తి కాదు. ప్రస్తుత భాగస్వాములు, కొత్త భాగస్వాములు తమ విలువైన ఆస్తులను పరిరక్షించుకోవాలి అని సూచించారు. కొత్త దివాలా చట్టం, బ్యాంక్ దివాలా కోడ్ హేతుబద్ధతను వివరించారు. రుణ వసూళ్ల ట్రిబ్యునళ్లు సమర్థవంతంగా పనిచేయడంలో విఫలమైనందున ఈ కొత్త చట్టాలు అనివార్యం అయ్యాయి. సర్ఫేసీ (సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్) చట్టం అమల్లోకి వస్తే వచ్చే రెండు మూడేళ్లలో మొండిబకాయిలు గణనీయంగా తగ్గుతాయి. ఇంతకాలం మనం రుణగ్రస్తులను రక్షించే వ్యవస్థలో ఉన్నాం. తద్వారా ఆస్తులు గాలికి వదిలేసేందుకు అలవాటు పడ్డాం. పాత వ్యవస్థలో రుణగ్రహీతను చేరుకుని సొమ్మును వసూలు చేయడం తలకుమించిన భారంగా ఉండేది. అయినా చివరకు లక్ష్యసాధన శూన్యం. ఒకవేళ రుణదాత మనుగడ సాగితే, అతను మరికొంత మందికి మార్గదర్శకం అవుతాడు. ఇదే సరైన వ్యాపార విధానమని నేను భావిస్తున్నాను అని జైట్లీ పేర్కొన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో వేగంగా మొండి బకాయిల సమస్య పరిష్కారం మెగా నియంత్రణ చర్యే. మార్చి 2017 నాటికి నికర ఎన్‌పీఏలు 9.6 శాతంగా ఉన్నాయి. అదే సమయంలో రుణ ఒత్తిళ్ల నిష్పత్తి 12 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ జూన్‌లో 12 అతిపెద్ద రుణ ఎగవేత దారులను గుర్తించింది.



వీరు బ్యాంకులకు 2.5 ట్రిలియన్ రూపాయలకు పైగా బకాయి పడ్డారు. వీరితోపాటుగా మరో 500 రుణ ఎగవేత దారుల జాబితాను ఆర్బీఐ సిద్ధం చేసింది అని జైట్లీ వెల్లడించారు.

ఆమోదయోగ్యం కాదు



బ్యాంకుల్లో మొండి బకాయిలు 9.6శాతానికి చేరడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ స్పష్టం చేశారు. ఎన్‌పీఏ సమస్యకు నిర్ణీత కాలవ్యవధితో కూడిన పరిష్కారం అవశ్యమని పేర్కొన్నారు. క్రెడిట్ మదింపు వ్యవస్థలు నాసిరకంగా ఉన్నాయన్న రుణదాతల ఆరోపణలపై ఉర్జిత్ స్పందించారు. 9 ట్రిలియన్ డాలర్ల మొండి బకాయిల వసూళ్లకు సాధికార కార్యాచరణ చేపట్టాలి. దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లను ఎన్‌పీఏలు ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్ అవసరం. ఎన్‌పీఏల కారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఆరోగ్యకరంగా లేవు. మొండి బకాయిల సమస్యకు రీక్యాపిటలైజేషనే ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా ఉంది. ఈ విషయంపై ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తోంది. 86.5 శాతం గ్రాస్ ఎన్‌పీఏలన్నీ పెద్ద పెద్ద రుణగ్రహీతలవేనని ఉర్జిత్ చెప్పారు.

ఆయేషా కేసులో
సిట్‌కు ఎదురుదెబ్బ
పునర్విచారణ పిటిషన్ తిరస్కరణ

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఆయేషా మీరా హత్య కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఎదురు దెబ్బ తగిలింది. రేపు పునర్విచారణకు అనుమతికోరుతూ సిట్ దాఖలు చేసిన ఫిటిషన్‌ను విజయవాడ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి యు.ఇందిరా ప్రియదర్శిని తిరస్కరించారు. కేసు పునర్విచారణకు ఆదేశించే అధికారం ఈ కోర్టుకు లేదంటూ సిట్ దాఖలు చేసిన ఫిటిషన్‌ను తిరస్కరించడంతో తదుపరి కార్యాచరణపై పోలీసులు పునరాలోచనలో పడ్డారు. 2007లో పశ్చిమ ఇబ్రహీంపట్నంలో దారుణ హత్యకు గురైన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా(18) కేసులో పోలీసులు అరెస్టు చేసిన పిడతల సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ ఈ ఏడాది మార్చి 31న హైకోర్టు తీర్పు చెప్పింది. అప్పటి విచారణ అధికారులు అసలు నిందితులను వదిలేసి అమాయకుడైన సత్యంబాబును అక్రమంగా కేసులో ఇరికించినట్లు హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కేసు పునర్విచారణకు అధికారులను నియమించడంతో పాటు సత్యంబాబును అరెస్టు చేసిన విచారణాధికారులను ఆపెక్స్ కమిటీ నియమించి శాఖాపరమైన విచారణ జరపాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయేషా మీరా కేసులో సత్యంబాబును హైకోర్టు నిర్దోషిగా విడుదల చేసినందున అసలు నిందితులను పట్టుకోవాలని కోరుతూ ప్రజా సంఘాలు, హైకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరపాలంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ఆయేషా మీరా హత్య కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేస్తూ ఈ నెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సిట్ అధికారులుగా విశాఖపట్టణం రేంజ్ డీఐజీ సిహెచ్.శ్రీకాంత్, డీఎస్పీలు హైమావతి, శ్రీలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ సహేరాను నియమించినట్లు ప్రభుత్వం పేర్కొంది. గురువారం ఆయేషా మీరా హత్య పునర్విచారణకు అనుమతి కోరుతూ సిట్ అధికారులు విజయవాడలోని నాలుగో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రభుత్వ ముఖ్య న్యాయ సలహాదారు నాగ రఘు వాదనలు వినిపించారు. తదుపరి విచారణల కోసం శుక్రవారానికి పిటిషన్ వాయిదా పడింది. మరోసారి పునర్విచారణకు అనుమతించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సిట్ అధికారులు తమ వాదనలు వినిపించగా అధికారం ఉందో? లేదో? పరిశీలించనున్నట్లు పేర్కొంటూ న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని శనివారానికి వాయిదా వేశారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం కేసు పునర్విచారణకు ఆదేశించే అధికారం తమకు లేదంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. కేసు పునర్విచారణ పిటిషన్ న్యాయస్థానం తిరస్కరించడంతో సిట్ అధికారులు పునరాలోచనలో పడ్డారు. తదుపరి కార్యాచరణపై సిట్ అధికారులు ఉన్నతాధికారులతో సమావేశమై చర్చిస్తున్నట్లు తెలిసింది.

పట్టాలు తప్పిన ఉత్కళ్

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుందని ప్రశ్నించింది. దేశంలో మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచి సుమారు 259 మంది 27 ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా, 899 మంది గాయాల పాలైనట్లు తెలిపారు. ఈ మేరకు సుర్జేవాలా ట్విట్టర్‌లో వెల్లడించారు.

అక్రమ టపాసుల
యూనిట్‌లో పేలుడు

- ఐదుగురి దుర్మరణం
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు

భువనేశ్వర్ : భువనేశ్వర్‌లో ఖుర్దా ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ టపాసుల యూనిట్‌లో ప్రమాదం సంభవించి ఐదుగురు మృతిచెందారు. మరణించిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు సమాచారం. చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఖుర్దా పోలీసు స్టేషన్ సమీపంలో జరిగింది. జాన్‌కియా పోలీసు స్టేషన్ పరిధిలో సీకో గ్రామంలోని సనాతన్ సేథీ కుటుంబం ఇంట్లో అక్రమంగా టపాకాయలను తయారుచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. సేథీ ఇల్లు రేకుల షెడ్ కారణంగా పేలుడు ధాటికి బాగా దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సీకో గ్రామానికి వెళ్లి మంటలను ఆర్పినట్లు సమాచారం. మృతులు బాబీ సేథీ(40), మాధాబీ సేథీ(8), టికిలీ సేథీ(4), డోలీ సేథీ(19), డ్యూటీ సేథీ(62)గా గుర్తించారు.

అల్వాల్‌లో పట్టపగలు భారీ చోరీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టపగలు భారీ చోరీ జరిగింది. సిటిజన్ కాలనీలోని ఓ ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువా తెరిచి వంద తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసి ఉడాయించారు. సదరు ఇంటి యజమాని బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ మేనేజర్ నాగేశ్వరారవు కుటుంబసభ్యులతో బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంటికి వచ్చిన నాగేశ్వరరావు తన ఇంట్లో చోరీ జరిగిందన్న విషయాన్ని గుర్తించి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అభివృద్ధి చేస్తుంటే ఉరి తీస్తారా?!

(మొదటి పేజీ తరువాయి)

లేవన్నారు. నంద్యాల ప్రజలు మంచికి ఓటు వేయాలన్నారు. 'మీ అభిమానాన్ని ఎన్నటికీ మర్చిపోను, ఎప్పటికీ గుర్తుంచుకుంటాను' అని చంద్రబాబునాయుడు తెలిపారు.

ఒకరోజు ముందు కూడా అభివృద్ధి గురించే..

భూమా నాగిరెడ్డి చనిపోవడానికి ఒక రోజు ముందు కూడా తనవద్దకు వచ్చి నంద్యాల అభివృద్ధిపై మాట్లాడాడని చంద్రబాబునాయుడు గుర్తుచేశారు. పదేళ్ళలో చేయలేని అభివృద్ధిని వైసీపీ అభ్యర్థి ఏవిధంగా చేయగలడని ఆయన ప్రశ్నించారు. కుందూ నది వరద, చామకాలువ మురుగు వంటి పెద్ద పనులను తామే చేస్తున్నామన్నారు. ఇంతవరకు పేదలకు ఇళ్ళే లేవన్నారు. నంద్యాలకు, టీడీపీకి మధ్య అవినాభావ సంబంధం వుందని, ఇది ఒక చరిత్ర అన్నారు. ఎన్.ఎం.డి ఫరూఖ్ మంత్రిగా వున్నప్పుడు కూడా నంద్యాలలో అభివృద్ధి జరిగిందని, ఈ ప్రాంతాన్ని స్మార్ట్, సుందరనగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు.

జగన్ మాటలు నమ్మొచ్చా?

తనకు టి.వి, పేపర్ , డబ్బులు లేవని జగన్మోహన్ రెడ్డి చెబుతున్న మాటలు నమ్మవచ్చా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే బాధ కలుగుతోందన్నారు. తన అనుభవాన్ని జోడించి రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నానని, అధికారులను పరుగులు పెట్టిస్తున్నానని తెలిపారు. కట్టుబట్టలతో అమరావతికి తరలిరావాల్సి వచ్చిందన్నారు. ఇరిగేషన్ ఆఫీసును ముఖ్యమంత్రి కార్యాలయంగా మార్చుకుని కార్యకలాపాలు ప్రారంభించామన్నారు.

2018 లో సీమ ప్రాజెక్టులు

2018లో రాయలసీమ ప్రాజెక్టులు చేపడుతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. వర్షపు నీటిని నిల్వ కోసం అయిదు లక్షల పంట కుంటలను ఏర్పాటు చేశామన్నారు. పట్టిసీమతో నదుల అనుసంధానం జరిగిందని, కృష్ణా, ఆల్మట్టిలోనూ నీరు లేదన్నారు. క్రితం సంవత్సరం తాగునీటికి కటకట ఏర్పడిన సందర్భాలున్నాయన్నారు. తాను రాష్ట్రం అభివృద్ధి కోసం చేస్తున్న పనులను ప్రతిపక్షం అడ్డుకోవడం జరుగుతోందన్నారు. ప్రజలు చైతన్యవంతులుగా మారిన ఆ ప్రయత్నాలను తిప్పి కొట్టాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గ్యాస్‌ను అందరికీ ఇస్తున్నామని, రాలేదంటే మీ ఇంటికే వచ్చి ఇస్తానన్నారు. తన మానసపుత్రిక డ్వాక్రా అని ముఖ్యమంత్రి అన్నాను.

దెయ్యాలతో గొడవలొద్దు



(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఒక్క ఎకరా భూమి అయిన ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ హాయాంలో రేషన్ షాపులకు వెళ్లితే నిత్యావసర వస్తువులు 9 రకాలు ఇచ్చే వారని, బాబు సీఎం అయ్యాక బియ్యం తప్ప మరొకటి ఇవ్వడం లేదన్నారు. వీధి వీధికో బెల్ట్ షాపు నెలకొల్పి మెసేజ్‌లు పెడితే మందు ఇంటికే వస్తోందని, ఇది చంద్రబాబు పాలన అని ఎద్దేవా చేశారు. రైతులకు రూ. 87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామన్నారని, బ్యాంక్‌ల్లో పెట్టిన బంగారం బయటకు వచ్చిందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ భృతి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. రైతులు, మహిళలు, విద్యార్థులు నిరుద్యోగులను చంద్రబాబు దారుణంగా మోసం చేశారన్నారు. చివరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక కర్నూలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. జీవితంలో నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబు అన్నారు. మట్టి నుంచి ఇసుక, గుడి భూముల నుంచి రాజధాని భూములు, విశాఖ భూములను వదలేదన్నారు. వైఎస్సార్ సంక్షేమ పథకాల అమలుతో ప్రజల గుండెల్లో బతికి ఉండటమే నా ఆస్తిగా అభివర్ణించారు. జగన్ అబద్దం ఆడడు, మోసం చేయడన్నారు. మాట మీద నిలబడే విశ్వసనీయతే నాకున్న ఆస్తి అని చెబుతూ, విలువలతో కూడి రాజకీయాలే నాకు ఆస్తి పాస్తులన్నారు. జగన్ వాళ్ళ నాన్న మాదిరిగానే మాటపై నిలబడతాడన్న విశ్వసనీయత, నాన్న మాదిరే గొప్ప పరిపాలన అందిస్తారన్న నమ్మకం నాకున్న మరో ఆస్తి అన్నారు. దేవుడు దయ, మీ ఆశీస్సులు నాకు కావాలని కోరారు. రాజకీయాల్లో జవాబుదారితనం రావాలన్నారు.

ఎన్డీయేలోకి జేడీయూ



న్యూఢిల్లీ : జేడీయూ మళ్లీ బీజేపీతో జత కట్టింది.. చెట్టాపట్టాలేసుకుని ఛలో ఎన్డీఏ అంటూ బీహార్ నుంచి ఢిల్లీకి పయనమైంది. ఆర్జేడీతో విభేదించి... బీజేపీ మద్దతుతో బీహార్‌లో ప్రభుత్వాన్ని నడుపుతున్న జేడీయూ.. కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో చేరేందుకు ఎన్నో రోజులుగా సిద్ధంగా ఉన్నప్పటికీ.. ఆ పార్టీ సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ మొండి ఘటంలా అడ్డుపడటంతో వేచి చూసే ధోరణిని అవలంభించింది. యాదవ్ పార్టీవ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టడంతో పాటు చిరకాల మిత్రుడు మోడీతో కలిసినడవాలని జేడీయూ చీఫ్ నితీష్ ఢిల్లీ బాటపట్టారు. నితీష్ అధికారిక నివాసంలో భేటీ అయిన జేడీయూ జాతీయ కార్యవర్గ కమిటీ ఎన్డీఏలో చేరేందుకు సముఖత వ్యక్తం చేస్తూ తీర్మానం చేసింది. దీంతో పాతమిత్రులు జేడీయూ, బీజేపీలు మళ్లీ ఒక్కటైపోయాయి.

నితీష్‌కు పోటీగా శరద్ సమావేశం

బీజేపీ ఆహ్వానాన్ని మన్నిస్తూ ఎన్డీఏ కూటమిలో చేరేందుకు జేడీయూ జాతీయ కార్యవర్గం భేటీ అయిన సమయంలోనే ఆ పార్టీ సీనియర్ నాయకుడు శరద్‌యాదవ్ పోటీగా పాట్నాలో మరో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్డీఏ కూటమిలో చేరాలన్న నితీష్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న శరద్ యాదవ్ ఆర్జేడీ అధ్యక్షుడు లాలూకే మద్దతు పలుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే తన మద్దతుదారులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

యాదవ్‌కు జేడీయూ సీరియస్ వార్నింగ్

నితీష్‌కుమార్ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శరద యాదవ్‌పై జేడీయూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీసీనియర్ నాయకుడు అన్న ఒకే ఒక్క మినహాయింపుతో యాదవ్‌పై ఇన్నాళ్లు చర్యలు తీసుకోలేదని జేడియూ జనరల్ సెక్రటరీ కేసీత్యాగి అన్నారు. ఈనెల27న ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించే భారీ ర్యాలీకి శరద్ యాదవ్ హాజరైతే లక్ష్మణరేఖ దాటినట్లేనని హెచ్చరించారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న యాదవ్‌పై వేటుకు రంగం సిద్ధమైనప్పటికీ ... అధినాయకత్వం వేచిచూసే ధోరణితో ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న లాలూకు దూరంగా ఉన్న జేడీయూ నిర్ణయాలను యాదవ్ వ్యతిరేకించ డంపై ఇప్పటికే ఆగ్రహంగా ఉన్న నితీష్..లాలూ ర్యాలీకి పార్టీ నేతలెవ్వరూ హాజరుకాకూడదని హుకుం జారీ చేశారు. అయినప్పటి కీ శరద్ యాదవ్ ..పార్టీ అధినాయకత్వం ఆదేశాలను భేఖాతరు చేస్తున్నారు. ఈనేపథ్యంలో జేడీయూ జనరల్ సెక్రటరీ కేసీ త్యాగి శరద్ యాదవ్‌కు హెచ్చరికలు జారీ చేశారు.

ఈసీని ఆశ్రయిస్తాం..

జేడీయూ అధ్యక్షుడు నితీష్ వ్యవహార శైలిపై గుర్రుగా ఉన్న పార్టీ సీనియర్ నాయ కుడు శరద్ యాదవ్ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో జేడీ యూ చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న యాదవ్... పార్టీ గుర్తు, పార్టీ తనవేనని ఈసీ ముందుకు వెళ్లబోతున్నారు. తన కృషి వల్ల జేడీయూ ఈ స్థాయికి వచ్చిందన్న శరద్ యాదవ్..ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీని, పార్టీ గుర్తు బాణంను వదులుకునే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. లాలూ ర్యాలీకి హాజరైతే తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తున్న నాయకు లకు కూడా యాదవ్ అవాకులు... చవాకులు విసిరారు. జేడీయూ ఆవిర్భావానికి శరద్ యాదవ్ మాత్రమే కృషి చేశారని...నితీష్ లాంటివాళ్లు పార్టీ పుట్టిన తర్వాత వచ్చిన వారేనని జేడీయూ నేత అరుణ్ శ్రీవాత్సవ అన్నారు.

ప్రేమోన్మాది ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

మార్పు రాలేదు. దీంతో రూప తల్లిదండ్రులు ఆమెను చదువు మాన్పించి ఇంటి దగ్గర ఉంచారు. దీంతో సతీష్ ఆమెపై పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రూప తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో కిరసనాయిల్‌తో రూప ఇంటికి వెళ్లి ఆమెతో వాదనకు దిగాడు. ఆ తరువాత కిరసనాయిల్ పోసి నిప్పంటించాడు. అయితే రూపను రక్షించే ప్రయత్నంలో ఆమె తమ్ముడు ఉపేంద్ర కూడా గాయపడ్డాడు. కానీ రూప అక్కడికక్కడే కాలి బూడిదగా మారిపోయింది. ఆ తరువాత సతీష్ అక్కడ నుంచి పరారయ్యాడు. కాని భయం వెంటాడటంతో విజయనగరంకు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా సతీష్ తండ్రి తగరపువలస బైపాస్ రోడ్డులో పరుపులుకుట్టే వ్యాపారం ఉంది. సతీష్ మాత్రం చదువుకోకుండా జులాయిగా తిరిగే వాడు. తమ కుమార్తె అన్యాయంగా సజీవ దహనమైందని రూప తల్లిదండ్రులు హృదయవిదారకం గా విలపిస్తున్నారు.

కారం మిల్లులపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)

సేకరించారు. ఒక మిల్లులో పురుగులు పట్టి ఉన్న పాతకారం ఉన్న 30 కారం బస్తాలను సీజ్ చేశారు. దాడులకు ఏపీ ఫుడ్ అండ్ సేఫ్టీ జాయింట్ కంట్రోలర్ కేఎన్ స్వరూప్ సారథ్యం వహించగా, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గౌస్‌మొహిద్దీన్ పర్యవేక్షణలో 19 బృందాలు నగరంలో కారం మిల్లులపై ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఇదిలా ఉంటే మూడురోజుల క్రితం గుంటూరులో పౌరసరఫరాల శాఖామంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కల్తీకారాన్ని స్వచ్ఛంధంగా పారవేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో సుమారు 60 వేల బస్తాలు వాగుల్లో, పొలాల్లో పారవేయడం ఈ సందర్భంగా గమనార్హం. దాడులనుద్దేశించి గుంటూరు మిర్చి మార్కెట్‌యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆహార భద్రత పర్యవేక్షణ అధికారులతోపాటు మరో ఐదు శాఖల ప్రభుత్వాధికారులు 20 బృందాలతో మూడు రోజులపాటు దాడులు నిర్వహించనున్నట్లు వివరించారు. గత వారం రోజులుగా ప్రజల నుంచి కల్తీ పచ్చళ్లు, కారం గురించి ఫిర్యాదులు వస్తోన్న నేపథ్యంలో దాడులు చేశారు. గుంటూరు మిర్చి, కారానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయవద్దని ఈసందర్భంగా తయారీ దారులను మన్నవ కోరారు. కల్తీకారం తయారీ దారులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేవారిని ఉపేక్షించేదిలేద న్నారు. రసాయనాలు కలిపి పనికిరాని కారాన్ని కల్తీచేసి విక్రయిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కల్తీ తయారీ దారుల లైసెన్స్‌లను రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కల్తీకారం మార్కెటింగ్ చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు పీడీ యాక్ట్ అమలు చేసి జిల్లా నుంచి బహిష్కరించాలని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు సిఫారసు చేయనున్నట్లు చెప్పారు. దాడుల్లో కృష్ణా, విశాఖ జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు పూర్ణచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, మిర్చియార్డు కార్యదర్శి ఎం.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సెంట్రల్ జైలు నుంచి పాక్ యావజ్జీవ ఖైదీ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గూఢచర్యం కేసులో అరెస్టయి వరంగల్‌లోని సెంట్రల్ జైలులో యావజ్జీవ శిక్ష అనుభవించిన పాకిస్థాన్ ఖైదీ అర్షాద్ మహమ్మద్(35)ను శనివారం జైలు అధికారులు విడుదల చేశారు. అతడ్ని తిరిగి పాకిస్థాన్‌కు అప్పగించనున్నారు. జైలు సూపరింటెండెంట్ కథనం ప్రకారం.. గూఢచర్యం కేడులో పట్టుబడిన అర్షాద్ మహమ్మద్‌కు 30 ఏప్రిల్ 2009లో యావజ్జీవ ఖైదు విధించారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో కొన్నాళ్లు శిక్ష అనుభవించాక, భద్రతా కారణాల రీత్యా అర్షాద్‌ను వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. గత ఏడాది ఆగస్టు 16తో ఇతడి శిక్షాకాలం పూర్తయింది. దీంతో మహమ్మద్ తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లేందుకు గతేడాదే భారత ప్రభుత్వం అనుమతించింది. అయితే ఈ అప్పగింతకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అనుమతి రాకపోవడం వల్ల ఇంతకాలం ఇతడు వరంగల్ జైలులోనే ఉండాల్సి వచ్చింది. తనను పాకిస్థాన్‌కు తిరిగి పంపించేందుకు సాయపడాల్సిందిగా అర్షాద్ మహమ్మద్ విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు కూడా విన్నవించుకున్నాడు. ఈ నేపథ్యంలో అప్పగింత ప్రక్రియ పూర్తవడంతో అర్షాద్ మహమ్మద్‌ను వాఘా సరిహద్దుకు చేర్చాలని, అందుకు వీలుగా అతడ్ని హైదరాబాద్ పోలీసులకు అప్పగించాలని హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో వరంగల్ సెంట్రల్ జైలు అధికారులు శనివారం అర్షాద్ మహమ్మద్‌ను హైదరాబాద్ పోలీసులకు అప్పగించారు.

వర్షం.. వర్షం...
కర్షకుల హర్షం

(మొదటి పేజీ తరువాయి)

72.8 మిల్లీమీటర్ల వర్షపాతం పడింది. కూనవరంలోనూ 67.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. కొన్ని మండలాల్లో రికార్డుస్థాయి వర్షపాతం నమోదు అయ్యింది. విజయవాడలో రోడ్లు జలమయమై వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. ఉదయం నుంచే ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుండటంతో వాహనచోదకులు రోడ్లపైకి వచ్చే ప్రయత్నం చేయలేదు. ఒంటిగంట సమయంలో కొన్నిచోట్ల వర్షం తెరిపిచ్చింది. ఏలూరు, రాజమండ్రి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద రోడ్లపైకి నీరుచేరి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. దాదాపు నాలుగు గంటలపాటు కొన్ని చోట్ల వర్షాలు పడ్డాయి. గంట వ్యవధిలోనే కుంభవృష్టిపడి రోడ్లు పిల్లకాలవలను తలపించాయి. డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి మురుగునీరు చేరింది.

విజయవాడ పరిధిలోని మొగల్రాజపురం, పాయకాపురం, ఆటోనగర్ వంటి ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ప్రజలు ఇక్కట్లు పడ్డారు. ఇది ఇలా ఉండగా శనివారం రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలు సెలవులు కావడంతో ఉద్యోగులకు కాస్త ఊరటలభించింది. చాలా వరకూ ప్రవేటు విద్యాసంస్థలు తమ పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. కొన్ని పాఠశాలలు నిర్వహించినా మధ్యాహ్నం నుంచి వదిలివేశారు. అయితే ఇంతటివర్షంలో విద్యార్థులు, చిన్నారులు నానా ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు వెళ్లారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్ష సూచన

ఒడిశాను ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడ నం ఏర్పడింది. ఉపరితల ఆవర్తనం వల్ల రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో సాధారణ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, రాయలసీమ ప్రాంతంలోనూ కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం కూడా రాయలసీమ జిల్లాల్లో సెంటీమీటర్ నుంచి నాలుగు సెంటీమీటర్ల వరకూ వర్షపాతం నమోదు అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరుపాడులో 65.4 మిల్లీమీటర్లు, చింతపల్లి 61, నర్సీపట్నం 52.4, నందిగామ 49.1, చింతలపూడి 45.2, చింతూరు 44.2, నూజివీడు 39.4, యలమంచిలి 37.8, ఏలూరు 37, పార్వతీపురం 36.4, మండవ 35.2, పీలేరుబ్రిడ్జి 35, తిరువూరు 34.8, పోలవరం 32.4, సోంపేట 31.2, తాడేపల్లిగూడెం 29.4, తుని 28.9, అరకువ్యాలీ 28, పాడేరు 27.4, అమలాపురం26.4, కుకునూరు 26, పలాసా 24.8, కైకలూరు 23.2, కోయలగూడెం 22.4, శీతానగరం 22.2, బండ్లపల్లి 21.8, గుడివాడ 20.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయ్యింది. ప్రధాన కాల్వల్లోకి వరద నీరు వచ్చిచేరింది. కొన్ని జిల్లాల్లో చెరువులు నిండుకుండల్లా మారాయి. భూగర్భజలాలు పెరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వరి, మొక్కజొన్న, వేరుశెనగ, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి



తోటలకు ఉద్యానవనపంటలకు వర్షాలు ఊరటనిస్తాయంటున్నారు. నేడు మత్స్యకారులు వేటకు వెళ్లే విషయంలో జాగ్రత్తలు పాటించాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. సముద్రతీరంలో 50 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. ఈ క్రమంలో సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు వాతావరణశాఖ సూచనలు పాటించాలని కోరారు. మరో 24గంటలపాటు భారీవర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ముఖ్యంగా మున్సిపాలిటీలు, పంచాయతీల సిబ్బంది తగిన విధంగా స్పందించాలని ఆదేశించింది. కుండపోత వర్షాలు అక్కడక్కడ పడే ప్రమాదం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది.

పలు జిల్లాలకు పిడుగు హెచ్చరిక

అమరావతి, ఆంధ్రప్రభ : వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో వర్షంతోపాటే పలు చోట్ల పిడుగులు పడుతున్నాయి. పిడుగులు పడే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ శనివారం ప్రకటించింది. రాయలసీమ జిల్లాలతోపాటు కోస్తా పాంతంలోని పలుచోట్ల శనివారం పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అనంతపురం జిల్లాలో బాతలపల్లే, అనంతపురం, కుదైర్, విద్యాపానకల్, ఉరవకొండ, తాడిమర్రి, పమిడి, కడప జిల్లా చక్రాయపేట, ఓబులవారిపల్లే, పుల్లంపేట, చిన్నాయగొట్టిగల్లు, రాజంపేట, కోడూరు, చిత్వాల్, గాలివీడు, చిత్తూరు జిల్లా పలమనేరు, కలికిరి, బంగారుపాలెం, వరదలయ్యపాలెం, సత్యవేడు, బుచ్చయ్యనాయుడు కండ్రిగ, యర్రవారిపాలెం, నెల్లూరు జిల్లా తడ, సూళ్లూరుపేట, కోట, నాయుడుపేట, చిట్టిమూర్, ఓజిలి, బాలయపాలెంలలో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆయా మండలాల తహసిల్దార్లు, గ్రామాల విఆర్‌వో, విఆర్‌ఏలు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆశాఖాధికారులు సమాచారం అందించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, బలమైన నివాసాల్లో అన్నీ తలుపులు వేసుకుని ఉండాలని సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్లక్రింద, పొలాల్లో, ఖాళీ స్థలాల్లో ఉండవద్దని సూచించారు.

ఆంధ్రప్రభ

ఎన్‌సీసీ గెస్ట్ క్యాడెట్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ విద్యాసంస్థల్లో నేషనల్ కేడెట్ కోర్ప్స్ (ఎన్‌సీసీ) కోటా కింద గెస్ట్ క్యాడెట్లకు కూడా ప్రవేశాలు కల్పిస్తూ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు జారీ చేసిన జీ వోలు 14, 23, 109 , 75 లను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తుల ఆదేశాలకు , ఒత్తిళ్లకు తలొగ్గి రెండు ప్రభుత్వాలు జారీ చేసిన ఆ జీ వోలు చట్ట విరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు. గెస్ట్ కోటాలో పలువురు విద్యార్థులు ప్రవేశాలు పొందారని తెలిపారు. గెస్ట్ కోటా అనేది ఎన్‌సీసీ చట్టంలోనే లేదని తెలిపారు. నేషనల్ క్యాడెట్లు మొత్తం 13 లక్షలున్నారు, వారి సర్వీసులను ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ అనే మూడు విభాగాలుగా విభజించినట్లు తెలిపారు. గెస్ట్ క్యాడెట్లకు ప్రవేశాలు కల్పించాలన్న రెండు ప్రభుత్వాల నిర్ణయం వల్ల అసలైన క్యాడెట్లు నష్టపోతున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. గెస్ట్ కోటా అభ్యర్థులు ఎన్‌సీసీ లో నమోదు చేసుకోలేదని, ఎలాంటి శిక్షణ పొందలేదన్నారు. 2017-18 విద్యాసంవత్సరంలోనైనా ఎన్‌సీసీ కోటా కింద అసలైన ఎన్‌సీసీ క్యాడెట్ల కే విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించేలా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించాలని పిటిషనర్లు అభ్యర్థించారు. ఈ ప్రజాహిత వ్యాజ్యం లో ప్రతివాదులుగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రెండు రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల కన్వీనర్లు , నీట్ కన్వీనర్లు, ఎంసెట్ కన్వీనర్లను చేర్చారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

ఎక్స్‌గ్రేషియా పెంచడంపై హర్షం

• సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన అమరావతి జేఏసీ నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ : కారుణ్య నియామకాలు అవకాశం లేని ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచడంపట్ల అమరావతి జేఏసి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఫణి పేర్రాజులు శనివారం హర్షం ప్రకటించారు. ఈ మేరకు బొప్పరాజు ఆంధ్రప్రభతో మాట్లాడుతూ కారుణ్య నియామకాలు లేని ఉద్యోగులు కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇస్తుందని 10 సంవత్సరాల క్రింత నాలుగవ తరగతి ఉద్యోగికి రూ.40 వేలు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగికి రూ.60 వేలు, గేజిటెడ్ ఉద్యోగి కుటుంబానికి రూ.80 వేలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై తాము ముఖ్యమంత్రి, ప్రభుత్వ కార్యదర్శితో జరిపిన చర్చలు విజయవంతం అయ్యాయన్నారు. ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ ప్రభుత్వం శనివారం నిర్ణయించిందన్నారు. నాలుగవ తరగతి ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షలు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగి కుటుంబానికి రూ.8 లక్షలు, గెజిటెడ్ ఉద్యోగి కుటుంబానికి రూ.10 లక్షలు పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అన్నారు. దీని వల్ల 10 లక్షల మంది ఉద్యోగులకు ప్రత్యేకంగా లక్షా 10వేల మంది పోలీసు కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి తమకు ఇచ్చిన ఈ సౌకర్యం పట్ల అందరి ఉద్యోగుల తరపున తాము సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నిజాయితీగా, నిర్భయంగా ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రతీ ఉద్యోగి పనిచేస్తారనీ సీఎం ఆశయాలకు అనుగుణంగా కష్టపడి పనిచేస్తామని బొప్పరాజు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ ఈ సమస్యను తాము అడిగిన వెంటనే పరిష్కరించేందుకు కృషిచేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉద్యోగులందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.

కోవూరులో 13 మంది బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

• రూ. 6 వేల నగదు, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

కోవూరు, కెఎన్ఎన్: కోవూరు పట్టణంలోని బండారుమాన్యం అనే ప్రాంతంలో ఓ దుకాణంలో బెట్టింగుకు పాల్పడుతున్నారన్న సమాచారంతో కోవూరు సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్సై అళహరి వెంకటరావులు తమ సిబ్బందితో ఆ దుకాణంపై దాడిచేసి అక్కడ 13 మంది బెట్టింగ్ రాయుళ్ళను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బండారు మాన్యం ప్రాంతంలోఓ దుకాణంలో బెట్టింగులకు పాల్పడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో ఆ దుకాణంపై దాడిచేసి అక్కడ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6 వేలు నగదు, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వారిని స్టేషనుకు తరలించారు. వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ క్రింద కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరచనున్నామని సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై అళహరి వెంకటరావు, కానిస్టేబుల్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రూ. కోటి పాత నోట్లు స్వాధీనం

• ముఠా సభ్యుల అరెస్టు

నల్లకుంట, కెఎన్ఎన్ : కోటి రూపాయల పాతనోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి పాత నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బర్కత్‌పురలోని పాలెం టవర్స్‌లో రాజ్‌కుమార్‌బగాడియా తన వద్ద ఉన్న కోటి రూపాయల పాత నోట్లను కమీషన్ పద్దతిలో మార్చేందుకు బ్రోకర్లను ఆశ్రయించారు. తలాబ్‌కట్టకు చెందిన అహ్మద్ బిన్ అలీ(31), దూద్‌బౌలికి చెందిన మహ్మద్ సల్మాన్(28), చార్మినార్ ప్రాంతానికి చెందిన ఎం.డీ. షబీర్(43), నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన ఎం.డీ. అహ్మద్ షరీఫ్(30) రెడ్డి శేఖర్(60)లను ఇంటి వద్దకు పిలిపించాడు. ఇంట్లో పాత నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి వారివద్ద ఉన్న 7900 రూపాయలు వెయ్యినోట్లు, 4200 రూపాయలు 500 నోట్లు మొత్తం కోటి రూపాయలతో పాటు 7సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం కాచిగూడ పోలీసులకు అప్పగించినట్టు వివరించారు. కాచిగూడ పోలీసులు వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ధర్మిరెడ్డి గిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విక్రమ్‌గౌడ్‌కు బెయిల్ మంజూరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాల్పుల కేసులో మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా రూ.25 వేల విలువైన రెండు షూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. పాస్‌పోర్టును స్వాధీనం చేయాలని తెలిపింది. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్యలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసులో విక్రమ్‌గౌడ్‌ను ఆగస్టు 3న పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అపోలో నుంచి నాంపల్లి కోర్టుకు తరలించిన విక్రమ్‌గౌడ్‌కు న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. విక్రమ్‌గౌడ్‌కు ఒక రోజు పోలీసు కస్టడీకి అనుమతించడంతో ఈ నెల 9న విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు నాలుగు గంటల పాటు విచారించారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా తానై తనపై కాల్పులు జరిపించుకున్న విక్రమ్‌గౌడ్ చిట్టచివరికి తాను తీసిన గోతిలో తానే పడ్డారు. ఈ ఘటన పెను సంచలనం కలిగించింది. ఘటనలో ఆయన శరీరంలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనపై కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు విక్రమ్‌గౌడ్ ఆరోగ్యపరిస్థితి మెరుగ్గా వుందని డాక్టర్లు చెప్పిన దరిమిలా విక్రమ్‌గౌడ్‌ను ఆసుపత్రిలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విక్రమ్‌తో పాటు ఈ కేసులో మరో ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేశారు.

1991 బ్యాచ్ సీఐలు డీఎస్పీలుగా పదోన్నతిలో కొనసాగుతున్న లొల్లి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 1991 బ్యాచ్ సీఐలు డీఎస్పీలుగా పదోన్నతిలో లొల్లి కొనసాగుతూనే ఉంది. మూడు న్నర సంవత్సరాలుగా ఈ పదోన్నతులపై రభస సాగుతూనే ఉందని సమాచారం. ఎప్పటికప్పుడు తమ సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్న పోలీసు బాస్‌లు తమ స్వప్రయోజనాలను చూసుకున్నారు తప్పించి తమకు మేలు చేసిన పాపాన పోలేదన్నది వారి వాదనగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ రేంజ్ వాళ్లు బాగుపడ్డారు తప్పించి సిటీ, వరంగల్ రేంజ్ వాళ్లు తీవ్రంగా నష్టపోయారని తెలుస్తోంది. తమ తర్వాత వచ్చిన వారు సైతం పదోన్నతులు పొందారని అంటున్నారు. ఈ కారణంగా రెండు రాష్ట్రాలు విడిపోయినా పోలీసు శాఖలో పంపకాలలో సైతం బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఇటు మూడుజోన్ల వ్యవధిలో సమస్య పరిష్కారానికి నోచుకున్నప్పటికీ అటు నాలుగుజోన్లలో పరిస్థితి ఇంకా ఒక కొలిక్కి రాలేదని చెబుతున్నారు. దీంతో, తమ ప్రమోషన్లకు మోక్షమెప్పుడు అని 1991 బ్యాచ్ సీఐలు రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డికి తమ మొర చెప్పుకున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర బీజేపీలో అసంతృప్తులు!

• నాయకత్వ భిన్న నిర్ణయాలపై ఆగ్రహం
• తెదేపా బలోపేతానికి ఇలాంటి నిర్ణయాలంటూ మండిపాటు
• అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లే యోచనలో కొందరు నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర బీజేపీలో అసంతృప్తి రగులుతోంది. నంద్యాల ఉప ఎన్నికలు, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ నాయకత్వం తీసుకుంటున్న విధానాల పట్ల కొందరు నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు కేంద్ర బీజేపీ నాయకత్వం రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు అనేక కార్యక్రమాలు చేపడుతుంటే.. ఇక్కడి నాయకత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా పార్టీ పట్ల ఉన్న కొద్దిపాటి అభిమానం కూడా పోయే విధంగా ఉన్నాయనేది పలువురి ఆరోపణ. ఇదే విషయాలను అమిత్ షా దృష్టికి తీసుకెళ్లాలనే యోచనలో కొందరు నేతలు ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాకకు ముందు చోటు చేసుకుంటున్న ఈ పరిణామాల ఎక్కడకు దారితీస్తాయోననే ఆందోళన కొందరు బీజేపీ నేతల్లో వ్యక్తమవుతోంది. నంద్యాల శాసనసభకు ఉప ఎన్నికతో పాటు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు ఈ నెలలోనే జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యులు డాక్టర్ కంభంపాటి హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన పదాధికారుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కేడర్‌లో ఆగ్రహం కలిగిస్తున్నాయి. సమావేశంలో మిత్రపక్ష తెలుగుదేశం పార్టీకి నంద్యాల ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని, కాకినాడ కార్పొరేషన్‌లో కలిసి పని చేయాలంటూ నిర్ణయించారు. అయితే తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు పార్టీ జెండాలు లేకుండా నంద్యాలలో ప్రచారం నిర్వహించాలంటూ నేతలకు సూచనలు అందాయి. నంద్యాల ఉప ఎన్నికల్లో ముస్లిం మైనారిటీల ఓట్లు కీలకమైనందున తెదేపా నేతల అభ్యర్థన మేరకు బీజేపీ నాయకత్వం ఈ తరహా నిర్ణయం తీసుకోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. పార్టీ జెండాలు లేకుండా ప్రచారంలోకి వెళ్లాల్సిన అవసరం ఏంటనేది పలువురు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం. ఓ వైపు దేశంలో మైనారిటీలు బీజేపీ ప్రభుత్వ విధానాల పట్ల ఆకర్షితులవుతున్నట్లు చెపుతూనే ఇక్కడ మాత్రం భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో కాకినాడ కలిసి పోటీ చేస్తామనడంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాకినాడ కార్పొరేషన్‌లో కాపుల పాత్ర కీలకంగా ఉందనేది పార్టీ నేతల అభిప్రాయం. ఇప్పటికే కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు ప్రభుత్వం అనుమతించకపోవడంపై ఆ వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం పార్టీతో కలిసి వెళ్లడం వలన ఒనగూరే ప్రయోజనమేంటంటూ పార్టీ అధిష్టానాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి సినీ నటుడు కృష్ణంరాజు గెలుపు వెనుక కాపులు క్రియాశీలక పాత్ర పోషించారనేది పార్టీలోని ఓ వర్గం భావన. అలాంటిది ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్ర పార్టీ నిర్ణయం పార్టీకి ఇబ్బందికరమేనని చెపుతున్నారు. పైగా అనేక చోట్ల తెదేపా తరుపున నామినేషన్లు దాఖలు చేసి ఉపసంహరించుకోకపోవడాన్ని బీజేఎల్‌పీ నేత విష్ణుకుమార్ రాజు సహా పలువురు తప్పుబట్టారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీకి కేటాయించిన స్థానాల్లో బీజేపీ తరుపున నామినేషన్లు దాఖలు చేసిన వారు ఉప సంహరించుకోగా, బీజేపీకి కేటాయించిన స్థానాల్లో నామినేషన్లు వేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఉపసంహరించు కోలేదని వీరు చెపుతున్నారు. కాపుల ఆగ్రహం, తెలుగుదేశం పార్టీ నుంచి బరిలో నిలిచే రెబల్స్ కారణంగా పార్టీకి తీరని నష్టం జరిగే అవకాశం ఉందని, ఇది రానున్న సార్వత్రిక ఎన్నికలపై పడి బీజేపీకి భారీ నష్టం జరుగుతుందనే ఆందోళన కొందరిలో వ్యక్తమవుతోంది. ఒకే నెలలో జరుగుతున్న రెండు వేర్వేరు ఎన్నికల్లో భిన్న నిర్ణయాలు తీసుకోవడాన్ని ఓ వర్గం జీర్ణించుకోవడం లేదు. అదేమంటే 2019 వరకు తెలుగుదేశం పార్టీతో మిత్రపక్షంగా ఉండక తప్పదంటూ రాష్ట్ర బీజేపీ నేతలు చెప్పడాన్ని వారు తప్పుబడుతున్నారు. మిత్రపక్షంగా కొనసాగడమంటే పార్టీ పరంగా నష్టపోవడమా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. గత మూడేళ్లుగా రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీసుకుంటున్న విధానాలు మిత్రపక్ష తెలుగుదేశం పార్టీ బలపడేందుకు దోహదపడుతున్నాయి తప్ప బీజేపీ బలోపేతానికి ఏ విధంగాను ఉపకరించడం లేదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ రాష్ట్రనాయకత్వం తీసుకుంటున్న పరస్పర భిన్న నిర్ణయాలను రాష్ట్ర పర్యటనకు వస్తున్న జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దృష్టికి తీసుకెళ్లాలనే యోచనలో కొందరు ఉన్నారు. మరి వీరి వాదనకు అమిత్ షా అండగా ఉంటారా? గతంలో మాదిరిగానే విందు సమావేశాలతో సరిపెట్టి రాష్ట్ర నాయకత్వ చర్యలను సమర్థిస్తారా? అనేది ఇప్పుడు బీజేపీలో చర్చనీయాంశంగా మారింది.

మీడియా ప్రముఖులతో అమిత్‌షా భేటీ!

• జాబితా తయారీలో రాష్ట్ర నాయకత్వం




అమరావతి, ఆంధ్రప్రభ : గత పర్యటనలతో పోల్చితే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మూడు రోజుల రాష్ట్ర పర్యటన భిన్నంగా సాగనున్నట్లు తెలిసింది. ఓ వైపు పార్టీ శ్రేణులను పార్టీ బలోపేతంపై సమాయత్తం చేస్తూనే..మరో వైపు వివిధ వర్గాలతో ప్రత్యేక సమావేశాల నిర్వణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలో బలపడేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఇందులో భాగంగా మీడియా యాజమాన్యాలు, ఎడిటర్లతో విడివిడిగా సమావేశాల నిర్వహణపై ఆయన దృష్టిసారించినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో పార్టీ నిర్మాణంలో పత్రికలు, మీడియా యాజమాన్యాలతో పాటు ఎడిటర్ల సహకారం కూడా కోరే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీ నిర్మాణానికి తాము తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో వారి సలహాలు, సూచనలు కూడా ఆయన తీసుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్ర బీజేపీ నాయకత్వం వైద్యులు, చార్టర్డ్‌అకౌంటెంట్లు, వివిధ సంఘాలతో సమావేశాల నిర్వహణకు నిర్ణయించుకుంది. ఇదే సమయంలో మీడియా యాజమాన్యాలు, ఎడిటర్ల సమావేశాలకు కూడా చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర నాయకత్వం నుంచి ఆదేశాలు అందినట్లు చెపుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఆయా ప్రముఖుల జాబితా రూపొందించే పనిలో ఇక్కడి పార్టీ నేతలు ఉన్నారు. మూడు రోజుల పర్యటనలో పార్టీ కార్యకర్తలు సహా పలువురితో సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించింది తప్ప ఇప్పటి వరకు సమావేశాల వివరాలు ఖరారు కాలేదు. అయితే ఏయే వర్గాలతో సమావేశాలు నిర్వహించాలనేదానిపై స్పష్టత వచ్చిన తర్వాత తేదీలు, సమావేశం సమయాలు ఖరారు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మునిసిపాలిటీల సమగ్రాభివృద్ధే ధ్యేయం

• మంత్రి నారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ : తల్లి, పిల్ల కాంగ్రెస్‌ల హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలను మూడేళ్ళలో అన్ని విధాల అభివృద్ధిచేసి దేశంలోనే ఉత్తమ మునిసిపాలిటీలుగా తెలుగుదేశం ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డవలప్‌మెంట్ శాఖా మంత్రి పి నారాయణ అన్నారు. దేశంలోనే తొలిసారిగా నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజాసేవలన్నింటినీ తెలుగుదేశం ప్రభుత్వం ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. పన్నులు, బిల్లులు చెల్లించడానికి ప్రజలు గంటల తరబడి క్యూలైన్లలో నుంచోవలసిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే చెల్లించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన రన సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. మునిసిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి విజయవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. ఇటీవల స్వచ్ఛభారత్ ప్రకటించిన గణాంకాల్లో కూడా రాష్ట్రం మెరుగైన స్థానాన్ని దక్కించుకోవడం జరిగిందన్నారు. మున్సిపాలిటీల్లో రోడ్డు నిర్మాణం ఇంటింటా చెత్త సేకరణ మొక్కల పెంపకం, ఉద్యాన వనాల అభివృద్ధి, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ వంటి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ప్రజల ఫీడ్ బ్యాక్ తీసుకుని సక్రమంగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీల్లో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటుచేసి విద్యుత్‌ను ప్రభుత్వం ఆదా చేస్తుందన్నారు. 2018 నాటికల్లా రాష్ట్రం పూర్తిగా ఓడీఎఫ్ కావాలన్న లక్ష్యంతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించిదన్నారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకూ ఏ ఒక్క ప్రాంతంలోనూ, ఏ ఒక్క మునిసిపాలిటీ నిర్లక్ష్యానికి గురికాకుండా అన్ని మునిసిపాలిటీల సమగ్రాభివృద్ధి జరిపేందుకు ప్రభుత్వం ఉద్యం స్ఫూర్తితో పనిచేస్తుందని తెలిపారు. మునిసిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమీక్షిస్తూ అవసరమైనచోట డ్రోన్ కెమెరాల ద్వారా సమీక్షిస్తుందన్నారు. మునిసిపాలిటీల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



రాజధానిలో కొనసాగుతున్న

అక్రమ కట్టడాల కూల్చివేతలు

• నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలని సీఆర్డీఏ సూచన

అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి రాజధాని పరిధిలోని అక్రమ కట్టడాలపై సీఆర్‌డీఏ తన కొరడా ఝులిపిస్తుంది. ముందుగా రాజధాని పరిధిలోని అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు పంపిస్తున్న సీఆర్‌డీఏ అనంతరం చర్యలు చేపడుతుంది. ఇప్పటికే ఉయ్యూరు, తాడిగడప, ఇబ్రహీంపట్నంతోపాటు పలు ప్రాంతాలలో అక్రమకట్టడాలను కూల్చివేసిన సీఆర్‌డీఏ శనివారం యనమలకుదురులోని 3 అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేశారు. ఓభవనంలో అనుమతిలేని 3వ అంతస్తు శ్లాబును, మరో భవనంలోని నాలుగో ఫ్లోర్ పెంట్ హౌస్‌ను సీఆర్‌డీఏ అధికారులు కూల్చివేశారు. వీటికి సమీపంలోనే వేరే భవనంలో 4 ఫ్లోర్ శ్లాబ్ పార్ట్, 3వ ఫ్లోర్ శ్లాబ్ ను కూల్చివేయటం జరిగిందని సీఆర్‌డీఏ డెపలప్ మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ వి.రాముడు తెలిపారు. అమరావతి రీజియన్ పరిధిలో నిబంధనల మేరకు అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల ప్రకారం ముందుగా అనుమతిలేని భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసి కూల్చివేతకు చర్యలు చేపడుతున్నారన్నారు. భవన నిర్మాణ దరఖాస్తులను ఆన్‌లైన్ లోనే స్వీకరించటం జరగుతుందని, నేరుగా తీసుకోవటం జరగదని డైరెక్టర్ వి. రాముడు స్పష్టంచేశారు. లైసెన్స్ డ్ సర్వేయర్ల ద్వారా నిబంధనలు ప్రకారం దరఖాస్తులను ఆన్ లైన్ లో సమర్పించుకోవాలని సూచించారు.

అర్హులైన గిరిజనులకు చంద్రన్న బీమా

• ప్రతి మండలంలో ఉద్యాన సాగుకు ప్రోత్సాహం • సెర్ప్ సీఈవో కృష్ణమోహన్

అమరావతి, ఆంధ్రప్రభ : అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి చంద్రన్న బీమా సౌకర్యం కల్పించాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సిఇవో కృష్ణమోహన్ ఆదేశించారు. శనివారం రంపచోడవరంలోని పిఎంఆర్‌సిలో వెలుగు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొత్త డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు, సామాజిక భద్రత పింఛన్లు, చంద్రన్న బీమా, సంస్థాగత బలోపేతం, స్త్రీనిధి, ఉద్యాన సాగు, మరుగుదొడ్ల నిర్మాణం, పెరటికోళ్ల పెంపకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇవో కృష్ణమోహన్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సరిగా అమలు చేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 ఐటిడిఏల పరిధిలో 700 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయని, వీరికి వ్యవసాయ, ఉద్యాన రుణాలు సెర్ప్ సంస్థనుంచి అందిస్తామని తెలిపారు. ఇప్పటికే ఒక్కొక్క గ్రూప్‌కు రూ. 10వేలు రుణం మంజూరు చేయటం జరిగిందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించి గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కొక్క గ్రూపుకు ఇద్దరు రైతు మిత్రలను నియమించి వారికి వ్యవసాయ యాంత్రీకరణ, మైక్రో ఇరిగేషన్, ఉపాధి హామీ, బ్యాంక్ రుణాల మంజూరు, రికవరీ, మార్కెటింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వీరికి నెలకు రూ. 4వేలు గౌరవ పారితోషికం అందిస్తామన్నారు. ప్రతి మండలంలో ఉద్యాన సాగును ప్రోత్సహించాలని కృష్ణమోహన్ అధికారులను ఆదేశించారు. 17 సంవత్సరాలు నిండి 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ప్రతి ఒక్కరికి చంద్రన్న బీమా సౌకర్యం వర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చంద్రన్న బీమా పథకంలో చేరేందుకు నెలకు రూ. 15వేలు లోపు ఆదాయం ఉండటంతో పాటు, 18 నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్నవారు అర్హులన్నారు. చంద్రన్నబీమాలో ఎవరయినా 50 సంవత్సరాల లోపు మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 2లక్షల బీమా పరిహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ జి. రాజేంద్రప్రసాద్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ పార్థసారథి, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు కాగానే నంద్యాల నేతలకు పదవులు!

• రేసులో ఫరూఖ్, ఏవీ సుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి

నంద్యాల, ఆంధ్రప్రభ: ఎన్నికలు కాగానే నంద్యాలకు చెందిన మరికొంత మందికి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశాలున్నాయి. నాలుగు నెలల ముందునుంచే నంద్యాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి పార్టీ కోసం కష్టపడుతున్నవారికి పదవులు ఇవ్వాలని సంకల్పించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం నంద్యాలకు శనివారం వచ్చిన ముఖ్యమంత్రిని ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా పలువురు మంత్రులు, నంద్యాల నేతలు కలుసుకున్నారు. పార్టీపరంగా ప్రచారం జరుగుతున్న తీరును వివరించారు. విజయం కోసం కష్టపడుతున్న నాయకులను, ముఖ్యంగా ఆరోగ్యం సరిగా లేకపోయినా అహర్నిశలు టీడీపీ అభ్యర్థి కోసం సమయం వెచ్చించిన వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే కర్నూలు జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు నామినేటెడ్ పదవి లభించింది. బీటీ నాయుడుకు వాల్మీకి ఫెడరేషన్ పదవి, మాజీ మంత్రి ఫరూఖ్‌కు ఎమ్మెల్సీ, మాజీ మునిసిపల్ చైర్మన్ నౌమాన్‌కు చైర్మన్ పదవులు లభించాయి. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల పందేరానికి తెరపడింది. తాజాగా పార్టీ కోసం తీవ్రంగా కుటుంబాలతో సహా తీవ్రంగా శ్రమిస్తున్న ఆర్.ఐ.సి మాజీ చైర్మన్ ఎ.వి.సుబ్బారెడ్డి పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఎన్నికలు ముగిసిన వెంటనే సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి వచ్చేలా ముఖ్యమంత్రి ఇప్పటికే తుది నిర్ణయానికి వచ్చారని, ఈ మేరకు శనివారం జరిగిన భేటీలో కూడా మంత్రులతో ఇదే విషయం చెప్పారని భావిస్తున్నారు. అదే విధంగా నంద్యాల ఎం.పి. ఎస్.పి.వై రెడ్డి కుటుంబానికి కూడా ఒక నామినేటెడ్ పదవి దక్కే అవకాశాలున్నాయి. ఎం.పి. అనారోగ్యంతో వున్నప్పటికీ ప్రచారం పై శ్రద్ధ చూపడం, అల్లుడు శ్రీధర్‌రెడ్డి, కుమార్తె సుజల కూడా పూర్తి స్థాయిలోపార్టీ కోసం శ్రమించడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి ఎస్.పి.వై కుటుంబానికి ఏ విధంగా న్యాయం చేయాలని అంశంపై చర్చించారని తెలిసింది. అదే విధంగా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామాతో ఖాళీలో ఎవరిని నియమించాలనే దిశగా కూడా చర్చ జరిగినట్టు సమాచారం. ఎస్.పి.వైరెడ్డి కుటుంబం వచ్చే సాధారణ ఎన్నికలలో మళ్ళీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ కుటుంబానికి ఇప్పటికిప్పుడు ఎమ్మెల్సీ పదవి, లేదా ఇతర ఏదైనా నామినేటెడ్ పదవి ఇస్తే ఎలా వుంటుందనే దిశగా కూడా చర్చ జరిగిందని తెలిసింది. ఈ క్రమంలోనే ఎం.పి అల్లుడు, టిడిపి

ప్రచారంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న శ్రీధర్‌రెడ్డి పేరు పరిశీలనకు వచ్చిందని సమాచారం. ఎన్.ఎం.డి.ఫరూఖ్‌కు శాసనమండలి చైర్మన్ పదవి కూడా ఈభేటీలో చర్చకు వచ్చిందని చెబుతున్నారు . ఇంతవరకు జరిగిన ప్రచార సరళిపై కూడా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, ఆదినానారాయణరెడ్డి, కాల్వశ్రీనివాసులు వివరించారని తెలిసింది. మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ, కిమిడికళా వెంకట్రావు, డిప్యుటి సి.ఎంకృష్ణమూర్తి ఇతర ముఖ్యనేతులు కూడా ఈభేటీలో పాల్గొన్నారు.

ఆర్. కృష్ణయ్యకు కాపునాడు బహిరంగ లేఖ..

అమరావతి, ఆంధ్రప్రభ : కాపులకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని చెప్పడానికి రాజ్యాంగం మీకిచ్చిన అధికారం ఏమిటని ఆర్. కృష్ణయ్యను కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రహ్మణ్యంను ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆర్. కృష్ణయ్యకు ఆయన బహిరంగలేఖ రాశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, వైద్య పరంగా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగం చెప్తుందని, మధ్యలో మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటన్నారు. బిసీలతోనే కాక ఏ కులంతోను కాపులకు రక్షణ వాతావరణం లేదన్నారు. వెనుకబడిన కులాల ప్రతినిధిగా మిగిలిన కులాలలో పేదరికాన్ని చూడాలని, ఆయా కులాలు ఎదిగేందుకు ప్రయత్నించాలని సూచించారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వొద్దని మీరు చెప్తున్నారా.. లేక మీ వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారా లేదా స్పష్టం చేయాలని కోరారు. జీవో 30ను ఆపాలని కోర్టులో పిటిషన్ మీ చేత వేయించింది పాలకవర్గం కాదా.. వారు చెప్పినట్లు మీరెందుకు ఆడుతున్నారన్నారు. తెలుగుదేశం ముసుగుతీసి, పదవికి రాజీనామా చేసి నిజమైన వెనుకబడిన కులాల నేతగా మాట్లాడాలన్నారు. గిరిజనులు రోగాల బారిన పడి చనిపోతుంటే మీరెందు స్పందించరన్నారు. చంద్రబాబు మాట్లాడవద్దన్నారా అని అన్నారు.

'కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వాలు'


అమరావతి, ఆంధ్రప్రభ : కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ స్వరూప రాణి విమర్శించారు. న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికై మున్సిప ల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రిలే దీక్షలు శనివారంతో 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విజయవాడలోని దీక్ష శిబిరంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై క్షక్ష కట్టిన ప్రభుత్వం 279 జీఓను అమలు చేయడం ద్వారా వారిని ఇంటికి సాగనంపే కుట్రలు చేస్తోందన్నారు. కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడిచేలా రాష్ట్రంలోని 80 మున్సిపాలిటీల్లో ఇంతవరకులేని దళారీ వ్యవస్థను ప్రవేశపెట్టడం సమంజసం కాదన్నారు. 2014 ఎన్నికల సమయంలో మహి ళలను లక్షాధికారులను చేస్తామని అధికారం చేజిక్కించుకున్న టీడీపీ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ వారిని బిక్షాధికారులను చేసే దిశగా చర్యలు చేపడుతోందని ఆరోపించారు. జీఓ నెంబరు 279, 159, 160 టెండ ర్స్ తక్షణమే రద్దు చేసి కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలని, అలాగే ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ సెమీస్కిల్డ్ జీతాలు చెల్లించాలన్నారు. విజయవాడ, విశాఖ నగ రాలకు 010 పద్దును వర్తింపజేయాలని, అలాగే సమాన పనికి సమాన వేతనం తక్షణమే ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రనేతలు కె.ఉమా మహేశ్వరరావు, ఎ.రంగనాయకులు, రమేష్, డేవిడ్, ఎన్.ఆర్.కోటేశ్వరరావు, కె.దుర్గారావు, పి.సాంబిరెడ్డి, మధు, సి.హెచ్.శ్రీను, వి.సీతమ్మ, దుర్గా, పలువురు మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఏపీ మాదిగ జేఏసీ ఆవిర్భావం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని మాదిగ, మాదిగ అనుబంధ కులాలకు చెందిన రాష్ట్రస్థాయి సంఘాలు కలిసి ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావం జరిగిందని ఏపీ మాదిగ జేఏసీ చైర్మన్ పొనుగోటి కృపాకర్ మాదిగ తెలిపారు. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేఖర్లతో మాట్లాడిన ఆయన త్వరలో ఈజేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 50 లక్షల మంది మాదిగ, మాదిగ ఉపకులాల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ బహుజన రాజకీయ దార్శనికత వెలుగులో ఏపీ మాదిగ జేఏసీ పురోగమిస్తుందని, ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్దీకరణ సాధన కోసం మాదిగలు, మాదిగ ఉపకులాల సంక్షేమం, సమగ్రాభివృద్ధికోసం ఈజేఏసీ కమిటీ పని చేస్తుందని స్పష్టంచేశారు. ఈజేఏసీ ఏరాజకీయ పార్టీకి అనుబంధం కాదని, సర్వ, స్వతంత్రంగా తన కార్యకలాపాలను నిర్మాణాత్మకంగా కొనసాగిస్తుందని ప్రకటించారు. ఈజేఏసీ కమిటీకి చీఫ్ కన్వినర్ గా తాతపుడి రవీంద్రనాథ్ ఠాగూర్, చీఫ్ అడ్వయిజర్ తెన్నేటి జయరాజు, కన్వినర్లు పలు సంఘాలకు చెందిన పేరిపోగు వెంకటేశ్వరావు, గురిందపల్లి చిట్టిబాబు, కొమ్మూరి కనకారావు, కొడూరి నారాయణరావు, పరిశపోగు శ్రీనివాసరావు, కలివెల ఎలిషాకుమార్, తాతపూడి జయపాల్, వనం నాగేశ్వరావు, కె.రామాంజనేయులు, కైతేపల్లి దాసు, గొర్రె లాజర్, మట్టా సాయివరప్రసాద్, కె.పి.నారాయణస్వామి, నల్లూరి రవికుమార్, మట్టా ప్రభాత్ కుమార్, గెడ్డం బాపిరాజు, మంగలపూడి నాగేశ్వరావు, కలపాల రవి, ఎల్.ఎస్.రావు తదితరులు ఉన్నారని తెలిపారు.

వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను సాగనంపుతున్న పీర్‌లెస్



అమరావతి, ఆంధ్రప్రభ : ఉద్యోగుల సంక్షేమ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పీర్‌లెస్ సంస్థ యాజమాన్యం విఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను ఇంటికి సాగనంపే కుట్రలు చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గపూర్ ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడు తూ విదేశీ సంస్థలకు గ్రీన్‌కార్పెట్ పరుస్తున్న ప్రభుత్వాలు దేశీయ కంపెనీల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నా యని ఆరోపించారు. 85 సంవత్సరాల నుంచి ఖాతాదారులకు సేవలందిస్తున్న పీర్‌లెస్ సంస్థపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఆర్‌బీఐ ఆంక్షలను సవాలు చేస్తూ ఒకవైపు పీర్‌లెస్ ఎంప్లాయీస్ యూనియన్ కలకత్తా హైకోర్టులో న్యా యం పోరాటం చేస్తుంటే, మరోవైపు సంస్థ యాజమాన్యాలు అక్రమంగా విఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. మార్చి 3వ తేదీన కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పులోనూ, గతంలో సుప్రీం ఇచ్చిన తీర్పులోను కంపెనీ ఉద్యోగులను తొలగించరాదని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. కానీ దీనిని పెడచెవిన పెట్టిన యాజమాన్యం 2000 సంవత్సరంలో విఆర్ఎస్ పేరుతో 70 శాతం ఉద్యోగులను ఇంటికి పంపిందన్నారు. మిగతా 30 శాతం రెయిబవుళ్లు కష్టపడి కంపెనీని కోట్ల రూపాయల లాభాల్లోకి తీసుకురాగా ఇప్పుడు వారిని కూడా సాగనంపే ప్రయత్నాలు చేస్తోందన్నారు. పీర్‌లెస్ యాజమాన్యం ప్రవేశపెట్టిన విఆర్ఎస్ పథకాన్ని నిరసిస్తూ ఉద్యోగులు దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు గపూర్ చెప్పారు.

పుట్టపర్తిలో జాతీయ వైద్య సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి కామినేని శ్రీనివాస్

హాజరైన కర్ణాటక, ఏపీ మంత్రులు

పుట్టపర్తి, కెఎన్ఎన్ : అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జాతీయ వైద్య సమ్మేళనం నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథులుగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖా మంత్రులు రమేష్, కామినేని శ్రీనివాసులతో పాటు హైదరాబాద్ కేర్ హస్పిటల్ డైరెక్టర్ సోమరాజు పాల్గొన్నారు. శనివారం ఉదయం ఈ సమ్మేళనాన్ని సాయి కుల్వంత్ సభా మందిరంలో మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ డైరెక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ సత్యసాయి వైద్యశాలలు మానవాళికి అందిస్తున్న అత్యంత ఖరీదైన ఉచిత వైద్య సేవలు ఎలా కొనసాగిస్తున్నారనే వాటిపై వివరించారు. సత్యసాయి జాతీయ సేవా సంస్థల అధ్యక్షుడు నిమీష్ పాండ్య మాట్లాడుతూ ఇక్కడి వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. మనమంతా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, ఈ ప్రాంతానికి విచ్చేయడం బాబా మనకు ఇచ్చిన గొప్ప అవకాశమన్నారు. ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందాలనే సత్సంకల్పంతో సత్యసాయి వైద్య శాలను ప్రారంభించారన్నారు. అనంతరం అత్యద్భుత ప్రతిభ కనబరిచిన వైద్యులకు సత్యసాయి ధన్వంతరి సేవా అవార్డులను మంత్రులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ప్రదానం చేశారు.

కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రమేష్ మాట్లాడుతూ సత్యసాయి మానవాళికి అందుస్తున్న విద్య, వైద్యం, తాగునీరు లాంటి సేవా కార్యక్రమాలు అద్భుతమన్నారు. బాబా చూపిన మార్గంలోనే ట్రస్టు కూడా పయనిస్తూ.. సేవా కార్యక్రమాలను వైద్యులు విస్తరిస్తున్నారన్నారు. తాను, ఆంధ్రప్రదేశ్ మంత్రి కామినేనితో కలిసి పని చేసి, రోగాల బారిన పడిన రోగులకు విముక్తి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని, అందుకు సత్యసాయి బాబా ఆశీస్సులు కూడా మా పై ఉండాలని ఆయన కోరారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు చేయలేని సేవలను భగవాన్ బాబా చేసి చూపించారన్నారు. బాబా అనుగ్రహంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నామన్నారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా.. అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కార్యక్రమంలో సత్యసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి వైట్ ఫీల్డ్ డైరెక్టర్ సుందరేషన్, సత్యసాయి సూపర్ స్పెషాల్టీ ప్రశాంతి నిలయం డైరెక్టర్ గురుమూర్తి, ట్రస్టు సభ్యులు ఆర్జే రత్నాకర్, ప్రసాద్ రావు, డా. మోహన్‌తో పాటు మొబైల్ ఆస్పత్రి డైరెక్టర్ నరసింహన్, డా. ఇందిరాప్రభ, డా. వసుందరాదేవి, డా. సునందాబాయ్, డా. నీలందేశాయ్, డా. వీ.మోహన్‌తో పాటు దాదాపు 1500 మంది వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. నేడు కూడా ఈ సమ్మేళనం ప్రశాంతి నిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో కొనసాగనుంది.

జమ్మికుంటలో ప్రతిదినం జాతీయ గీతాలాపన



జమ్మికుంట, కెఎన్ఎన్ : దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో మారుమూల పట్టణానికి చెందిన ఓ పోలీసు అధికారి మదిలో మెదిలిన ప్రతి రోజు జాతీయ గీతాలాపన కార్యక్రమం నేడు సోషల్ మీడియాతో పాటు ప్రజల్లో, అన్ని ప్రాంతాల్లో ఓ వైరల్‌గా మారి ఎక్కడ చూసిన ఈ జాతీయ గీతాలాపన చర్చాంశనీయమవుతుంది. రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మండల సీఐ పింగిళి ప్రశాంత్‌రెడ్డికి వచ్చిన ప్రతి రోజు జాతీయ గీతాలాపన విషయాన్ని పట్టణంలోని రాజకీయ, విద్యార్థి, అధికార, వ్యాపార వర్గాలతో చర్చించి, రెండు నెలల పాటు తనదైన శైలిలో విస్తృతంగా పట్టణం నలుమూలాల పర్యటించి తాను చేపట్టబోయే జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం నిర్వహణ వల్ల ప్రజల్లో దేశభక్తి పెరగడంతో పాటు కుల, మతాలకు అతీతంగా ప్రజలు సహజీవనం కొనసాగిస్తారని, యువత వక్ర మార్గాన్ని వీడి, దేశభక్తిని పెంపొందిం చుకోవడమే కాకుండా వ్యసనాల భారిన పడకుండా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుంటారన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తాను చేపట్టే ఈ కార్యక్రమాన్ని ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళిన సీఐ, ఉన్నతాధికారులతో కూడా తన భావాలను పంచుకుని, వారి ప్రోత్సాహంతో 15వ తేదీ పంద్రాగస్టు నుంచి పూజ్య బాపూజీ మహాత్మాగాంధీ సాక్షిగా పట్టణంలోని 16 కూడళ్ళలో మైకలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకరావడమే కాకుండా విజయవంతంగా కొనసాగిస్తున్నారు. జమ్మికుంటలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ జాతీయ గీతాలాపనకు ప్రజల నుంచి సైతం విశేష స్పందన లభిస్తుంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే జాతీయ గీతాలాపన 52 సెకండ్ల పాటు కొనసాగుతుండగా.. వాహనదారులు, ప్రజలు, చిరు వ్యాపారులు, కిరాణ, వర్తక వ్యాపారులతో పాటు రహదారులపై నడిచి వెళ్ళే ప్రతీ ఒక్కరూ ఎక్కడికక్కడే నిలిచి తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక మంచి ఆలోచన మదిలో మెదిలిందే తడువు దానికి రూపకల్పన చేసి, ప్రారంభించడమే కాకుండా విజయవంతంగా కొనసాగిస్తూ... జమ్మికుంట ప్రాంతాన్ని భారతదేశం మొత్తం గమనించేలా కృషి చేసిన సి.ఐ ప్రశాంత్‌రెడ్డిని రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్, జిల్లా పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డిలు అభినందిం చారు.

జాతీయ గీతం.. మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా: సీఐ ప్రశాంత్‌రెడ్డి

దేశంలో ఎక్కడా ఏం జరిగిన ప్రజలు పట్టించుకోని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఎవరికి వారు ఎక్కడ ఏం జరిగిన తమకేందుకులే అన్న రీతిలో వ్యవహారిస్తుండటం మూలంగా దేశభక్తి మరుగున పడిపోయే పరిస్థితి తలెత్తిందని, యువత భవిష్యత్‌ను గాలికి వదిలేసి వక్రమార్గాన పయనిస్తున్న ఘటనలు సర్వత్రా పునరావృతం కాకుండా ఉండేందుకే జమ్మికుంటలో ప్రతి రోజు జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించాలన్న తలంపు తన మదిలో మెదిలిందని, జాతీయ గీతం.. మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియాగా అందరు ఆలపిస్తే ప్రజల్లో మరుగున పడిపోతున్న దేశభక్తి బయటపడటమే కాకుండా తాను వేరు.. దేశం వేరు కాదన్న భావం కలుగుతుందన్నారు. ప్రతి నిత్యం యువత కార్య క్ర మంలో పాల్గొని, జాతీయగీతాన్ని ఆలపిస్తే చెడుపనులు చేయాలన్న తలంపు సైతం వారి మదిలో రాదని ఆయన అన్నారు.

రాజకీయాల్లో హుందాతనం పాటించండి: పొంగులేటి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఉగ్రవాదం, మతతత్వానికి వ్యతిరేకంగా గత పాతికేళ్లుగా నిర్వహిస్తున్న రాజీవ్ సద్భావన యాత్రలో ఈసారి మాదకద్రవ్యాలకు చోటు కల్పించారు. 26వ రాజీవ్ సద్భావన యాత్ర జ్యోతి శనివారం దేశ రాజధాని ఢిల్లీకి చేరుకోగా, పార్లమెంటు సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీపై బురదజల్లేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. బోఫోర్స్ కుంభకోణంలో రాజీవ్ తప్పేం లేదని కోర్టులు తీర్పులు ఇచ్చిన తర్వాత కూడా రాజకీయం చేయాలని చూడడం సరికాదని అన్నారు. బీజేపీ హుందాగా వ్యవహరిస్తే బావుంటుందని హితవు పలికారు. రాజీవ్ గాంధీ కృషిని దేశంలో ఎవరూ మర్చిపోలేరని పొంగులేటి వ్యాఖ్యానించారు.

ఎల్టీటీఈ ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణించిన నేపథ్యంలో ఆ మరుసటి ఏడాది నుంచి చేపట్టిన ఈ యాత్ర ఉగ్రవాదానికి, మతతత్వానికి వ్యతిరేకంగా జరుగుతోంది. ఈ ఏడాది దేశాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ అంశాన్ని కూడా చేర్చి, వాటికి వ్యతిరేకంగా తమిళనాడులోని శ్రీపెరంబదూరులో మొదలుపెట్టిన ఈ యాత్ర ఆంధ్రప్రదేశ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సాగి ఢిల్లీకి చేరుకుంది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కంటింజెంట్‌కి పొంగులేటి సుధాకర్ రెడ్డి ఛైర్మన్‌గాను, కర్ణాటక నేత ఎస్ఎస్ ప్రసాద్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. నేడు ఢిల్లీలోని వీరభూమికి జ్యోతిని చేర్చి పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సమక్షంలో ఉగ్రవాదానికి, మతతత్వానికి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించనున్నారు.

రైతులకు భరోసానిచ్చిన ఉద్యానవన

సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పో



ఎక్స్‌పోలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు మొక్కలను అందజేస్తున్న అధికారులు

● ప్రదర్శనకు విశేష ఆదరణ .. 2 లక్షల మందికి కనువిందు ● రైతులు, కొనుగోలుదారులు, అధికారులతో ముఖాముఖి సదస్సులు ● రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడలో నాలుగు రోజులపాటు జరిగిన సేంద్రీయ వ్యవసాయం, నర్సరీ ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభించింది. ఎక్స్‌పోను రెండు లక్షలమందికిపైగా సందర్శించగా, అందులో ఐదు వేలమంది విద్యార్థులు ఉండటం విశేషం. ఎక్స్‌పో రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రైతులు, ఉత్పత్తిదారులు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. పూలు, పండ్ల మొక్కలతోపాటు ఇరిగేషన్‌కు సంబంధించిన స్టాల్స్‌నుకూడా ప్రదర్శనలో ఉంచారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను, నర్సరీలోని పూలు, పండ్ల మొక్కలను కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు. సేంద్రియ ఉత్పత్తుల ద్వారా ప్రజల ఆరోగ్యం కాపాడంతోపాటు రైతులకు అధిక ఆదాయం చేకూర్చాలన్నదే ఎక్స్‌పో లక్ష్యంగా ఉద్యానవనశాఖ నాలుగు రోజుల కార్యక్రమం రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఎంపిక చేసిన 500 మంది రైతులకు అవగాహన కల్పించారు. సాధారణంగా రైతులు రిటైల్ మార్కెట్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు చేసి హోల్‌సేల్ మార్కెట్లో ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి ఉంది. అయితే సేంద్రీయ వ్యవసాయం రైతు పండించిన పంటకు తానే ధరను నిర్ణయించుకునే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయం చేస్తోన్న రైతులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలుచేసి మార్కెటింగ్ చేసే కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఉత్పత్తులకు భరోసా ఇచ్చినట్లయింది. రాష్ట్రంలో సుమారు 7 వేల మంది రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తుండగా, విజయవాడ ఎక్స్‌పో ద్వారా భవిష్యత్‌లో రాష్ట్రంలో మరింతమంది రైతులు ఈ వ్యవసాయం పట్ల మొగ్గుచూపే అవకాశం ఏర్పడింది. ప్రదర్శనలో 78 స్టాల్స్ సేంద్రియ ఉత్పత్తులే ఉండటం గమనార్హం. ఈ ప్రదర్శనలో సేంద్రియ ఉత్పత్తులైన పండ్లు, కూరగాయలతోపాటు అల్లం, మిర్చి, పసుపు తదితర పంటల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. వీటిని పండించడానికి కావల్సిన ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వ్యవసాయంపై రైతులకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించేందుకు 13 జిల్లాల్లోని 500 మంది రైతులకు 5 విడతలుగా వర్క్‌షాపు నిర్వహించి శిక్షణ ఇచ్చారు. అలాగే రాష్ట్రస్థాయిలో సేంద్రీయ వ్యవసాయంపై సమావేశం ఏర్పాటు చేయగా, 800 మంది రైతులు పాల్గొన్నారు. 5 అంతర్జాతీయ కంపెనీలతో రైతులు, విక్రయదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి తద్వారా రైతులు పండించిన పంటలకు అధిక ఆదాయం వచ్చే విధంగా ఎక్స్‌పో దోహదపడింది. ఐకోవా, సింఫెడ్ సంస్థలు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నాయి. హెక్టారు సాగుకు రైతుకు రూ.10 వేలతోపాటు మూడు సంవత్సరాల సర్టిఫికేషన్ కోసం ప్రభుత్వం మరో రూ.4,500 చెల్లిస్తుంది. సేంద్రీయ వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో భవిష్యత్‌లో రైతులు పెద్ద ఎత్తున ఈ వ్యవసాయం పట్ల మొగ్గు చూపవచ్చని భావిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పండ్లు, కూరగాయలు పండించే రైతులు కొనుగోలుదారులతో కూడా సమావేశంలో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి వారుభయుల మధ్య ఒప్పందాలను కుదుర్చుకునేందుకు ఎక్స్‌పో దోహదపడింది.

రాష్ట్రంలో ఇప్పటి వరకు తూర్పు గోదావరి జిల్లా కడియంలోనే నర్సరీలు ఉండగా, వాటిని రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేయాలని ఎక్స్‌పో సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించింది. నర్సరీ నిర్వాహకులకు ప్రధాన సమస్యగా మారిన మట్టికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సదస్సులో అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఉద్యానవ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పించడం జరిగింది. వారి ఉత్పత్తులను నేరుగా మార్కెట్లో విక్రయించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, నర్సరీ నిర్వాహకులకు మధ్య ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

నర్సరీ ఎక్స్‌పోను ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభించగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించి సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నుంచి అందించే ప్రోత్సహకాలను వివరించారు. రైతులకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా భరిస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

మొత్తంమీద నాలుగు రోజులపాటు జరిగిన ఈ ఎక్స్‌పోకు అనూహ్య స్పందన లభించడంతో ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవిచౌదరి, అధికారుల బృందం ఆనందం వ్యక్తం చేశారు.

పట్టు ఉంటేనే ఇంజనీరింగ్ పట్టా...!

జెఎన్‌టియుఎ, కెఎన్ఎన్ : నవ్యాలోచనతో ప్రపంచ పోకడలను తట్టుకునే సామర్థ్య నైపుణ్యాలలో పట్టు ఉంటేనే ఇంజినీరింగ్‌పట్టా. నైపుణ్యాలు కొరవడితే పట్టా ఉన్నా పనికిరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా పరిశ్రమల అవసరాలు విద్యార్థులకు తెలియక అవకాశాలు కోల్పోతున్నారు. ఏ కొద్ది సంస్థలకో పరిమితంగా నిలిచిన ఇంటర్న్ షిప్ ప్రస్తుతం ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేసి నైపుణ్యభారత్‌కోసం ఎఐసిటిఇ ఇంజినీరింగ్ పట్టా పొందాలంటే ఇటర్న్‌షిప్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

పరిశోధనకు, ఉపాధికి సంజీవిని వంటిది



పరిశోధనకు, ఉపాధికి ఇంటర్న్‌షిప్ సంజీవని వంటిదని ఆచార్య కె.ప్రహ్లాదరావు తెలిపారు. విజ్ఞాన ఆర్జనతోపాటు అనుభవ పూర్వకంగా కొత్తనైపుణ్యాలు ప్రమాణాలను మెరుగు పర్చుకోవచ్చు. రెండో సంవత్సరం నుండే ఇంటర్న్‌షిప్ చేయడానికి నాలుగు వారాలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి వేసవి సెలవుల్లోగాని, మూడవ సంవత్సరం లేదా నాల్గవ సంవత్సరం పూర్తి చేసుకోవచ్చు. ఇస్రోతో ఒప్పందంలో భాగంగా బిటెక్16మంది, ఎంటెక్ 16మందిని ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందారన్నారు. త్వరలో బిఎంఎల్ సంస్థతో ఒప్పందం చేసుకోనున్నారు.

ఆచార్య కె.ప్రహ్లాదరావు (ప్రిన్సిపాల్)

ప్రయోగాత్మక విద్యతో మెరుగైన ఫలితాలు



బోధన సిద్ధాంతపరంగా కాకుండా ప్రయోగాత్మకమైన విద్యతో మెరుగైన ఫలితాలు సాదించవచ్చు. ప్రత్యక్షంగా పరిశ్రమ నైపుణ్యాలను నేర్చుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను కూలంకుషంగా తెలుసుకోవచ్చునన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పరిశ్రమల దూరాన్ని తగ్గిస్తుందన్నారు.

ఆచార్య ఎ.ఆనందరావు (డిఎపి డైరెక్టర్)

ఇంజనీరింగ్ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేసిన ఏఐసీటీఈ

ఇంజినీరింగ్ కోర్సు నాలుగు సంవత్సరాలు ఎలాగోలా చదివేసి పట్టాచేతపట్టుకుందాం అనుకుంటే కొత్తగా ఈ ఇంటర్న్ షిప్ ఏమిటని గ్రీమీణ విద్యార్థులలో అనుమానం రావచ్చు. సంస్థల అవసరాలు, పనితీరు, క్రమశిక్షణను ఒంటబట్టిచేదే ఇంటర్న్‌షిప్.. పట్టా చేతికొచ్చాక విద్యార్థుల గుణగణాలు చూసి ఎంపిక చేసేవారికి మరికొన్నాళ్లు శిక్షణనిచ్చి ఆ తర్వాత వారు సంస్థకు పనికి వస్తారోలేదో అంచనా వేసి తీరిక, సమయం, ధనము వెచ్చించేందుకు సిద్ధంగా లేరు. ఇంటర్న్ షిప్ ద్వారా విద్యార్థులను అంచనా వేసి వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయనున్నాయి. మూడవ సంవత్సరం పూర్తవ్వగానే, నాల్గవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పూర్తి అయ్యాకగాని విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి ఏ సంస్థలు అవకాశాలను అనుసరించి నెలరోజుల నుంచి మూడు నెలల వరకు ఇంటర్న్‌షిప్ చేయవచ్చు. దీని ద్వారా సంస్థ లక్ష్యాలు, సంస్థలో ఉద్యోగిగా ఉండాలంటే విధివిధానాలు, సంస్థ అవసరాలు విద్యార్థికి అవగతమవుతాయి.


కొత్త ఆవిష్కరణలకు వేదిక :

ప్రాజెక్టుల వైపు పరుగులు పెట్టే యువ ఇంజినీర్లు ప్రస్తుతం ఇంటర్న్‌షిప్‌వైపు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇంటర్న్‌షిప్ పెయిడ్ ఇంటర్న్‌షిప్, సాధారణ ఇంటర్న్‌షిప్ అని రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది విద్యార్థులు సంస్థలో వున్న కాలానికి సంస్థలో వున్న సంస్థ గౌరవ వేతనం ఇచ్చి వారికి అవసరమైన విధంగా శిక్షణనిస్తుంది. ఇటువంటి ఇంటర్న్‌షిప్ దక్కించుకోవడం వల్ల విద్యార్థులకు అవకాశాలు దక్కుతాయి. సాధారణ ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా విద్యార్థులకు అవగాహన పె రుగుతుంది. అయితే దీని లక్ష్యాలు ఆలోచనలను పక్కదారి పట్టించకుండా విద్యార్థులు చాలా జాగ్రుతితో ఉండాలి. అదే విధంగా విద్యార్థులు కళాశాల దశలో కొత్త ఆలోచనలను పరిశ్రమలకు వివరించగలిగితే కొత్తకోణంలో ఆవిష్కరణలు జరిగే అవకాశం వుంది. ఇటువంటి అవకాశాలతో నూతన ఆవిష్కరణలకు రూపుదిద్దుకునేందకు అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

ఎఐసిటిఇ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని కళాశాలలో ఇంటర్న్‌షిప్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇందుకోసం ఇంటెల్ సాలాతో ఎఐసిటి అవగాహన ఒప్పందం చేసుకుంది. గతంలో ఐఐటి, ఐఐఐటి, ఎన్ఐటిలు స్వయం ప్రతిపత్తికలిగిన విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయం విద్యార్థులకే ఇంటర్న్‌షిప్ చేసేవారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ ప్రమాణాలను మెరుగు పరుస్తూ, భావితరాలకు యువ శాస్త్ర వేత్తలుగా నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.


అందరికీ అవకాశం ఇవ్వడం కష్టం



ఇంజనీరింగ్ చేసే ప్రతి విద్యార్థికి ఇంటర్న్‌షిప్ ఇవ్వడం కష్టం. పరిశ్రమల సంఖ్య తక్కువగా వుందని అందుకు తగ్గట్టుగా వసతి సదుపాయాలు, శిక్షణ నైపుణ్యాలు, నిపుణుల కొరత వేదిస్తోందన్నారు. ఎఐసిటిఇ తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా అందుకు తగ్గట్టుగా పరిశ్రమల రూపకల్పన తక్కువగా వుండటం ఆచరణలో సమస్యాత్మకంగా వుంటుందన్నారు.

ఆచార్య ఎం.విజయ్‌కుమార్ (అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్)

యువ నైపుణ్య భారతాభివృద్ధి



యువనైపుణ్య భారతాభివృద్ధిలో యువత పాత్ర అత్యంతకీలకమైంది. పరిశ్రమలు కొత్తనైపుణ్యాలను ఒంటబట్టించుకునేందుకు, ప్రమాణాలను మెరుగు పర్చుకునేందకు, ఉపాధి అవకాశాల కు ఇంటర్న్‌షిప్ ఉజ్వల భవిష్యత్తునిస్తుందన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి, సృజనాత్మకతను వెలికి తీసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చన్నారు.

ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు (ఐసిఎస్ డైరెక్టర్)

మహిళలకు 'రిజర్వేషన్ల'తో పనిలేదు

విద్య, ప్రోత్సాహం అందజేస్తే అన్నింటా విజయాలే - మహిళా ఏక్‌థాన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి

విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో : మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు అవసరం లేకుండానే ఎదిగే శక్తిసామర్థ్యాలు వున్నాయని, అయితే వారికి అవసరమైన విద్య, సామర్థ్య నిర్వహణ, ప్రోత్సాహం అందజేయాల్సివుంటుందని కేంద్ర మంత్రి సుజనా చౌదరి అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ఇప్పటికే ప్రవేశపెట్టామన్నారు. మహిళలకు సరైన ప్రోత్సాహం అందిస్తే రిజర్వేషన్ల అవసరం వుండకపోవచ్చునన్నారు. శనివారం గ్రీన్ పార్కు హోటల్‌లో మహిళా ఏక్‌థాన్ అనే కార్యక్రమాన్ని గర్ల్స్ ఇన్‌టెక్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, యువజన సర్వీసు శాఖ , యుఎస్ కాన్సులెట్ జనరల్, ఐబిఎం, వేవ్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సును కేంద్ర మంత్రి వై.ఎస్.చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా వారికి అవసరమైన చేయూతను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. లింగ వివక్షత అనేది ప్రపంచమంతటా వుందని, అయితే అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్‌లో అది కొంచెం తక్కువగానే వుందన్నారు. లింగ వివక్షను అధిగమిం చాలంటే మహిళలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని, తమ కాళ్లపై తాము నిలబడే ప్రయత్నం చేయాలన్నారు. పారి శ్రామికవేత్తలుగా ఎదగాలంటే కొంత రిస్కు తీసుకోకతప్పదన్నారు. తాను కూడా కొంత ఒత్తిడి ఎదుర్కొన్న తరువాతనే ఉత్తమ పారిశ్రామికవేత్తగా నిలిచానన్నారు. ప్రస్తుత పరిస్థితులు పారిశ్రామి కవేత్తలకు చాలా ప్రోత్సాహకంగా వున్నాయని, అయితే ఒక విజన్‌తో కార్యాచరణ రూపొందించుకోవాలని, విజన్ లేనిదే విజయం ఉండదని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా పారిశ్రా మికవేత్తలను ప్రోత్సహించడానికి స్టాండప్ ఇండియా అనే పథకం ద్వారా మహిళలకు తప్పనిసరిగా జాతీయ బ్యాంకులు రుణలిచ్చేలా నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు. విజయాలను సాధిం చడానికి విద్య ఒక్కటే మార్గమని, ఆ విద్య కూడా క్రమశిక్షణతో అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో విద్యా బోధనా పద్ధతుల్లో మార్పు రావాలన్నారు. ముఖ్యంగా బాలికల తల్లిదం డ్రులు వారి విద్యాభ్యాసం కోసం ఖర్చు చేసేందుకు ముందుకు రావడం లేదని, చదువు నిమిత్తం బయటకు పంపేందుకు పెద్దగా ఆసక్తి చూపడంలేదని, ఈ విషయంలో తల్లిదండ్రుల ధోరణి మారాలన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం కేంద్ర ప్రభు త్వం అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. అవకాశాలు అనేకం వున్నాయని, వాటిని అందుకోవడానికి యువత ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కంభంపాటి హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్, గర్ల్స్ ఇంటెక్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదివ్య, యుఎస్ కాన్సొలేట్ గాబ్రియల్, ధర్మపథ సీఈవో రాజశేఖర్ కందుకూరి, ఎఐసిటిఇ డైరెక్టర్ మన్‌ప్రీత్ సింగ్ మన్నా, సౌత్ ఏషియా యుఎస్ ఎంబసీ మెహనాజ్ అన్సారీ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూని వర్శిటీ వీసీ జి.నాగేశ్వరరావు, విశాఖపట్నం, విజయవాడ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఐటి విద్యార్థినులు పాల్గొన్నారు.



మహిళా ఏక్‌థాన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి

నంద్యాల ఎన్నికలు మాకు రెఫరెండం కాదు..

నంద్యాల ఉప ఎన్నికలను రెఫరెండంగా తీసుకోవల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి వై.ఎస్.చౌదరి అన్నారు. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వైసీపీ ఆరోప ణలు దొంగే దొంగ అన్నట్టు వుందన్నారు. ప్రతిపక్షం ఆరోపణలు చేయడం సహజమని, వాటిని ఎన్నికల కమిషన్ చూసుకుం టుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం పార్టీ పోటీ చేయడం ఆనవాయితీగా వస్తోందని, అయితే కొన్ని సమయాల్లో ఓటమి చెందవచ్చని, మరికొన్ని సమయాల్లో విజయం సాధించవచ్చునని కేంద్ర మంత్రి అభిప్రాయ పడ్డారు. తాము అధికారంలో వున్నా, ప్రతిపక్షంలోవున్నా తప్పకుండా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. అయితే ఆయా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నామని, అవసరాన్ని బట్టి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

కోల్‌కత సదస్సుకు వ్యవసాయ వర్సిటీ వీసీ

అమరావతి, ఆంధ్రప్రభ : పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలో శనివారం జరిగిన భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్ స్వర్ణోత్స వాల కార్యక్రమానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స లర్ డాక్టర్ వల్లభనేని దామోదర్‌నాయుడు హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. పశ్చిమ బెంగాల్ యూనివర్శిటీ ఆఫ్ ఎనిమల్, ఫిషరీస్ సైన్సెస్, కుష్డిరాం బోస్ సదాని, కలకత్తా వారి ఆధ్వర్యంలో భారత వ్యవసాయ ఉపకులపతుల సమావేశం, మేధోమదన సదస్సు జరిగింది. సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు సం బంధించి పలు అంశాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, నివారణోపాయాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పి.బిస్వాస్ తదితరులు పాల్గొని వివిధ అంశాలపై ఉపన్యసించారు.

అరచేతిలో నేర సమాచారం

సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టుకు మోక్షం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ''క్రైం - క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం (సీసీటీఎన్ఎస్)'' ప్రాజెక్టుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. దేశంలోని అన్ని పోలీసు స్టేషన్లను అనుసంధానం చేసే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు సోమవారం నుంచి పట్టాలెక్కనుంది. నేరాలను అదుపు చేయడంలో ఎంతో కీలకంగా మారనున్న ఈ ప్రాజెక్టును సోమవారం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'నేషనల్ డిజిటల్ పోలీస్ పోర్టల్' పేరుతో ప్రారంభించే ఈ ప్రాజెక్టులో దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లు అనుసంధానమై ఉంటాయి. తద్వార నేర విచారణ, నేరస్థులను పట్టుకోవడం రియల్ టైంలో సాధ్యపడుతుందని కేంద్రం భావిస్తోంది. దేశంలోని మొత్తం 15,398 పోలీస్ స్టేషన్లకు గాను 13,775 పోలీస్ స్టేషన్లకు సంబంధించి 100 శాతం సమాచారాన్ని ఇప్పటికే నెట్‌వర్క్‌కు అనుసంధానం చేశారని తెలుస్తోంది. ఇప్పటి వరకు 1.36 కోట్ల ఎఫ్.ఐ.ఆర్‌ల సమాచారాన్ని పొందుపరిచారు. రూ. 2,000 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు డిజిటలైజేషన్ ప్రక్రియలో ఒక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం పోలీసులకు మాత్రమే కాదు, మెరుగైన పౌరసేవలు అందించడంలోనూ ఉపయోగపడనుంది.

లంక నిలిచేనా?

- ప్రపంచకప్‌కు నేరుగా వెళ్లేనా..! ● ఆతిథ్య జట్టుకు కఠిన పరీక్ష
- భారత్‌తో ఐదు వన్డేల సిరీస్ ● నేడు తొలి డేనైట్ మ్యాచ్

మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ సిక్స్, టెన్ 3 ఛానెళ్లలో


నిస్తేజం వీడి లేవండి.. లంక ఆటగాళ్లతో కోచ్ చమిందావాస్

భారత్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఘోర పరాభవం.. టెస్టు, టెస్టుకు దిగజారిన ప్రదర్శన... చివరి టెస్టులో మరీ దీన పరిస్థితి... కనీసం పూర్తిగా మూడు రోజులైనా ఆడలేని దుస్థితి. ఆటగాళ్లలో ఆత్మస్థైర్యం ఇసుమంతైనా కానరాని స్థితి. ఈ నేపథ్యంలో శ్రీలంక జట్టు మరో కఠిన పరీక్షకు సిద్ధమైంది. అప్రతిహత విజయాలతో ఉత్సాహం ఉరకలేస్తున్న కోహ్లిసేనతో వన్డే పోరుకు సన్నద్ధమైంది. ఆదివారం ఆరంభం కాబోయే ఐదు వన్డేల సిరీస్.. ఆతిథ్య జట్టు దృక్పథానికి, పట్టుదలకు పెను సవాలు. సిరీస్‌లో కనీసం రెండు విజయాలనైనా దక్కించుకోకుంటే 2019 ప్రపంచకప్‌లో నేరుగా అడుగుపెట్టే అవకాశాన్ని లంక చేజార్చుకున్నట్లే. లంక పుంజుకుంటుందా? వన్డే సిరీస్‌లోనైనా జోరందుకుని పోరును రసవత్తరంగా మారుస్తుందా? టెస్టుల్లో పేలవ ప్రదర్శనతో అభిమానుల ఆగ్రహానికి గురైన లంక.. స్ఫూర్తిదాయకమైన పోరుతో తిరిగి వారిని ఆకట్టుకుంటుందా?.. చూడాల్సిందే.

దంబుల్లా: జోరుమీదున్న విరాట్ కోహ్లిసేన బలహీన ప్రత్యర్థి లంకతో వన్డే సిరీస్‌కు సన్నద్ధమైంది. కుర్రాళ్లు సైతం ఊపుమీదున్నారు. ప్రత్యేకించి టెస్టుల్లో సెంచరీలతో చెలరేగిన ధావన్, మెరుపు సెంచరీతో కపిల్‌ను మరపించిన హార్దిక్ పాండ్య, లంకపై రికార్డు స్కోరు (264) సాధించిన వైస్‌కెప్టెన్ రోహిత్ శర్మ పరుగుల కోసం ఆవురావురమంటున్నారు. ఇక ఇక్కడే వన్డే అరంగేట్రం చేసి, ఎంతో ఎదిగి 9 ఏళ్ల తర్వాత సూపర్‌స్టార్‌గా తిరిగి వచ్చిన కెప్టెన్ కోహ్లి లంకపై రికార్డు సెంచరీ కోసం తహతహలాడుతున్నాడు. ప్రపంచకప్‌కు ముందు ఫిట్‌నెస్ మంత్రాన్ని పఠిస్తున్న భారత్.. ఈ సిరీస్‌లో యువకులను రొటేషన్ పద్ధతిలో పరీక్షించాలని భావిస్తోంది. టెస్టు సిరీస్‌లో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్న కేఎల్ రాహుల్‌ను నాలుగో స్థానంలో ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతను చివరి సారిగా జనవరిలో ఇంగ్లాండ్‌పై టీ20 సిరీస్‌లో ఆడాడు. భుజం గాయంతో ఛాంపియన్స్ ట్రోఫీ, తర్వాత వెస్టిండీస్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. గాయం కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన మనీష్ పాండే ఇటీవలే భారత్ ఏ జట్టులో దక్షిణాఫ్రికా పర్యటించి సత్తా చాటాడు. పరుగుల వరద పారించాడు. అతను కూడా ఇపుడు టాప్ ఆర్డర్‌లో చోటు కోసం వేచివున్నాడు. ముంబయి పేసర్ శార్దూల్ ఠాకుర్ తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. కుల్దీప్ యాదవ్, ఏ జట్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చచల్, ఎడమచేతి వాటం స్పిన్నర్ అక్షర్ పటేల్ ఏడాది విరామం తర్వాత జట్టులోకి వచ్చారు. రానున్న కొద్ది వారాలు ఈ యువకుల సత్తాకు పరీక్షే.

లంక దశ మారేనా?

గత 14 మాసాల్లో గాయాల కారణంగా కీలకమైన 14 మంది ఆటగాళ్లు లంక జట్టుకు దూరమయ్యారు. వారికి తగిన ప్రత్యామ్నాయాలు కూడా లంకకు దొరక్కపోవడం శాపమైంది. ఐతే చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై ఘన విజయం లంక ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలవాలి. 320 పరుగులకుపైగా లక్ష్యాన్ని లంక జట్టు అలవోకగా ఛేదించిన సంగతిని వారు ఈ సిరీస్‌లో గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ మ్యాచ్‌తో పాటు టెస్టు సిరీస్‌లో సెంచరీ సాధించిన కుశాల్ మెండిస్ వారికి ఆదర్శం కావాలి.

పిచ్: దంబుల్లాలోని పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ముందుగా బ్యాటింగ్ చేసే జట్టు 300కు పైగా స్కోరు సాధించడం సాధ్యమే. ఈ ఏడాది రెండు సార్లు 300కు పైగా స్కోర్లు నమోదయ్యాయి. మధ్యాహ్నం జల్లులు కురిసే సూచనలున్నాయి.

భారత్: (అంచనా) ధావన్, రోహిత్, కోహ్లి (కెప్టెన్), రాహుల్, ధోనీ (కీపర్), కేదార్ జాదవ్, పాండ్య, కుల్‌దీప్ యాదవ్, భువనేశ్వర్, యుజువేంద్ర చచల్, బుమ్రా.

లంక: గుణతిలకే, డిక్వెల్ (కీపర్), కుశాల్ మెండిస్, ఉపుల్ తరంగ (కెప్టెన్), మాథ్యూస్, కపుగెదెర, హసరంగ, థిసారా పెరీరా, విశ్వ ఫెర్నాండో, మలింగ, లక్షణ్ సందకన్

లంక రెండైనా గెలిస్తేనే..

ప్రస్తుతం 88 పాయింట్లతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో ఉన్న శ్రీలంక .. భారత్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో కనీసం రెండింట్లో గెలిస్తే నేరుగా 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది. రెండు మ్యాచ్‌లు గెలుచుకుంటే లంక పాయింట్లు 90కి చేరుకుంటాయి. ప్రస్తుతం విండీస్ 78 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. ప్రపంచకప్‌లో నేరుగా ప్రవేశానికి తుది గడువు అయిన సెప్టెంబరు 30లోగా విండీస్.. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లపై ఆరు వన్డేల్లోనూ విజయం సాధించినా వారి పాయింట్లు 88కి మించవు. ఆతిథ్య జట్టు ఇంగ్లాండ్‌తో పాటు మరో 7 అగ్రశ్రేణి జట్లు నేరుగా ప్రపంపకప్‌కు వెళ్తాయి. ఒకవేళ లంక ఒక్క వన్డేలోనే గెలిచి.. విండీస్ కూడా ఒక వన్డేలో విజయం సాధిస్తే .. విండీస్ కొద్దిపాటి పాయింట్ల తేడాతో ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది.

లంక అన్ని వన్డేల్లోనూ ఓడినా.. కనీసం ఐర్లాండ్‌పై అయినా విండీస్ గెలవకుంటే కరీబియన్ జట్టుకు ప్రపంచకప్ దారులు మూసుకుపోయినట్లే. కానీ లంక ప్రస్తుత ఫామ్ దృష్ట్యా రెండు మ్యాచ్‌లలో గెలవడం అసాధ్యం కావచ్చు. ఇటీవలే వారు 11వ ర్యాంకు జింబాబ్వే చేతిలో 3-2 తేడాతో ఓడారు. సొంతగడ్డపై లంక 10 వన్డేల్లో 7 మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. విండీస్ ఫామ్ కూడా ఏమంత గొప్పగా లేదు. అదే లంకకు ఊరటనిచ్చే అంశం.



ఒకట్రెండు ఓడినా పట్టించుకోం: కోహ్లి

దంబుల్లా: భారత జట్టు లంకతో వన్డే సిరీస్‌ను 2019 ప్రపంచకప్ కోసం ప్రయోగాలకు వేదికగా ఉపయోగించదలచింది. ఈ సిరీస్ నుంచే యువకుల్ని పరీక్షించాలనుకుంటోంది. అందుకే ఐదు వన్డేల్లో ఒకట్రెండు మ్యాచ్‌లలో ఓడినా పట్టించుకోబోమని కెప్టెన్ విరాట్ కోహ్లి అంటున్నాడు. ''ప్రత్యర్థికి కాదు మాకే గడువు మించిపోతోంది. ఆటగాళ్లు తమ తమ పాత్రల్లో ఇమిడిపోవడానికి సమయం ఇవ్వాలి. ప్రపంచకప్ కోసం మాకు ఏం కావాలో వారికి అర్థం కావాలి. వారికి పాత్రలివ్వదలచుకున్నపుడు ప్రయోగాలు ఆరంభించాల్సిందే. ప్రతి మ్యాచ్ గెలవాలన్న ఆలోచనతోనే ఎపుడూ ప్రయత్నిస్తాం. కానీ ప్రయోగాలు చేసేప్పుడు కొన్ని మ్యాచ్‌లలో ఓడినా విమర్శలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి'' అని కోహ్లి అన్నాడు.



మలింగ @ 200

దంబుల్లా: శ్రీలంక ఏస్ పేసర్ లసిత్ మలింగ ఆదివారం 200వ వన్డే ఆడబోతున్నాడు. ఈ మ్యాచ్‌లో మరో రెండు వికెట్లు తీయగలిగితే వన్డేల్లో అతని వికెట్ల సంఖ్య 300కు చేరుకుంటుంది. మరో 9 రోజుల్లో 35వ పుట్టిన రోజు జరుపుకోనున్న మలింగ 28.39 సగటుతో 298 వికెట్లు తీశాడు. ఏడు సార్లు 5 వికెట్ల ప్రదర్శన చేశాడు.

సెమీస్‌లో ఓడిన సానియా

- బోపన్న ఇంటిముఖం



న్యూఢిల్లీ: సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాదీ సానియా మీర్జా సెమీఫైనల్లో వెనుదిరిగింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్ పోరులో సానియా, షువాయ్ పెంగ్ 4-6, 6-7 స్కోరుతో షీహ్‌సు వీ, మోనికా నికులెస్క్యూ చేతిలో ఓటమి చవిచూశారు. వీరి పోరు గంటా 33 నిమిషాల పాటు సాగింది. కాగా పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో రోహన్ బోపన్న, ఇవాన్ డాడిగ్ జోడీ 1-6, 7-6, 7-10 తేడాతో రెండో సీడ్ లుకాజ్ కుబట్, మార్సెలో మెలో చేతిలో ఓడింది. ఈ పోరు గంటా 36 నిమిషాల పాటు జరిగింది. బోపన్న జోడీ తొలి సెట్‌ను కోల్పోయినప్పటికీ పోరాట పటిమను ప్రదర్శించి రెండో సెట్‌ను వశం చేసుకుంది. కానీ చివరిదైన నిర్ణయాత్మక సెట్ పోరు టైబ్రేకర్‌కు దారితీసింది. ఈ సెట్‌ను బోపన్న, ఇవాన్ దక్కించుకోలేకపోయారు. మ్యాచ్‌లో ఓడారు. సింగిల్స్ రెండో రౌండ్లో రామ్‌కుమార్ రామనాథన్, డబుల్స్ విభాగంలో పేస్ తొలి రౌండ్లోనూ ఓడారు.

నాదల్ ఓటమి

సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్




సిన్సినాటి: స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్.. సిన్సినాటి మాస్టర్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఓటమి చవిచూశాడు. నాదల్ 2-6, 5-7 తేడాతో ఆస్ట్రియా ఆటగాడు నిక్ కిర్గోయిస్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

విండీస్ ఫాలోఆన్

- తొలి ఇన్నింగ్స్‌లో 168 ఆలౌట్

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి డేనైట్ టెస్టులో వెస్టిండీస్ ఫాలోఆన్‌లో పడింది. శనివారం మూడో రోజు ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకు ఆలౌట్ అయింది. బ్లాక్‌వుడ్ 79 పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు. అతనే టాప్ స్కోరర్. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆండర్సన్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. టీ విరామానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 514-8 స్కోరు చేసిన సంగతి తెలిసిందే.





ఎట్టకేలకు టైటాన్స్ గెలుపు

ఓడిన యు ముంబా

లక్నో: తెలుగు టైటాన్స్‌ను ప్రొ కబడ్డీ లీగ్‌లో ఎట్టకేలకు గెలుపు పలకరించింది. శనివారం ఇక్కడ జరిగిన అంతర్ జోనల్ పోరులో టైటాన్స్ 37-32 తేడాతో యు ముంబాను ఓడించింది. 8 మ్యాచ్‌ల తర్వాత తెలుగు జట్టుకిదే తొలి గెలుపు. సీజన్‌లో రెండో గెలుపు. టైటాన్స్ విజయంలో కెప్టెన్ రాహుల్ చౌదరి, సాంబిర్ శేఖర్ కీలక పాత్ర పోషించారు. రాహుల్ 13 ర్యాపిడ్ పాయింట్లు సాధించగా, శేఖర్ 8 టేకిల్ పాయింట్లు స్కోరు చేశాడు. ఆట ఆరంభంలోనే రాహుల్ రెండు పాయింట్లు తెచ్చాడు. తర్వాత ముంబా మెరుగైన ప్రదర్శన చేసింది. 4-2 ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ రాహుల్ కూతకెళ్లి మూడు పాయింట్లు తేవడంతో టైటాన్స్ 5-4 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. 9వ నిమిషంలో ముంబాను ఆలౌట్ చేసి టైటాన్స్ 12-7తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది.

తొలి అర్ధంలో రాహుల్ కూతకెళ్లి పాయింట్లు తెస్తూనే ఉన్నాడు. ముంబా తరఫున అనూప్ కుమార్ జట్టుకు ఆధిక్యం తేవడానికి ప్రయత్నించాడు. ఐనా తొలి సగం ముగిసేసరికి టైటాన్స్ 19-15 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధంలోనూ టైటాన్స్ ఆధిపత్యం చెలాయించింది. 27 వ నిమిషానికి టైటాన్స్ 9 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ముంబా తేరుకొని రెయిడ్స్, డిఫెన్స్‌లో స్కోరు చేసి 32వ నిమిషానికి పాయింట్లను 27-27తో సమం చేసింది. అప్పటికే టైటాన్ ఆటగాళ్లు అలసినట్లు కనిపించారు. కానీ రాహుల్, శేఖర్ కలిసి జట్టును తిరిగి ఆధిక్యంలోకి తెచ్చారు. చివర్లో ముంబాను ఆలౌట్ చేయడంతో టైటాన్స్ 37-32తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకుపోయి విజయం సాధించింది. ఇంతవరకు 10 గేమ్‌లాడిన టైటాన్స్ 2 గెలుపులు, 7 ఓటములు, ఓ డ్రాతో 17 పాయింట్లు తన ఖాతాలో వేసుకొని బి జోన్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో హర్యానా 36-29తో యోధాపై గెలిచింది.

హెచ్‌సీఏలో లోథా సిఫార్సుల్ని అమలు చేయడం లేదు



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో లోథా కమిటీ సిఫార్సుల్ని అమలు చేయడం లేదని మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ ఆరోపించాడు. సెలెక్టర్ల నియామకంలో హెచ్‌సీఏ లోథా కమిటీ సిఫార్సుల్ని పట్టించుకోలేదని విమర్శించాడు. ''లోథా కమిటీ సిఫార్సుల ప్రకారం కనీసం 25 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన వారినే సెలెక్టర్లుగా ఎంపిక చేయాలి'' అన్నాడు. ''సుప్రీంకోర్టు నియమించిన లోథా కమిటీ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్నారని అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లేందుకే ఈ ప్రెస్‌మీట్'' అని అజహర్ చెప్పాడు. కాగా అజహర్ వ్యాఖ్యలను హెచ్‌సీఏ అధ్యక్షుడు జి.వివేకానంద్ ఖండిచారు.

దులీప్ ట్రోఫీకి బీసీసీఐ గుడ్‌బై!

న్యూఢిల్లీ: దులీప్ ట్రోఫీ రానున్న దేశవాళీ సీజన్‌లో టోర్నమెంట్ టోర్నీల షెడ్యూలులో చోటు కోల్పోయింది. దేశవాళీ సీజన్ అక్టోబరు 6న రంజీ ట్రోఫీతో ఆరంభమై 2018 మార్చి 18న 50 ఓవర్ల టోర్నమెంట్ దేవధర్ ట్రోఫీతో ముగుస్తుంది. ఈ రెండు టోర్నీలకు మధ్య గరిష్టంగా రెండు వారాల విరామం ఉంటుంది. ఐతే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేని దులీప్ ట్రోఫీ ... బీసీసీఐ దేశవాళీ కార్యక్రమాల తుది జాబితాలో చోటు సంపాదించలేకపోయింది. గత 56 ఏళ్లుగా ప్రధాన టోర్నీగా ఉన్న దులీప్ ట్రోఫీకి స్థానం కల్పించకుండానే దేశవాళీ క్యాలెండర్‌కు బోర్డు తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి ఆమోదించినట్లు తెలిసింది. దులీప్ ట్రోఫీలో గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా గులాబీ బంతిని ఉపయోగిస్తారని అమితాబ్ జులైలో చెప్పారు. ఈ ఫస్ట్‌క్లాస్ టోర్నీ క్రమేపీ బాగా మారుతూ వచ్చింది. గత కొన్నేళ్లుగా ఇండియా బ్లూ, ఇండియా గ్రీన్, ఇండియా రెడ్ పేరుతో ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు.



ఆ సమాచారం ఎందుకు దాచారు?

- ఎంవీ శ్రీధర్‌కు బీసీసీఐ రెండో నోటీసు!

న్యూఢిల్లీ: విరుద్ధ ప్రయోజనాల అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న బీసీసీఐ.. క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్, హైదరాబాద్ మాజీ కెప్టెన్ ఎంవీ శ్రీధర్‌కు ఒకటి రెండు రోజుల్లో రెండో నోటీసు పంపనున్నట్లు తెలిసింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం వ్యవహారాల్లో తన పాత్ర గురించిన వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచాడని భావించిన బీసీసీఐ అతనికి ఇంతకుముందు నోటీసు పంపింది. దానికి శ్రీధర్ సమాధానం ఇచ్చినా తృప్తి పడని బోర్డు మరో నోటీసు పంపాలని నిర్ణయించింది. ఆరు క్లబ్‌లలో శ్రీధర్ ఐదింటికి అధ్యక్షుడిగా ఉన్నాడని బోర్డు వర్గాలు తెలిపాయి. విజయ్‌నగర్ సీసీ, సఫిల్‌గుడా సీసీ, కన్సల్ట్ కోల్ట్స్ సీసీ, నటరాజ్ సీసీ, సత్యం కోల్ట్స్‌లకు ఆయన అధ్యక్షుడని వివరించారు. డెక్కన్ కోల్ట్స్ సీసీకి శ్రీధర్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడని కూడా చెప్పాడు. డెక్కన్, సత్యం క్లబ్‌ల చిరునామాలు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసమేనని వెల్లడించారు.

'బోపన్నకు సాకేత్ మైనేని తక్కువ కాదు'

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు రోహన్ బోపన్న కంటే సాకేత్ మైనేని తక్కువ అర్హుడేమీ కాదన కేంద్ర క్రీడల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ స్పష్టంచేశారు. బోపన్న పేరును ఆ అవార్డుకు భారత టెన్నిస్ సంఘం సిఫార్సు చేయకపోవడంపై వచ్చిన వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. ''ఇంచియాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో సాకేత్ సాధించిన స్వర్ణ, రజత పతకాలకు నా విజయాలకంటే ఎక్కువ విలువనిచ్చారు'' అని ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీ విజేత బోపన్న విమర్శించాడు.



భారత్‌ను ఓడించడం ఆసీస్‌కు సులువు కాదు

కోల్‌కత: పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ లేకుండా భారత్‌ను ఓడించడం ఆస్ట్రేలియాకు సులువు కాదని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. స్టార్క్ లేకపోవడం కోహ్లి సేనకు కలిసి వస్తుందా అన్న ప్రశ్నకు.. ''భారత్‌ను ఓడించడం ఆసీస్‌కు అంత తేలిక కాదు'' అన్నాడు. ఆదివారం ఆరంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌లో లంకేయులకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందన్నాడు. ''భారత్ చేతిలో లంకకు మరో పరాభవం తప్పదు'' అని గంగూలీ చెప్పాడు. భారత్, ఆసీస్ సెప్టెంబరు 21న ఈడెన్‌గార్డెన్స్‌లో తలపడతాయి.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

తాప్సీ

హీరోయిన్లకు ఆటంకాలెన్నో!



తన పేరు ప్రపంచానికి సుపరిచితం కావాలని ఎవరికుండదు. తాప్సీ ఈ గుర్తింపే కోరుకుంది. మోడల్ గా తీరిక లేకుండా కొనసాగుతున్న తాప్సీ... సెలబ్రిటీ హోదా కోసం చిత్ర రంగంవైపు ఆసక్తి చూపించింది. 'ఝుమ్మంది నాదం' సినిమాతో అనుకున్నది సాధించింది. రంగుల ప్రపంచపు తారగా మారిపోయింది. ఈ సాధించడం అనేది ఒక్క మాటలో చెప్పినంత సులువైంది కాదు. అందరిలాగే తాప్సీ కల నెరవేరడం వెనుక ప్రతి మెట్టులో శ్రమే దాగి ఉంటుంది. నాయికగా ఒక స్థాయికి చేరాక...ఇక నటిగా తానెలా ప్రయాణం సాగించాలో తెలుసుకున్నానంటోంది. తను నటించే ప్రతి చిత్రంలో ఏదో కొత్తదనం ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో కలిగించడమే తన లక్ష్యమంటోందీ ఢిల్లీ భామ. 'ఆంధ్రప్రభ లైఫ్'తో ఇలాంటి మరిన్ని విషయాలు చెబుతూ తాప్సీ మనసు విప్పి మాట్లాడింది...

నా జీవితంలో ఒక దశ ముగిసింది...

నాయికగా ప్రయాణం ప్రారంభమయ్యాక....వచ్చిన అవకాశాలు చేసుకుంటూ వెళ్లాను. వాటిలో అగ్ర కథానాయకుల సరసన నటించాను. వాళ్ల సినిమాల్లో మామూలుగా వాణిజ్య అంశాలుంటాయి. వాటికి తగినట్లే మేము ఆడిపాడాల్సి వచ్చింది. ఎంపిక చేసుకునే అవకాశం అప్పుడు లేదు. నటిగా జీవితం ప్రారంభమైన దశలో మనం కోరుకునే సందర్భాలు ఉండవు. వచ్చినవి ఒప్పుకోవాల్సిందే. చేస్తున్న సినిమాలను నేను ఆస్వాదించలేకపోయాను. అవి ప్రేక్షకులకూ నచ్చలేదు. అలా మూడేళ్లు గడిచిపోయాయి. తెలుగు, తమిళం, మలయాళంలో నటిస్తూ వచ్చాను. నా జీవితంలో అదొక దశ. అది పూర్తయి పోయింది. ఇప్పుడు నాకు నటిగా ఎలా ఉండాలనే స్పష్టత వచ్చింది.

ఇక్కడ అవకాశాలు లేకే...

బాలీవుడ్‌కి వెళ్లడాన్ని మరో మెట్టు ఎక్కడంగా భావిస్తుంటారు. నిజానికి తెలుగులో నాకు చిత్రాలు లేక అక్కడికి వెళ్లాను. నా తెలుగు సినిమాలు వరుసగా అపజయం పాలయ్యాయి. ఇదే సమయంలో తమిళం, హిందీ చిత్రాలకు అడిగారు. వాటిలో అక్షయ్ కుమార్ సరసన నటించిన 'బేబీ' విజయవంతం కావడంతో...హిందీలో పేరొచ్చింది. నా దృష్టిలో ఈ తేడాలు చూడను. బాలీవుడ్‌కి వెళ్లడాన్ని ఎదుగుదల అనుకోను. సినిమా ప్రేక్షకులకు చేరువయ్యే విధానంలో బాలీవుడ్ పెద్దది. అయితే తెలుగు సినిమాలు అత్యధిక విజయాలు సాధిస్తున్నాయి. ఈ ఏడాది చాలా తెలుగు సినిమాలు మంచి వసూళ్లు తెచ్చుకున్నాయి. బాలీవుడ్‌లో అపజయాలు పెరిగాయి.

మాకున్న ప్రతిబంధకాలు ఎన్నో...

ప్రతి వృత్తిలో బాధలుంటాయి. జీవితం ఎవరిపట్లా సానుకూలం గా ఉండదు. నాయికలుగా మాకు రోజూ ఇబ్బందులు ఎదురవుతుం టాయి. ప్రతికూల పరిస్థితులు వస్తుంటాయి. అవన్నీ ధైర్యంగా దాటుకుంటూ నటిస్తున్నాం. స్టార్ హీరోలతో నటించినన్ని రోజులు స్టార్ హీరోయిన్ అంటారు. స్టార్‌తో నటిస్తేనే స్టార్ హీరోయిన్ అవుతుందా. ఓ కథను నడిపిం చగల నటి ఎవరైనా స్టార్ హీరోయినే. ఆ నాయికలకు ప్రేక్షకు ల్లో, పరిశ్రమలో ప్రత్యేకమైన గుర్తింపు వస్తుంది. ఇటీవలఓ మూడు నాయిక ప్రధాన సినిమాల కోసం సంప్రదించారు. వాటికి సరైన ప్రణాళిక లేదు. అందుకే ఆ చిత్రాలను అంగీకరిం చలేదు. సినిమాలో నాకే పేరు రావాలని నేను ఆరాటపడను.

రెండున్నర గంటలు అన్నీ మర్చిపోవాలి..

నేను కమర్షియల్, గ్లామర్ సినిమాలకు వ్యతిరేకం కాదు. నటిగా అన్ని తరహా పాత్రలు చేస్తూ సమతూకం పాటించాలనుకుంటున్నాను. అది ఏ తరహా కథైనా థియేటర్లో రెండున్నర గంటలు కూర్చోబెట్టేలా ఉండాలి. నేను అలాంటి సినిమాలు చూడటానికి ఇష్టపడతాను. అలాగే అలాంటి కథలు చేయడానికి ప్రాధాన్యమిస్తాను. సినిమాల్లో పెద్దా చిన్నా తేడాలు చూడను. ప్రతి రోజూ నటించేప్పుడు సంతోషంగా ఉన్నానా లేదా అన్నదే ఆలోచిస్తాను. స్టార్ హీరోయిన్ అవ్వాలని, అగ్ర తారగా వెలగాలని, ఎక్కువ పారితోషకం తీసుకుంటున్న నాయిక కావాలని కోరుకోవడం లేదు. నేను ఎంపిక చేసుకున్న ఒక్కో చిత్రం విజయవంతం అవడం నాకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ నమ్మకంతోనే కొత్త కథలు ఎంచుకుంటున్నా..



ప్రేక్షకుల అభిరుచి మారిపోయింది..

చాలా భిన్నమైన కథలను తెరపై చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఒక సినిమా కోసం థియేటర్‌కు వెళ్లాలంటే ఎంతో ఆలోచిస్తున్నారు. అందుకు తగినట్లే మేమూ మారాల్సిఉంది. సాహసవంతమైన చిత్రాలు చేయాల్సిఉంది. మిగతా నాయికలు ఏమనుకుం టున్నారో తెలియదు గానీ...ఈ మార్పునకు తగినట్లు సినిమాలు ఎంచుకోవాలని నేను భావిస్తున్నాను. నా పేరు చూసి నమ్మకంగా ప్రేక్షకులు సినిమాకు వెళ్లాలి.

సామాజిక బాధ్యత విస్మరించను...

నటిగా నాకున్న సామాజిక బాధ్యతను గుర్తుంచుకుంటాను. ప్రతి సినిమా సందేశాత్మకమైనది చేయకున్నా...ఏడాదికి ఒకటైనా చేయాలని ఉంది. తారలు సమాజంపై చాలా ప్రభావం చూపించగలరు. మంచి చిత్రాలను చేస్తే... చాలా మందిని మార్చగలరు. పింక్ సినిమా చేశాక ఆడపిల్లలు నా దగ్గరకు వచ్చి మాకు మీ ఆటోగ్రాఫులు, ఫొటోలు వద్దు....కానీఇలాంటి సినిమా చేసినందుకు థ్యాంక్స్ అని చెప్పారు. ఎందరో స్టార్లతో కలిసి నటించాను. ఎప్పుడూ ప్రేక్షకులు కృతజ్ఞతలు చెప్పలేదు. పింక్ సినిమాకు ఇలాంటి అనుభవం కలిగింది.

పెళ్లయ్యాక నటిస్తాను...

ఏదో ఒక సందర్భంలో నటించడం మానేసి వ్యక్తిగత జీవితంలోకి వెళ్లిపోవాలని గతంలో అనుకునేదాన్ని. ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చుకున్నాను. బాలీవుడ్‌లో ఎంతోమంది నాయికలు పెళ్లయి, పిల్లలు పుట్టాక కూడా నటిస్తున్నారు. అవకాశాలు వస్తున్నంత వరకు, నటనను ఆస్వాదిస్తున్నంత వరకు తెరపై కొనసాగుతాను. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదు.

రాఘవేంద్రరావును కించపర్చలేదు..

కొన్ని సందర్భాల్లో మనం మాట్లాడిన మాటలు ఇతరులకు మరోలా అర్థమవుతాయి. పూలు, పండ్లు వేసి పాటల రూపకల్పన చేయడంపై నా వ్యాఖ్యలు కూడా తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను నవ్వుతూ మాట్లాడిన మాటల్లో పెడర్థాలు తీశారు. చాలా మంది పాత్రికేయులు కూడా మీరు మాట్లాడిన దాంట్లో తప్పేముంది అన్నారు. అయినా కొందరి సంతృప్తి కోసం క్షమాపణలు చెప్పాను. ఇప్పుడు సంతోషంగా ఉందా... అని అనుకున్నాను.

- రమేష్ గోపిశెట్టి

తాప్సీ బాలీవుడ్‌లో 'బేబీ', 'పింక్' చిత్రాలతో పేరు తెచ్చుకుంది. ఇవి సీరియస్ గా సాగే యాక్షన్ సినిమాలు. వీటి ప్రభావంతో తాప్సీకి ఫైటింగ్ చిత్రాల అవకాశాలే ఎక్కువగా వస్తున్నాయి. ప్రస్తుతం తాప్సీ చేస్తున్న 'నామ్ షబానా' అలాంటి యాక్షన్ చిత్రమే. ఇంతకాలం తాను చేసిన చిత్రాలతో బాగా యాక్షన్ నేర్చుకున్న తాప్సీ...ఆ అనుభవాలను 'నామ్ షబానా' లో చూపించింది. ఈ చిత్రంలో ఫైటింగ్ సన్నివేశాలను తానే సొంతంగా రూపకల్పన చేసుకుంది. ప్రస్తుతం తాప్సీ 'జుద్వా 2', 'తడ్కా' అనే రెండు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో 'జుద్వా 2'ను తాప్సీ ప్రత్యేకంగా భావిస్తోంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో నటిస్తుండటమే ఇందు కు కారణం. గతంలో అక్షయ్ కుమార్, అమితాబ్ లాంటి స్టార్లతో కలిసి నటించిన తాప్సీకి ఇదొక కొత్త అనుభవం. 'సల్మాన్ సినిమాలు చూస్తూ పెరిగాను అంటే మరోలా అనుకుంటారు గానీ. ఆయన సినిమాలను బాగా ఆస్వాదించేవాళ్లం. ఇప్పుడు ఆయనతో నటిస్తుంటే నమ్మలేకుండా ఉన్నాను. చిత్రీకరణ సమయంలో సల్మాన్ చెప్పే విషయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి.' అంది తాప్సీ..



ఆమె అన్యాయం చేసింది... మగవారికి న్యాయం దొరకదా?


మేడం...నాకు సంవత్సరం క్రితం వివాహం జరిగింది. ఒక మ్యాట్రిమోనియల్ సంస్థ ద్వారా ఈ సంబంధం వచ్చింది. ఆమెకు తండ్రి లేడు. తల్లిమాత్రమే ఉంది. మా అమ్మానాన్నలను బాగా చూసుకుంటే చాలనుకుని..ఎలాంటి కట్నకానుకలు ఆశించకుండా ఆమెను వివాహం చేసుకున్నాను. వాళ్లకంటే మాకే ఎక్కువ ఖర్చయింది. ఆమెకు ఇరవై తులాల బంగారం మేమే పెట్టాము. నాకు బెంగళూరులో ఉద్యోగం రావటంతో నేను తను అక్కడే ఉండేవాళ్లం. అయితే మేము సరిగ్గా నాలుగునెలలు కూడా కలిసిలేము. ఆమెనుండి తీవ్రమైన మోసాన్ని ఎదుర్కొన్నాను.
నేను ఆఫీస్ నుండి వచ్చేసరికి ఇంట్లో సిగరెట్ వాసన వచ్చేది. అయినా అడిగితే బాధపడుతుందని మౌనంగా ఉన్నాను. ఆమెను అనుమానించలేదు. మా పెళ్లయిన నాలుగునెలలకు ఇంట్లో దొంగతనం జరిగిందంటూ...ఆమె ఆఫీస్‌లో ఉన్న నాకు ఫోన్ చేసింది. బీరువాలో ఉన్న 50వేల రూపాయల డబ్బు, మేము తనకి పెట్టిన 20 తులాల బంగారం, నావి రెండు రింగులు, ఒక బ్రాస్‌లెట్ పోయాయి. మేము ఇద్దరం వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాము. తరువాత 'నాకు ఇక్కడ బాగోవటం లేదు' అని చెప్పి పుట్టింటికి వెళ్లింది. రెండునెలలయినా తిరిగి రాలేదు. ఈ లోపల పోలీసులు మా ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని కని పెట్టారు. అతను నా భార్యకు బాయ్‌ఫ్రెండ్. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయ్యాడు. అతనిమీద మోజుతో ఆమె డబ్బు బంగారం అతనికి ఇచ్చేసింది. పోలీసులు ఇద్దరినీ రిమాండ్‌కి పంపారు. నా భార్య... తరువాత తన పుట్టింటికి వెళ్లిపోయి...నా మీద, నా తల్లిదండ్రుల మీద...498(ఎ), డివిసి, మెయిన్‌టెనెన్స్...ఇలా తప్పుడు కేసులు ఫైల్ చేసింది. ఇదెక్కడి న్యాయం? నేను ఈ అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలో, న్యాయం కోసం ఎలా పోరాటం చేయాలో తెలుపగలరు?

-ఆర్. ప్రభాకర్

మీకు జరిగింది అన్యాయమే. ఆమెకు సిగరెట్ తాగే అలవాటు ఉంది. బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు. ఇంట్లో పని సరిగ్గా చేయదు. మీకు ఆమెపై అనుమానం వచ్చినా ఆమెని బాధపెట్టకూడదని భరించారు. ఇవన్నీ కాకుండా తన ఇంట్లోనే తన స్నేహితుడిచేత దొంగతనం చేయించింది... అంటే ఆమె ఎటువంటి మనిషో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి నమ్మకద్రోహం చేసిన మనిషితో జీవితం నరకమే. తప్పనేది మగవాళ్లు చేసినా, ఆడవాళ్లు చేసినా ఒకటే....వారికి శిక్షపడాల్సిందే. దొంగతనం కేసులో పోలీసులు అరెస్టు చేసినప్పుడు ఇద్దరూ తప్పు ఒప్పుకున్నారు కాబట్టి...తప్పకుండా శిక్షపడుతుంది. ఆ రోజు ఆమె, వాళ్లమ్మ మీ కాళ్లుపట్టుకుని బ్రతిమలాడి మ్యూచ్యువల్ డైవోర్స్ కి ఒప్పుకున్నపుడు



న్యాయ సలహా



మీరు ఏదైనా లిఖిత పూర్వకంగా రాయించుకోవలసింది. అలా చేసి ఉంటే ఆమె మీమీద రివర్స్ అయ్యి, తప్పుడు కేసులు పెట్టకుండా ఉండేది. ప్రస్తుతం ఆమె వేసిన కేసుల విషయానికి వస్తే...అటు పోలీసులకు కానీ, ఇటు డివిసి కోర్టుకి కానీ..నిజంగా ఏం జరిగిందనేది తెలియదు. ఆమె చెప్పింది విని కేసులు బుక్ చేశారు. మీరు వెళ్లి నిజం చెప్పాలి. అయితే ఆమె కౌన్సెలింగ్ లేకుండా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయించింది కాబట్టి....కోర్టులో, డివిసి కేసులో మీ సాక్ష్యం వచ్చే వరకు, లేదా ఆమెను మీ అడ్వకేట్ క్రాస్ ఎగ్జామిన్ చేసే వరకు నిజం కోర్టుకి తెలియదు. కాబట్టి మీరు కాస్త ధైర్యంగా ఉండాలి. మీరు చెప్పింది నిజం అయితే...మీ వద్ద సాక్ష్యం ఉంటే...ఆమె వేసిన కేసులకు కూడా కోర్టువారు ఆమెకు ఫైన్ వేసే అవకాశం ఉంది. కొంతమందయినా నిజాయితీగా ధైర్యంగా ఫైట్ చేస్తే...ఇలాంటి తప్పుడు కేసులు పెట్టేవారికి బుద్ధి వస్తుంది. అలాగే కోర్టువారు కూడా ఒక కేసుని బుక్ చేస్తున్నపుడు కొంతవరకు ఆలోచించాలని అర్థం చేసుకుంటారు. అలాగే మీకు పెళ్లి అయి ఒక సంవత్సరం పూర్తయితే మీరు అక్కడ విడాకులకోసం పిటీషన్ వేయండి. ఆమె ఆ కోర్టుకి రావలసి ఉంటుంది. లేదా సుప్రీం కోర్టునుండి కేసుని ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఆమె ఉండే స్టేట్‌కి వెళ్లడానికి మీకు ఎంత ఖర్చవుతుందో...ఆమెకూ అంతే ఖర్చవుతుంది. మీరు కాంప్రమైజ్ అయ్యి, ఆమెపై ఉన్న కేసులను విత్‌డ్రా చేసుకుంటారనే...నమ్మకంతోనే ఆమె మీపై కేసులు వేసింది. మీరు ధైర్యం కోల్పోవద్దు. మీ జీవితంలోకి వచ్చి... అన్ని తప్పులు తనే చేసి..తిరిగి తనే మిమ్మల్ని శిక్షించాలని చూసిన ఆమెపై మీరు ఫైట్ చేయాలి. అలా చేస్తేనే మీకు న్యాయం జరుగుతుంది. ఆమెకు బుద్ధి వస్తుంది. మీ అమ్మానాన్న కోర్టుల చుట్టూ తిరగకుండా...హైకోర్టులో క్వాష్ పిటీషన్‌ని ఫైల్ చేసుకోవచ్చు.



రమ్యకుమారి ఆకుల
ప్రముఖ న్యాయవాది
సెల్ : 88856 65733

ఒళ్లు...హరివిల్లవుతుంది!

శరీరంలో కదలికలను పెంచే శశాంక భుజంగాసనం

యోగాసనాల వలన శరీరంలోపలి కండరాలు, కీళ్లు...పట్టేయటం, బిగదీసుకుపోవటం లాంటి సమస్యలు ఉండవు. అందుకే యోగసాధన చేసేవారిలో ఒళ్లు హరివిల్లులా వంగుతుంది. శరీర కదలికలు సవ్యంగా ఉంటే...లోపలి అవయవాలు ఆరోగ్యంగా చురుగ్గా పనిచేస్తాయి కూడా. అలా శరీరంలోపల మృదుత్వాన్ని పెంచే...శశాంక భుజంగాసనం..నేటి యోగా టైమ్‌లో...

యోగా టైమ్

శశాంక భుజంగాసనం

ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. అలాగే కళ్లుమూసుకుని శ్వాసని గమనిస్తూ ప్రశాంతంగా ఉండాలి. శ్వాసని తీసుకుంటూ...రెండుచేతులను పైకెత్తాలి. ఈ సమయంలో శరీరాన్ని చేతులను వీలయినంతగా సాగదీయాలి. అరచేతులను ముందువైపుకి చూస్తున్నట్టుగా ఉంచి..శ్వాసని వదులుతూ ముందుకు వంగి...తలని, చేతులను నేలకు ఆనించాలి. పక్కనుండి చూస్తే శరీరం అర్ధచంద్రాకారంలో కనబడుతుంది. అందుకే దీనిని శశాంకాసనం అంటారు. అలా ఆ స్థితిలో 15 సెకన్లపాటు ఉన్న తరువాత...చేతులను అలాగే గట్టిగా నేలకు ఆన్చి ఉంచి..శరీరాన్ని మాత్రం ముందుకు సాగదీస్తూ వచ్చి తలను పైకెత్తాలి. ఇది భుజంగాసనం. మళ్లీ శ్వాసని వదులుతూ శశాంకాసనం లోకి రావాలి. ఇలా రెండు ఆసనాల్లోకి మారే ప్రక్రియని ఐదునుండి ఏడుసార్లు వరకు చేయాలి. ఇలా చేస్తున్నపుడు చేతులను వెనక్కు ముందుకు కదపకూడదు.







మోడల్ : వి.సౌమిని

ఉపయోగాలు

శశాంకాసనంతో వీపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. నిద్రబాగా పడుతుంది. వెన్నెముక కదలికలు మృదువుగా మారి...నొప్పులు, బిగుసుకుపోవటం లాంటి సమస్యలు తగ్గుతాయి. ఇందులో భుజంగాసనం కూడా ఉండటం వలన...శరీరం మరింత మృదువుగా మారి ఎటుకావాలంటే అటు వంగుతుంది. పొట్ట కండరాలు గట్టిపడతాయి. కిడ్నీలు, మూత్రపిండాల పనితీరు మెరుగవుతుంది.

గమనిక

అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు, డిస్క్ తొలగిన సమస్య ఉన్నవారు, అల్సర్, పొట్టకు సంబంధించిన అనారోగ్యాలు...ఇంకా ఇతర అనారోగ్యాలేమైనా ఉన్నా...ఈ ఆసనాన్ని సాధన చేయరాదు.



గాయత్రి
యోగా ట్రైనర్

అధ్యయనం...

పళ్లు కూరగాయలు తింటే...పరిమళాలపంటే!



ఆడవారిని ఆకర్షించే సువాసనల కోసం మగవారికి సరికొత్త సలహా

ఆడవారిని ఆకర్షించే పర్‌ఫ్యూమ్‌లుగా చెబుతూ... మగవారి కోసం చాలా రకాల పరిమళాలు మార్కెట్లో దొరుకు తున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన ఒక పరిశోధనలో వెల్లడైన విషయాలను తెలుసుకుంటే మాత్రం... అలాంటి పర్‌ఫ్యూమ్‌లు వాడటం ఆపేసి..పళ్లు కూరగాయలు తినటం మొదలుపెడతారు. సెంట్‌కి తిండికి సంబంధం ఏమిటి... అనుకుంటున్నారా...ఉందంటున్నారు ఆస్ట్రేలియా శాస్త్ర వేత్తలు. పళ్లు, కూరగాయలు ఎక్కువగా తినే మగవారి శరీరం నుండి వచ్చే వాసన..బ్రెడ్ పాస్తాలాంటివి తినే మగవారి శరీరం నుండి వచ్చే వాసన కంటే ఎక్కువగా మహిళలను ఆకర్షిస్తుం దని ఆ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక అధ్యయనంలో తేలిన ఈ విషయాలను వెల్లడిస్తూ... సాధారణంగా మన శరీరం నుండి వచ్చే చెమట వాసన మన ఆరోగ్య స్థితిని తెలుపుతుందని, అదే సహచరిని ఆకర్షించడం లో కీలక పాత్రని పోషించవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. భిన్నరంగుల్లో ఉన్న కూరగాయలు ఆకుకూరలు పళ్లు తీసుకున్నపుడు వాటిలోని ఎరుపు, పసుపు, ఆరంజ్ రంగులకు కారణమైన కెరొటినాయిడ్స్‌ని మన చర్మం తీసుకుంటుంది. ఈ కెరొటినాయిడ్స్ చర్మంలో స్థిరంగా ఉంటుంది. దీనిని స్పెక్ట్రోఫొటోమీటర్ ద్వారా కొలుస్తారు. అధ్యయనం కోసం పరిశోధకులు కొంతమంది యువకులను ఎంపిక చేశారు. వీరి చర్మంలో పళ్లు కూరగాయలు తినటం వలన చేరిన కెరొటినాయిడ్స్ ఎంత స్థాయిలో ఉన్నాయో స్పెక్ట్రోఫొటో మీటర్ ద్వారా అంచనా వేశారు. అలాగే వారి ఆహారపు అలవాట్లను కూడా తెలుసుకున్నారు. అనంతరం వారికి శుభ్రంగా ఉన్న టీషర్టులను ఇచ్చి వ్యాయామం చేయమని చెప్పారు. వారికి చెమట పట్టిన తరువాత... అధ్యయనం కోసం ఎంపిక చేసిన మహిళలను ఆ మగవారికి సమీపంలో నిలబడి వారి శరీరపు వాసనని గురించి చెప్పమని అడిగారు. అలా అధ్యయనంలో పాల్గొన్న మహిళలం దరూ... కూరగా యలు పళ్లు ఎక్కువగా తింటున్న మగవారి నుండి సువాసనలు వస్తున్నట్టుగా తెలియజేశారు. దీన్ని బట్టి...మగవారు తమలో ఆకర్షణని పెంచుకో వాలంటే... వందలు వేలు పెట్టి ప్రకటనల్లో ఊదరగొట్టే పెర్‌ఫ్యూమ్‌లను కొనేబదులు. .హాయిగా చవగ్గా దొరికే పళ్లు కూరగాయలను తింటే సరిపోతుందని అధ్యయన నిర్వాహకులు అంటున్నారు.



రామాయణ ఆవిర్భావం

బాలకాండం

ఒకనాడు వాల్మీకి మహర్షి నారదుని ఇలా ప్రశ్నించాడు. మహర్షీ! గుణవంతుడు, పరాక్రమశాలి, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్పాలకుడు, దృఢవ్రతుడు, సదాచారుడు, సర్వభూత హితాభిలాషి, విద్వాంసుడు, సర్వ సమర్థుడు, ప్రియ దర్శనుడు, ధైర్యశాలి, జితక్రోధుడు, తేజోవంతుడు, అసూయ లేనివాడు, సంగ్రామ రంగంలో మహాభయంకరుడు ఈ గుణాలన్నీ ఉన్నవాడు ఎవడైనా ఉన్నాడా! నారదుడు కొద్దిసేపు ఆలోచించి గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక్ష్వాకు వంశంలో దశరథునికి జన్మించిన రాముడు సకల గుణాభిరాముడు, చక్కని శరీర సౌష్ఠవ సంపన్నుడు, నీలమేఘశ్యాముడు అని వివరించి శ్రీరామ చరితాన్ని సంగ్రహంగా తెలిపాడు.

సంక్షిప్త రామాయణం

ఆది కవి వాల్మీకి కలం నుంచి జాలువారిన మహాఇతిహాసం రామాయణం. తరతరాలుగా ఎన్నో రామాయణాలు వచ్చాయి. వివిధ భాషల్లో వచ్చాయి. వాటిలో కొన్నిటిలో కొత్త కొత్త విశేషాలు జోడించి చేసిన రచనలు ఉన్నాయి. అయితే అసలైన రామాయణం వాల్మీకి రామాయణమే. అందులో ఉన్న కథలు, లేని కథలు ప్రచారంలో ఉన్నాయి. వాల్మీకి రామాయణానికి అనుసరణగా సంక్షిప్తంగా చేసిన ఒక రచన ఈ సంక్షిప్త రామాయణం.

ఒకనాడు వాల్మీకి మహర్షి నారదుని ఇలా ప్రశ్నించాడు. మహర్షీ! గుణవంతుడు, పరాక్రమశాలి, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్పాలకుడు, దృఢవ్రతుడు, సదాచారుడు, సర్వభూత హితాభిలాషి, విద్వాంసుడు, సర్వసమర్థుడు, ప్రియ దర్శనుడు, ధైర్యశాలి, జితక్రోధుడు, తేజోవంతుడు, అసూయ లేనివాడు, సంగ్రామ రంగంలో మహాభయంకరుడు ఈ గుణా లన్నీ ఉన్నవాడు ఎవడైనా ఉన్నాడా! నారదుడు కొద్దిసేపు ఆలోచించి గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక్ష్వాకు వంశంలో దశరథునికి జన్మించిన రాముడు సకల గుణాభిరాముడు, చక్కని శరీర సౌష్ఠవ సంపన్నుడు, నీలమేఘశ్యాముడు అని వివరించి శ్రీరామచరితాన్ని సంగ్ర హంగా తెలిపాడు.

వాల్మీకి సంతోషించి విధ్యుక్తంగా నారదుని పూజించాడు. వాల్మీకి సత్కారాన్ని స్వీకరించి నారదుడు వెళ్ళాడు. ఒకరోజు వాల్మీకి స్నానార్థమై శిష్యుడు భరద్వాజునితో తమసా నదికి వెళ్ళాడు. పరస్పరం అనురాగంతో మధురంగా రవళిస్తున్న క్రౌంచ పక్షుల జంట అతని కంటపడింది. మైమరచి క్రీడిస్తున్న ఆ పక్షుల జంటను వాల్మీకి ఆర్ద్రమనస్కుడై తిలకిస్తున్నాడు. హఠాత్తుగా ఒక కిరాతుడు బాణంతో మగపక్షిని కొట్టాడు. అది నేల కూలి గిలగిల కొట్టుకుంటోంది. అంతవరకూ తన్మయమైన ఆడపక్షి చూసి విల విలలాడిపోయింది. భర్త ఎడబాటును సహించలేక ఏడువ సాగింది. కరుణ రస పూరితమైన ఆ దృశ్యాన్ని వాల్మీకి చూసాడు. వెంటనే అతని కవి హృదయం ద్రవిం చింది. కరుణ రసం పొంగి పొరలింది. దైవవశాన అప్రయత్నంగా వాల్మీకి నోటి నుంచి ఒక శ్లోకం జాలు వారింది.

మానిషాద ప్రతిష్ఠాంత్వమగమః శాశ్వతీః సమాః
యత్ క్రౌంచ మిథునాదేకమ్ అవధీః కామ మోహితమ్

శోకం నుంచి వెలువడిన శ్లోకాన్ని వాల్మీకి పునశ్చరణ చేసుకున్నాడు. నాలుగు పాదాలుగా ఉంది. అన్ని పాదాలలో అక్షరాల సంఖ్య సమానంగా ఉంది. లయబద్ధమై గానానుకూలంగా ఉంది. వీనుల విందు కలిగిస్తోంది. సందేహం లేదు. ఇది ఛందోబద్ధమైన శ్లోకమే! అని వాల్మీకి శిష్యునితో అన్నాడు. భరద్వాజుడు ఆ శ్లోకాన్ని మననం చేసి, ధారణ చేశాడు. వాల్మీకి శ్లోకం అర్థవిశేషాలనే స్మరి స్తూ ఆశ్రమం చేరుకున్నాడు. యథాప్ర కారం పుణ్యకథ లను తెలుపుతూ, పురా ణ పారాయణాది కార్యక్రమాలను నిర్వర్తించాడు.

బ్రహ్మదేవుడు వాల్మీకి ముందు ప్రత్యక్ష మయ్యాడు. వాల్మీకి వినయ సంభ్రముడై శాస్త్రోక్తంగా బ్రహ్మను పూజించాడు. అర్ఘ్యపాద్యాదులనర్పించి స్తుతించాడు. బ్రహ్మ ఎదురుగా ఉన్నా వాల్మీకి హృదయంలో ఆ కరుణా రసపూరిత దృశ్యమే మెదలుతూ ఉంది. ఆడపక్షి దీనావస్థను తలచుకుని చింతిస్తున్నాడు. బ్రహ్మ వాల్మీకి మనోగతాన్ని గ్రహించి చిరునవ్వు నవ్వాడు. 'నీనోట వెలువడింది ఛందోబద్ధమైన శ్లోకమే. నేనే నీ నోట దానిని పలికించాను. ఈ ఛంద స్సులోనే నీవు శ్రీరామ చరితం సంపూర్ణంగా రచించాలి. నారదుడు సంక్షిప్తంగా తెలిపిన రామచరితాన్ని సమగ్రంగా రచించు. శ్రీరాముని జీవితంలో తారసిల్లిన అన్ని సంఘటనలు, ఆయా పాత్రల స్వభావాలు, అంతరంగాలు నా అనుగ్రహం వల్ల నీకు స్ఫురిస్తాయి. రహస్య విషయాలన్నీ వాటంతట అవే నీ మదిలో మెదలు తాయి. నీవు పలికింది అంతా సత్యమే అవుతుంది.

సర్వ పాప వినాశకరమైన రామ కథ ఆచంద్ర తారార్కం కీర్తించబడుతుంది. నీ కీర్తి ప్రతిష్ఠలు ముల్లోకాల్లో వ్యాపి స్తాయి' అని పలికి అంతర్ధానమయ్యాడు. గురు శిష్యులు ఆశ్చర్యచకితులై ఆనంద సాగరంలో ఓలలాడారు. శిష్యులందరూ ఆ శ్లోకాన్ని మృదు మధురంగా, శ్రావ్యంగా మరల మరల గానం చేశారు. శ్లోకా మృత రసాస్వాదన చేసి వాల్మీకి శిష్యులు తన్మయులై పరమానందం పొందారు. తర్వాత మృదు మధురములు, అమృత రసగుళికలు, పరమ పావనములు, పరమార్థ ప్రతిపాదకములు అయిన పదాలతో వాల్మీకి రామాయణాన్ని సహృదయ హృదయంగమంగా రచించాడు. వాల్మీకి రాసిన రామాయణం పరమ పురుషార్థ సాధకం. రామాయణాన్ని రాసి తాను తరించాడు. సంసార సాగ రాన్ని తరించడానికి ఇతరులకు మార్గం చూపాడు.


(తరువాయి భాగం వచ్చే ఆదివారం)

- కె.ఓబులేశు
9052847742

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

సర్వసమత్వం



శ్రీ రమణాశ్రమం

12-8-46

గడచిన వేసంగిలో భగవాన్ సాయంకాలం కూర్చోటానికి సౌకర్యంగా వుంటుందని హాలుకు వెలుపల పందిరి వేశారు. ఆ పందిరికి పడమటి వైపున వట్టివేళ్ల తడికలు కట్టి, తడికల నానుకొని భగవానులకు సోఫా వేసేవాళ్లు సాయంత్రం. ఆ సోఫాకు తూర్పుదిశగా పురుషులంతా కూర్చుంటే భగవాన్ దక్షిణాభిముఖులై దక్షిణామూర్తి వలె కూర్చుండేవారు. వారి పాదాల కెదురుగా మేమంతా కూర్చుండేవాళ్లం. మా దృష్టిసూటిగా వుంటే భగవత్పాదారవింద దర్శనం, పక్కకు తిరిగితే చక్కని పూదోట, పైకి తిప్పితే అరుణాచల శిఖర దర్శనం, మా భాగ్యం ఏమని చెప్పాలి!

ఒకనాటి సాయంత్రం నాలుగు ముప్పావుకు బయటికి వెళ్లిన భగవాన్ తిరిగి రాకముందే మబ్బుగా ఉండటం వల్ల వట్టివేళ్ల తడికలు పైకెత్తి కట్టారు సేవకులు. భగవాన్ వచ్చి కూర్చున్న పదినిమిషాలకే ఎండ తెరదీసినట్లు వచ్చింది. సాయంకాలపు టెండ అయినప్పటికీ వేసవి కావటం వల్ల అందరి పైన వేడి సోకి రవంత కష్టం కలిగించింది. పై బట్ట అయినా లేని భగవాన్ మీద ఆ ఎండ పడితే చూచి సహించలేక, సేవకులలో ఒకరైన వైకుంఠవాసి అనేవారు చల్లగా భగవాన్ వెనుక వున్న తడికలు దింపారు. భగవాన్ చూడలేదని వారి తలపు. వేదపారాయణ జరుగుతూ వుండటం వల్ల భగవాన్ చూడనట్లే ఊరుకున్నారు. పారాయణ ముగియటంతోటే అందుకున్నారిక చిరాకుతో ''చూడండి వీరి చేష్టలు. నా ప్రక్కనున్న తడికలు మాత్రం దింపారు. మిగతా వారంతా మనుష్యులు కారు కాబోలు. స్వామికి మాత్రం ఎండ తగలకూడదు. మిగతా వారందరికీ తగిలినా ఫరవాలేదు. స్వామికి మాత్రం ప్రత్యేకం. ఎట్లాగైతే నేమి స్వామిత్వం నిలబెడుతున్నారు. పాపం, ఇట్లాగుంటే గాని స్వామికాదు కాబోలు, ఎండ తాకగూడదు. గాలి సోకగూడదు, వెలుగు చూడగూడదు, కదలగూడదు, మెదలగూడదు. కాళ్ళు , చేతులు, ముడుచుకొని సోఫా మీద కూర్చోవాలి. ఇదీ స్వామిత్వం. దీనికేం లోపం వస్తుందోనని ఇందరిలో నన్ను ప్రత్యేకించి చూపిస్తూ స్వామిత్వం నిలబెడుతున్నారెట్లాగో'' నన్నారు భగవాన్. పాపమా సేవకులు బెదరి, యథాప్రకారం ఆ తడికలు ఎత్తివేశారు. సంజకెంజాయలు భగవాన్ పైన సోకి కనుల కెంపులో కలిసి పోయినవి. అగరువత్తుల ధూపం అన్నిదిశలను వ్యాపించి, చల్లని పిల్ల గాడ్పుతో సఖ్యం జేసుకొని, భగవాన్ పాదపద్మములకు ప్రణమిల్లి భక్తులందరకు వింజారమరలు విసిరింది.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

స్వర్గనరకాల్ని ధ్వంసం చేస్తేనే సత్యాన్వేషణ

సద్గురుబోధ

మీలోని స్వర్గనరకాల్ని మీరు ధ్వంసం చేస్తే తప్ప సత్యం వైపు ప్రయాణించలేరని సద్గురు అంటున్నారు. దీన్ని కోడిగుడ్డు పగలడంతో ఆయన పోలుస్తారు. అది పగిలినప్పుడు మీరు లోపలికి వెళ్లరు. కాని పూర్తిగా కొత్తదొకటి బయటికి వస్తుంది. మానవ సమాజాలపై నియంత్రణ సంపాదించడానికి ప్రపంచ వ్యాప్తంగా స్వర్గనరకాల వ్యాపారం జరుగుతూ ఉంది. ఒక వ్యక్తిని కాని, సమూహాన్ని కాని ఎలా నియంత్రించాలో తెలియనప్పుడు ''నేను మిమ్మల్నిక్కడ శిక్షించలేకపోతే, అక్కడ పట్టుకుంటాం. మీరిక్కడ చూపించే మంచితనానికి ఇక్కడ బహుమానం ఇవ్వలేకపోతే అక్కడ ఇస్తాం'' వంటి ఉపాయాలతో వస్తారు. మనం 'అసతోమా సద్గమయ' అన్నప్పుడు అసత్యం నుండి సత్యానికి ప్రయాణమని అర్థం. ఇది నిజంగా ప్రయాణం కాదు. 'ప్రయాణంబు' అంటే మనం నడవలసిన దూరం ఉందని అర్థం. ఇక్కడ అటువంటి దూరమేమీ లేదు. తెలుసుకోవడం అనేది దూరంగా ఎక్కడో లేదు. ఎందుకంటే మీరు తెలుసుకోవలసింది ఎక్కడో కొండమీద లేదు. అది మీలోనే ఉంది.

స్వర్గనరకాలు మీలోనే ఉన్నాయి

యోగా ముందు దాడిచేసేది స్వర్గనరకాల మీదే. మనిషి మెదడులో స్వర్గనరకాలున్నంత కాలమూ అంతరంగానికి సంబంధించిన సాంకేతికత, వ్యక్తి విముక్తి దిశగా నడిచే ప్రక్రియలు అర్థరహితమవుతాయి. ఎందుకంటే మిగిలేది మనం వెళ్లడానికి రెండు స్థలాలే- అయితే చెడ్డ స్థలమో, కాకపోతే మంచి స్థలమో, మీరు మంచి చోటుకు టికెట్టు కొనుక్కుంటే మీరెలా జీవిస్తున్నారన్న విషయం గురించి మీరు పట్టించుకోనవసరం లేదు. మానవులు ఎంత ఘోరంగా జీవించాలో అంత ఘోరంగానూ జీవించారు. ముఖ్యంగా ఇది మతం తోడ్పాటుతో. అసలు మీరేం చేస్తే ఏమిటి, మీరిది నమ్మండి చాలు. ఇది, ఇది, ఇది. స్వర్గానికి మీ టికెట్టు. ఇదిగో అని మతం చెప్పడం వల్లే. ప్రస్తుతం మీలో పనిచేస్తున్న ఈ స్వర్గ నరకాలను మీరు ధ్వంసం చేయకపోతే నిజంగా సత్యం వైపు ఎటువంటి ప్రయాణమూ ఉండదు. మీ మనఃశ్శరీరాలు మీలోనే స్వర్గాన్నో, నరకాన్నో, సృష్టిస్తూ ఉంటాయి. అవి రెండింటినీ సృష్టించగలవు. మీరెక్కడన్నా ఉండండి. అవి మాత్రం స్వర్గాన్నో, నరకాన్నో సృష్టిస్తూనే ఉంటాయి.

మీ మనస్సు విచక్షణా జ్ఞానం ఎంతో గొప్పది. మీరు నరకాన్ని సృష్టించినప్పుడు అదీ మరీ బాధాకరమైనప్పుడు, మీరు దాన్ని కొంచెం వెనక్కు తిప్పుతారు. అట్లాగే అది స్వర్గాన్ని సృష్టించినప్పుడు అది మరీ సుఖదాయకమై మీరు వాస్తవంతో సంబంధాన్ని కోల్పోయినప్పుడు ఆ వాస్తవం మిమ్మల్ని పడగొడితే అప్పుడు కూడా మీరు దాన్ని కాస్త వెనక్కు తిప్పుతారు. కాని మీరు శరీరాన్ని కోల్పోయినప్పుడు విచక్షణా సామర్థ్యాన్ని కూడా కోల్పోతారు. అప్పుడు స్వర్గాన్ని సృష్టించే ప్రక్రియలో ఉన్న మనస్సు దాన్ని సృష్టిస్తూ పోతుంది. కొన్ని లక్షల రెట్ల ఆనందాన్ని సృష్టిస్తుంది. అట్లాగే నరకాన్ని సృష్టిస్తున్న మనస్సు నరకాన్నే సృష్టిస్తూ వెళ్లి లక్షల రెట్ల దుఃఖాన్ని సృష్టిస్తుంది. ఎందుకంటే మీ విచక్షణ, అధికమైందనుకున్నప్పుడు వెనక్కు తిప్పే సామర్థ్యం ఇక అక్కడ ఉండదు కాబట్టి.


ఒక సంపూర్ణ స్థాయి స్వర్గాన్నో, నరకాన్నో నిర్మించగలిగిన సామాగ్రి ఎప్పుడూ మీ చుట్టూ వేలాడుతూనే ఉంటుంది. మీ శక్తులు పనిచేసే తీరులోనే అది ఉంటుంది. మీ విచక్షణ ప్రకారం మీరు నడచుకున్నట్లయితే మీ తీర్పు ఇలా ఉంటుంది. ''నరకాన్ని నాశనం చేస్తాను, స్వర్గాన్ని ఉంచుకుంటాను''. కాని అలా ఎన్నటికీ జరగదు. ఎందుకంటే వాటి నిర్మాణ సామగ్రి ఒక్కటే. అవే గదులు. కొందరికవి ఆనందపు గదులు. మరికొందరికి చిత్రహింసాశాలలు. అవి ఏక్షణంలోనైనా ఇటుదటు, అటుదిటు కావచ్చు. అదొక విద్యుద్దీపపు మీట వంటిది. మీకు రెండు రంగుల దీపాలు ఒకటి తెలుపు. మరొకటి నీలం ఉన్నట్లయితే మీరు నీలపు రంగు దీపాలు వెలిగిస్తే ఒకరకమైన అనుభూతి కలుగుతుంది. తర్వాత మీరు తెల్లరంగు దీపాలు వెలిగిస్తే వేరే చోట ఉన్న అనుభూతి కలుగుతుంది. కాని చీకట్లో మీరు దీపపు మీట వేయడానికి తడుముకుంటూ వెళితే తెల్లదీపం బదులు నీలపు దీపమూ, నీలపు దీపం బదులు తెల్లదీపమూ వెలిగించవచ్చు.

దీపాలు ఆర్పండి

ఎవరూ నరకాన్ని నాశనం చేసి స్వర్గాన్ని మాత్రమే ఉంచుకోలేరు. కాని మీరెల్లప్పుడూ ఆనందంగా ఉండవచ్చు. ఇది నరకం సంభవిస్తుందన్న భయం మీ మనస్సులో ఉండడం వల్ల కాదు. మీ విచక్షణ ప్రక్రియను శక్తిమంతం చేసుకోవడం ద్వారా, నరకం తన ద్వారాలు ఎప్పటికీ తెరవకుండా మీరు చూసుకోవచ్చు. ఎందుకంటే మీరు దానిపట్ల ఎరుకతో ఉంటారు కనుక. జాగరూకత ఉండే ఈ సామర్థ్యం ఒక స్థాయి వరకే. కాని మీరు స్వర్గాన్ని కాని, నరకాన్ని కాని నిర్మించే సామగ్రినంతటినీ తీసివేశారనుకోండి. అప్పుడు మీరు చీకట్లో ఉంటారు. తెల్ల దీపం కాని, నీలపు దీపం కాని ఉండే అవకాశం ఉండదు. కాంతి ఉన్నా లేకపోయినా తేడా లేని దిశకు మీరు తిరుగుతారు. కళ్లు తెరచి ఎక్కడికైనా వెళ్లాలనుకొనేవారికి వెలుగు అవసరం. కళ్లు మూసుకొని ఎక్కడో ఉండేవారికి వెలుగుతో ఏం పని? అతనికి వెలుగు ఇబ్బందికరం.

పెంకు పగలగొట్టడం

అందువల్ల అసత్యం నుండి సత్యానికి ప్రయాణించడం అంటే భౌగోళికమైన దూరాన్ని దాటడం కాదు. ఇదొక కోడి గుడ్డుపై పెంకు లాంటిది. ఇప్పుడు మీరు పెంకుకు వెలుపల ఉన్నారు. కాని మీరు లోపలికి పోవాలనుకుంటే గుడ్డుపై టక్ టక్ టక్ అని కొడతారు. గుడ్డు పగిలినప్పుడు లోపలికి వెళ్ళవచ్చుననుకుంటారు. కాని, కోడిపిల్లలు బయటికి వస్తాయి. అదీ జరిగేది. లోపలికి వెళ్లాలనుకొని మీరిక్కడ కూర్చున్నారు. మీరు దాన్ని పగలగొట్టినప్పుడు ఎవ్వరూ లోపలికి వెళ్లరు. కాని పూర్తిగా కొత్త సంభావ్యత బయటికి వస్తుంది. అందుకే యోగాలో సహస్రార చక్రం ప్రతీకను వాడతారు. వేయి రేకుల పుష్పం బయటికి వస్తుంది. మీరు పెంకును పగల గొట్టినప్పుడు మీరె న్నడూ సంభావ్యమని ఊహించనిదేదో బయటికి వస్తుంది.




మీరీ పెంకును పగలగొట్టదలచుకుంటే మీ అంతట మీరా పని చేయలేరు. ఎందుకంటే ఆ పెంకు మీరే. మిమ్మల్ని మీరెలా పగలగొట్టుకుం ? మీకింకా అటువంటి ధైర్యం లేదు. మీ మనస్సు చెప్పవచ్చు. ''ఔను పగలగొడదాం. ఒక కోడిపిల్ల బయటికి వస్తుంది'' లేదు. మిమ్మల్ని మీరు పగలగొట్టుకొనే ధైర్యమెప్పటికీ మీకుండదు.

అందుకే వెలుపలి నుండి మీకొక సుత్తి కావాలి. దీన్నే సాధారణంగా కృప అంటారు. అది మీ వైపు లాగబడేటట్లు మీరు మిమ్మల్ని తయారుచేసుకోవాలి. పిల్లవాడికి పన్ను ఊడేటప్పటి స్థితిలా ఉంటుందిది. వాడంటాడు, ''దాన్ని ముట్టుకోవద్దు, దాన్ని ముట్టుకోవద్దు'' తండ్రి అంటాడు.

''నన్ను చూడనీ, నన్ను చూడనీ'' టక్కున పన్ను ఊడి నీ చేతి లోకి వస్తుంది. పన్ను ఊడి వచ్చేసినందుకు పిల్లవాడు మహా సంతోషపడిపోతాడు. పన్ను ఊడినప్పటి బాల్య స్మృతి మీకిం కా ఉందా? నొప్పి పోతుంది. ఖాళీ జాగా ఏర్పడిన అనుభూతి. మీరు దాంతో ఎన్నో రోజులు ఆడుకుని ఉంటారు. కాని దాన్ని మీ అంతట మీరు పీకే సాహసం చెయ్యరు. అందువల్ల మనం కేవలం ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నాం. సాధన చేసేది కేవలం దాని గురించే - మీరు నోరు తెరవడానికి.

- సద్గురు జగ్గీ వాసుదేవ్

భగవద్గీత



యజ్ఞం లేకుండా ఆనందం లేదు

అధ్యాయం 4

శ్లోకం 31:

యజ్ఞశిష్టామృతభుజో
యాంతి బ్రహ్మ సనాతనమ్।
నాయం లోకోస్త్యయజ్ఞస్య
కుతోన్యః కురుసత్తమ ॥

తాత్పర్యం: ఓ కురువంశ శ్రేష్ఠుడా! యజ్ఞాన్ని నిర్వహింపకుండా ఎవ్వరును ఈ లోకమున గాని, జన్మమునగాని ఆనందంగా జీవింపలేరు. అటువంటపుడు తరువాతి జన్మాన్ని గూర్చి వేరుగా ఏమి చెప్పగలం.

భాష్యం: ఈ భౌతిక జగత్తులో మన దుస్థితికి కారణం, మన సహజమైన వైకుంఠ స్థితిని మరచిపోవటమే. ఆ అజ్ఞానము వలన జీవి పాపాలు చేస్తాడు. ఆ విధంగా భౌతిక జీవనం కొనసాగుతూ ఉంటుంది. కాబట్టి వేదాలు మనమీ జన్మ మృత్యు చక్రము నుండి బయట పడుటకు అవకాశము ఇస్తున్నాయి. ధర్మాన్ని ఆచరించటం ద్వారా మనకు కావలసిన అర్థాన్ని పొందవచ్చును. దానిని ధర్మబద్ధంగా కామానికి వాడుకొన్నట్లయితే, పవిత్రులై ఈ భౌతిక జీవితం నుండి ముక్తుల వ్వాలనే కోరికతో మోక్ష పథాన్ని అనుసరించే అవకాశం ఉంది. మరి అటువంటి వేదవాక్కులను ధిక్కరించి యజ్ఞాలను నిర్వహించకపోతే ఆనందంగా ఎలా ఉండగలం? భౌతిక ఆనందంలో అనేక తరగతులు ఉన్నాయి. వాటన్నిటినీ మించినది భగవద్ధామం చేరుట వలన వచ్చేది. కాబట్టి భగవద్భక్తే భౌతిక సమస్యలన్నిటికీ తగిన సమాధానం.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: తేలికగా మోసపోయే ప్రమాదాలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించాలి. ఖర్చులు నియంత్రించగలుగుతారు. శుభ వార్తలు వింటారు. ఒత్తిడులు తగ్గుతాయి. రాజకీయ వ్యవహారాలు అనుకూలం. ఆర్థిక అభివృద్ధి ఉంటుంది.

వృషభ రాశి: మానసిక ధైర్యం పెరుగుతుంది. అభివృద్ధి ప్రారంభమవుతుంది. సంభాషణలు రుచిస్తాయి. విదేశీ లావాదేవీలు అనుకూలం. ఆర్థిక ఆకస్మిక ఖర్చులు ఉన్నా ఆదాయం కూడా వెన్నంటి ఉంటుంది.

మిథున రాశి: ఖర్చులు పెరుగుతాయి. సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. రాజకీయ అనుకూలత ఉంటుంది. ఆర్థిక విషయాల్లో ఆశాజనకమయిన వాతావరణం ఉంటుంది. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు.

కర్కాటక రాశి: శత్రుభీతి తగ్గుతుంది. ఆర్థిక విజయాలు సాధించగలుగుతారు. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కుటుంబ విషయాల్లో అలజడులు సద్దుమణుగుతాయి. విద్యాప్రయత్నాలు ఫలిస్తాయి.

సింహ రాశి: నూతన కార్యక్రమాలు ప్రారంభించగలుగుతారు. ఉద్యోగ కార్యాలలో అనుకూల పరిస్థితులు ఉంటాయి. అసహన పరిస్థితులు తగ్గుతాయి. నత్తనడక కార్యక్రమాల ద్వారా పరిష్కారాలు పొందగలుగుతారు. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. శ్రమ తగ్గుతుంది.

కన్యా రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ధైర్య సాహసాలతో కూడిన నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం అధికం అయినప్పటికీ ఆదాయం కూడా సమాంతరంగా ఉంటుంది. ఉద్యోగ విషయాల్లో ప్రతిభ గుర్తింపబడుతుంది. కుటుంబ చిక్కులకు పరిష్కారాలు లభిస్తాయి.

తులా రాశి: బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించగలుగుతారు. ఆరోగ్య విషయంలో అనుకూలత పెరుగుతుంది. అలసత్వం తగ్గుతుంది. అనుకూల సంఘటనలు కొనసాగుతాయి. శారీరక శ్రమ తగ్గుతుంది. అంతిమ విజయాలు సాధించగలుగుతారు.

వృశ్చిక రాశి: మానసిక ధైర్యం పెరుగుతుంది. వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. కుటుంబ సఖ్యత పెరుగుతుంది. వ్యాపార కలహాలు తగ్గుతాయి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు.

ధనూ రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. సంబంధ బాంధవ్యాలు లాభిస్తాయి. ఒడిదుడుకులను తట్టుకోగలుగుతారు. గృహంలో ప్రతికూల పరిస్థితులు తగ్గుతాయి.

మకర రాశి: కుటుంబ రీత్యా పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అనవసర విషయాల్లో తలదూర్చడం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించాలి. అభివృద్ధి వ్యాపారపరంగా ఉంటుంది.

కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్ళు సంతృప్తిని కలిగిస్తాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. సంతోషవార్తలు వింటారు. స్త్రీలకు శుభ పరిణామాలు ఉంటాయి. ఆకస్మిక ఆరోగ్య ఆందోళన ఉంటుంది. విజయాలు అన్ని రంగాల వారికి దగ్గరవుతాయి. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి.

మీన రాశి: ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. సంభాషణల ద్వారా ఇతరులను ఆకట్టుకోగలుగుతారు. శత్రుభీతి తగ్గుతుంది. కోర్టు సంబంధిత విషయాల్లో విజయాలు సాధించగలుగుతారు.

21.8.2017, సోమవారం

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకుంటాయి. గృహ విషయాల్లో చిరు ఇబ్బందులు ఏర్పడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుం ది. ఆదాయంలో మార్గాలు సులభతరం.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు,ప్రక్రియలు అనుకూలం.ఆధ్యాత్మిక కార్యాలు,ఆర్థిక లావాదేవీలు ఉపకరిస్తాయి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి.ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: విద్యాప్రయత్నాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. గృహ విషయాలు అనుకూలం. కుటుంబ వ్యవహారాల్లో,ఆరోగ్యంలో శ్రద్ధ తప్పనిసరి. కోర్టు వ్యవహారాల్లో విజయాలు సాధించగలుగుతారు. ఆర్థిక విషయాల్లో సమస్యలను అధిగమించగలుగుతారు.

కర్కాటక రాశి: గృహసంబంధిత కార్యాలు,కార్యక్రమాలు అనుకూలం. వ్యాపార లావాదేవీలు కలసి వస్తాయి. దూర ప్రయాణాలు లాభిస్తాయి. ఆనందకర పరిస్థితులు కొనసాగుతాయి. శత్రుభీతి పోతుంది. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ వత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పని సరి. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు, సంభాషణలు అనుకూలం. వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. స్థిరాస్తి ప్రతికూల పరిస్థితులు ఇంకా కొనసాగుతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ తప్పని సరి. వ్యాపారంలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్ళు వంటివి లాభిస్తాయి. విద్యాప్రయత్నాలు అనుకూలం. విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. గృహవిషయాల్లో ప్రోత్సాహం ఉంటుంది. విద్యా విషయాల్లో మెరుగైన పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ఉద్యోగ ప్రతిబంధకాలు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో అనుకూల పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తుంది. వ్యాపార ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: వ్యాపార నిర్ణయాలలో ప్రతికూలత ఉంటుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోలేక పోతారు. ఆరోగ్యంలో ప్రతికూలత ఉంటుంది. గతంలోని పొరపాట్ల ద్వారా విమర్శలు కొనసాగుతాయి.

మకర రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్య రక్షణ ఉంటుంది. వ్యాపార ప్రతిబంధకాలు తొలగిపోతాయి. అసహన పరిస్థితులు ఆర్థికంగా కనుమరుగవుతాయి. గృహవిషయాల్లో శుభప్రయత్నాలు లాభిస్తాయి. పొరపాట్లు అనుకూలంగా మారతాయి. ఆదాయం సులభతరం.

కుంభ రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు చేకూరుతాయి. శుభ ప్రయత్నాలకు నడుం బిగించగలుగుతారు. గతంలోని సంఘర్షణకు స్వస్తి చెప్పగలుగుతారు. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి. ఖర్చులు ఆకస్మికం .


మీన రాశి: మానసిక ధైర్యం పెరుగుతుంది. ఉద్యోగ వ్యవహారాల్లో ప్రోత్సాహం ఉంటుంది. ఆలోచన సంపత్తి పెరుగుతుంది. ఆరోగ్య అనుకూలత ఉంటుంది. చిరు సమస్యలు ఆర్థికంగా కొనసాగుతాయి. విద్యావిషయాల్లో ఆటంకాలు ఉన్నా నెట్టుకు రాగలుగుతారు. కోర్టు వ్యవహారాల్లో ఆందోళనలు ఉంటాయి.



శ్రీ మాకల సూర్యనారాయణ
9949579697



సంస్కృతి



వేదకాలంలో జనజీవనంలో సాంఘీక పరిస్థితులను పరిశీలించినప్పుడు ఒక కట్టుబాటుతో నడుచుకునేవారని విశదమవుతుంది. వారు ఏర్పాటు చేసుకున్న నియమాల ప్రకారం ధర్మాలను నిర్వర్తిస్తూ జీవించేవారు. ఋగ్వేదం ఉన్నత ప్రమాణాలున్న సాంఘీక వ్యవస్థను సూచిస్తుంది. కుటుంబవ్యవస్థలో సర్వసాధారణంగా ఏకపత్నీ వ్రతం ఉండేది. అయితే రాచరిక కుటుంబాల విషయంలో బహుపత్నీత్వం అక్కడక్కడ కనిపించేది. వివాహాన్ని పవిత్రబంధంగా పరిగణించేవారు.

వేదకాలంలో ఆర్యుల జీవనం


హైందవార్యులలో వితంతువులు తమకు సంతానం లేకపోతే మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు. హిందువుల అంత్యక్రియలకు ఒక బిడ్డ అవసరమనే విషయాన్ని ఋగ్వేదం గుర్తించింది. కనుక వితంతువులైనా మళ్లీ వివాహం చేసుకుంటే అది దోషం కాదని ఆర్యహిందువులు నమ్మేవారు. వివాహ సమయంలో వరకట్నం సర్వసాధారణంగా ఉండేది. అయితే కొన్ని సందర్భాలలో వరుడు కొంత ధనాన్ని ఇచ్చి వధువును కొనుక్కునే ఆచారముండేది. బాలికలకు వివాహాలు నిర్దుష్ట సమయంలో చేయాలనే నిబంధనలు ఏవి ఉండేవి కావు.

కొందరు బాలికలు తండ్రి, సోదరుల సంరక్షణలో పెరిగేవారు, వివాహం అయిన వెంటనే వధువును వరుని ఇంటికి తీసుకొచ్చే ఆచారం ఉండేది. వధువు కొత్తగా అత్తవారింటికి రాగానే ఆమెకు ఎనలేని గౌరవ మర్యాదలుండేవి. కార్యాలను నిర్వర్తించేటప్పుడు, మత సంబంధమైన కర్మలను నిర్వర్తించేటప్పుడు భర్తతో పాటు భార్య కూడా పాలుపంచుకోవడం ఉండేది. ఇలాంటి కార్యాల నిర్వహణలో భర్త వెంట భార్య లేకపోతే వాటికి ఫలితం ఉండదని నమ్మేవారు. వేదకాలంలో బాల్యవివాహాలు లేవు. వరుని నిర్ణయించే టప్పుడు తండ్రి చూపించిన వరుణ్ణే వధువు వివాహం చేసుకోవాలి. అయితే వరుని నిర్ణయించుకోవడంలో కొంత స్వేచ్ఛ లేకపోలేదు. తన సంతానాన్ని అదుపు ఆజ్ఞలలో ఉంచుకోవడానికి తండ్రికి సంపూర్ణ అధికారముంది. తన కుమారుడు జూదరి అయినందున కళ్లు పెరికివేసిన తండ్రి గురించిన విషయమొకటి ఋగ్వేదంలో కనిపిస్తుంది. అంతటి అధికారం తండ్రులకుండేది. బిడ్డల వివాహం విషయంలో తండ్రి ప్రమేయం విధిగా ఉండేది. సాధారణంగా కుటుంబ పెద్దగా తండ్రి వ్యవహరించేవాడు. తండ్రి బ్రతికినంతకాలం ఆస్తిపాస్తులకు అతడే యజమాని. చరాస్తులైన పశుసంపద, గుర్రాలు, బంగారం వంటి వాటిపై వ్యక్తిగత యాజమాన్య గుర్తింపు ఉండేది. దత్తత స్వీకారం అనేది వేదకాలంలోనే గుర్తింపబడింది. తండ్రికి మగసంతానం లేకపోతే కుమార్తె కొడుకు(మనవడు)కి చెందుతాయి గాని నేరుగా కుమార్తెకు చెందవు.

వైదికార్యులు వస్త్రాలను మూడు భాగాలుగా ధరించేవారు. ఒక వస్త్రాన్ని శరీర దిగువ భాగంలో ధరించేవారు. ఒక వస్త్రాన్ని శరీర మధ్యభాగంలో ధరించేవారు. మరోదాన్ని శరీరంపై భాగంలో ధరించేవారు. చాలామంది ఆర్యులు వివిధ రంగులున్న వస్త్రాలను గాని, బంగారు తీగలున్న వస్త్రాలనుగాని ధరించేవారు. స్త్రీ పురుషులిరువురు వివిధ రకాల ఆభరణాలను ధరించేవారు. స్త్రీలు తలలు దువ్వుక ని జడలు అల్లుకునేవారు. పురుషులు వెంట్రుకలను నాలుగు జడలుగా వేసుకునేవారు. వైదికార్యులకు గడ్డాలు పెంచుకొనే అలవాటు కూడా ఉండేది.

'శ్లోకాలలలో రాళ్ల మీద కత్తులను సానబట్టినట్టు ఉంది. కాబట్టి కేశాలను తొలగించుకోవడానికి కత్తులను ఉపయోగించేవారు. మంగలి వ్యక్తిని 'వప్తుడు' అని వ్యవహరించేవారని" పండితులంటారు.

ఆర్యులు పాలు దాని నుంచి లభ్యమయ్యే ఇతర తినుబండారాలను ముఖ్యమైన ఆహారంగా తీసుకునేవారు. ధాన్యాన్ని పాలతో కలిపి వండి తినేవారు. వైదికార్యులు బియ్యంతో చేసిన రొట్టెలు, యవలు, మొదలైన వంటకాలను నేతితో కలిపి తినేవారు. బలి ఇచ్చిన మేకలు, గొర్రెల మాంసాన్ని కూడా స్వీకరించేవారు. గోవును పరమ పవిత్రంగా భావించి గోవధ చేయడాన్ని నేరంగా పరిగణించేవారు. సోమ,



సురపానాన్ని విరివిగా ఉపయోగించేవారు. "ఋగ్వేదం తొమ్మిదవ మండలమంతా సోమరసాన్ని గురించి వివరణ విస్తారంగా ఉంది కాబట్టి దానిని విచ్చలవిడిగా వాడేవారని చెప్పవచ్చంటారు" పండితులు. రథాల పందేలు, గుర్రపు పందేలు, సంగీత నాట్యాదులు, పాచికలాట అనేవి ముఖ్య వినోదాలుగా ఉండేవి. జూదంలో ధనాన్ని పందెం కట్టి కుటుంబాలు కుటుంబాలే సర్వనాశనమయ్యేవి. చేతితో తాళం వేస్తూ శ్రుతి కలిపి పాడే సంగీతానికి అనుగుణంగా స్త్రీ, పురుషులిరువురు నాట్యం చేసేవారు. సంగీత సాధనకోసం నగారా, దుందుభి, కార్కరి రకాలైన వీణలు, వేణువు మొదలైన వాద్యాలను ఉపయోగించేవారు.

వైదికార్యులు స్థిరనివాసాలు ఏర్పరుచుకొని జీవించేవారు. కొయ్యలు అమర్చిన ఇళ్లు నిర్మించుకొనేవారు. గడ్డితో ఉన్న పై కప్పులతో కుటీరాలు ఏర్పాటు చేసుకొనేవారు.

పటిష్టమైన స్థలంమీద గుండ్రంగా స్తంభాలను పాతి ఇంటిపైభాగం పెద్దగా ఉండేవిధంగా గదికి మూలవాసాలు వేసి వాటిమీద పొడవైన వెదురుబొంగులను అమర్చేవారు. ఇంటి పరిమాణాన్ని బట్టి మూలగుంజలమీద పొడవైన గుంజలను అమర్చేవారు. ఇంటిగోడకు ఉండే సందులను చిన్న మోపులుగా కట్టిన గడ్డితోగాని, రెల్లుతోగాని (దడిలేక తడిక) పూరించేవారు మొత్తం మీద ఖాళీభాగాలను కొంతమేరకు ఏదోవిధంగా నింపేవారు. తక్కిన భాగాలను కమ్ములు లేదా గడియలు, కొయ్యమేకులు, తాళ్ళు, తోలుపట్టాలు మొదలైన వాటితో బంధించేవారు.

ఋగ్వేదకాలంలో ఆర్యులు ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడేవారు. కోడెలు, ఎద్దుల సహాయంతో వ్యవసాయం చేసేవారు. దున్నిన పొలాన్ని 'ఉద్వార'మనిగాని క్షేత్రమనిగాని వ్యవహరించేవారు. ఎనిమిది లేదా పన్నెండు ఎడ్ల జతలనుగాని నాగలికి కట్టేవారు. చిన్నచిన్న కాలవలు చేసుకొని వాటి ద్వారా నీటిని పారించి పొలాలను తడుపుకునేవారు. సంవత్సరానికి రెండు పంటలు పండించుకోవడం ద్వారా లోటు లేకుండా జీవించేవారు. విందు వినోదాలతో ఉల్లాసంగా జీవించేవారు. సందర్భాలను బట్టి యజ్ఞయాగాదులు నిర్వహించేవారు. ఆయా సందర్భాలలో బలులివ్వడంసర్వసా ధారణంగా ఉండేది. వేదకాలంలో ఆర్యజీవనం ఇలా ఉండేది.

- నియోగి
553097319

పెరియకోక్ నృత్యమంటే?

ఆదివాసీలు ప్రతిసందర్భంలోనూ నృత్యం ఒక సంప్రదాయంగా పాటించడం జరుగుతుంది. గిరిజనులు నివసించే ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క రకమైన నృత్యరీతులు కనిపిస్తాయి. గోదావరి తీర ప్రాంతంలో నివసించే గిరిజనులు




'కొమ్ము నృత్యం' చేయడం కనిపిస్తుంది. ఈ నృత్యం చేసే కోయలు వారి భాషలో దీనిని పెరియకోక్ ఆట అంటారు. కోయభాషలో పెరియకోక్ అంటే దున్నపోతు కొమ్ములు అని అర్థం. దున్నపోతు కొమ్ములు ధరించి దున్నలు కుమ్ముకునే రీతిలో నృత్యం చేస్తారు. కాబట్టి ఈ నృత్యాన్ని కొమ్ము నృత్యంగా వ్యవహరించబడుతున్నది. వీరు ఉపయోగించే వాద్యం 'డోలు కొయ్య'. చైత్రమాసంలో భూదేవి పండుగను ఘనంగా చేసుకుంటారు. ఈపండుగ సమయంలో పురుషులు అడవులలోకి వేటకు వెళ్లడం పరిపాటి. వేట ముగించుకొని విజయవంతంగా ఇంటికి చేరుకున్న సందర్భంగా కోయలు దున్నపోతు కొమ్ములు, నెమలి ఈకల గుత్తి పొదిగిన బుట్టను తలపై అలంకరించుకొని రంగురంగుల బట్టలు వేసుకొని ఆయా సంప్రదాయ వాద్యాల్ని వాయిస్తూ చేసే నృత్యం ఈ కొమ్ము నృత్యం.

తెలంగాణ కళా రూపం ఒగ్గుకథ

బుర్రకథ, జముకుల కథ, ఒగ్గుకథ...ప్రాథమికంగా ఈ మూడూ ఒకేరకమైన కళారూపాలే. కాకపోతే కొద్దిగా తేడాలున్నాయి.

మూడింటిలోనూ ఒక కథకుడు కథ చెబుతుంటే ఇద్దరు వంత పాటగాళ్లు అతని సహకారం అందిస్తుంటారు. ఢమరుకానికే ఒగ్గు, జెగ్గు, జగ్గు అనే పేర్లున్నాయి. ఒగ్గుకథ చెప్పేవారే ఢమరుకం వాయిస్తూ కథ చెబుతుంటారు. కాబట్టి దీనికి ఒగ్గు కథ అని పేరొచ్చింది. తెలంగాణా ప్రాంతానికి చెందినదీ కళ. శైవ మతానికి సంబంధించిక కథలు వీరెక్కువగా చెబుతుంటారు.

తెలంగాణా ప్రాంతంలో ఈ నాటికీ ఈ కళ సజీవంగానే వుంది. కురమ కులానికి చెందినవారే ఈ కథను చెబుతుంటారు. శివుని చెమట నుంచి జన్మించిన బీరప్ప, మల్లన్నలు వీరి కులదేవతలు. బీరప్ప, మల్లన్న, వీరభద్రుల జన్మవృత్తాంతమే వీరి కథాంశం.



ఇంతకు ముందు చెప్పినట్టుగా ఒగ్గుకథను ఇద్దరు వంత పాటగాళ్లు, ఒక కథకుడు చెబుతారు. బుర్రకథ, జముకుల కథలో వలె కాకుండా వీరికి కనీసం 15మందితో ఒక బృందం ఉంటుంది. అయితే కొన్నికథలలో కనీసం అయిదుగురు సభ్యులుంటారు. ప్రధాన కథకుడు, అతని సహాయకుడు వేదిక ముందు భాగంలో నిలబడగా, ముగ్గురు వంత పాటగాళ్లు వారి వెనుక నిలబడి ఉంటారు. వీరు డోలు కొడుతూ కథ ఆలపిస్తుంటారు. సహాయకుడు అతనికి సహకారం అందిస్తాడు. స్త్రీ వేషం ధరించవలసిన సమయాలలో ప్రధాన కథకుడే ఆ పాత్రధారణ చేస్తాడు. ప్రధాన కథకుడి చేతిలో ఢమరుకం ఉంటుంది. చాలా పరిమితంగానే ఆయన దానిని మ్రోగి స్తాడు. మిగిలిన వాయిద్యాలు ఆద్యంతం వినియోగిస్తారు.

ఒగ్గుకథను మహంకాళిని ప్రార్థించడంతో మొదలుపెడతారు. హిందూ సంప్రదాయానుసారం గణపతిని ప్రార్థించక కాళికను కొలవడం గమనార్హం. అలాగని గణపతి ప్రార్థనను వీరు పూర్తిగా వదలి వేయలేదు. అమ్మవారిని ప్రార్థించిన తర్వాత గణపతిని స్తుతించి, శారద అమ్మవారిని మొక్కి కథకుడు వేలి అందెలు పట్టుకుని కథ ప్రారంభిస్తాడు. వంత పాటగాడు గొర్రెల కాపరివలె ఉంటాడు. కురుమ కులానికి చెందిన



వారు ఆదిలో గొర్రెల కాపరులే. దానిని సూచిస్తుందీ వేషం.

ఒగ్గుకథలో ఢమరుకంతో పాటు ఒగ్గుడాలు కూడా ప్రధాన వాయిద్యంగా వాడతారు. దాదాపు మద్దెల వలె ఉండే ఈవాయిద్యాన్ని ఇత్తడితో, మద్దెలలో వాడే చర్మం స్థానంలో కేవలం మేకచర్మాన్ని మాత్రమే వినియోగిస్తారు. మిగిలినదంతా మద్దలె వలె వుంటుంది. ఒగ్గుడోలు కురుమలకి మంగళ వాయిద్యం కూడా. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో నేటికీ ఈ ఒగ్గుడోలును కురమలు, జాతరలు, వివాహాది క్రతువుల సందర్భంగా వాడుతూనే వున్నారు. ఒగ్గుకథను ప్రారంభించే సమయంలో తప్పనిసరిగా దీనిని వాయిస్తారు. ఒగ్గుడోలును వాయించిన తర్వాతే కథ ప్రారంభమవుతుంది.

వరంగల్‌జిల్లాకు చెందిన చుక్క సత్యయ్య ఒగ్గుకథకునిగా పేరు తెచ్చుకున్నారు. ఈనాటికీ ఆయన శిష్యరత్నాలు ఆంధ్రదేశంలో ఒగ్గుకథ గానామృతాన్ని ప్రజల శ్రవణేంద్రియాలకు చేర్చి తరిస్తున్నారు.

- ఉన్నం వెంకటేశ్వర్లు
8919479134

అడవి బిడ్డల గౌరవచిహ్నం తిరుగుడు కోళ్ల మంచం

మనమంతా ఎంత అభివృద్ధి మేడలు నిర్మించినా అది అంత సంప్రదాయాల పునాదిపైనే అన్నది నిజం. మనం మన సంప్రదాయాలు ఎంతగా పాటిస్తే అంతగా ఎదగగలం. భారతపౌరులుగా మన సంస్కృతి సంప్రదాయాలు రక్షించి పాటించే బాధ్యత మన అందరిమీదా ఉంది.

శ్రమైక సౌందర్యానికి వారసులైన గిరిజనులు ప్రకృతిని పరిరక్షకులేగాక సంస్కృతి సంప్రదాయాలను ఆచరించే ఆదర్శజీవులు కూడా! ఆధునిక సౌకర్యాలు అందుబాటులో లేకపోయిన వారు నివసించే కొండకోన ల్లోనే కావల్సిన సౌకర్యాలు సమకూర్చుకుని సంతృప్తికర జీవనం సాగిస్తున్న వీరు, తరతరాలుగా తమ పెద్దలు పాటించిన సాంప్రదాయాలనే నేటికీ ఆధునికతను కలుపుకుని కొనసాగించడం పట్టణవాసులకు నమ్మలేని నిండు నిజం. తమ కన్నా వయసులో పెద్దవారైన కుటుంబ సభ్యులనే కాదు బంధువర్గాన్ని కూడా ఆదరించి గౌరవించడం వారి సహజగుణం. అందులో భాగంగానే తమకన్నా పెద్దల ముందు కూర్చోరు పడుకోరు. ముఖ్యంగా వరసైన అత్త-మామ, బావ-వదినల ఎదురుగ ఎట్టి పరిస్థితుల్లో కూర్చోరు. పడుకోరు. అది వారి సాంప్రదాయం. సాధారణంగా గిరిజనుల ఇళ్లల్లో కూర్చోవడానికి పడుకోవడానికి వేరువేరు ఉపకరణాలుండవు. అన్నింటికీ కర్రతో చేసిన నాలుగుకోళ్ల నులకమంచాలె వాడతారు. కూర్చోడానికి చిన్నచిన్న పట్టెట మంచాలను ఉపయోగిస్తారు. ఇటీవల నులక స్థానంలో నవ్వారును ఉపయోగిస్తున్నారు. నాలుగుకోళ్ల సాధారణ మంచాల స్థానంలో మిషన్లుతో పట్టెడపట్టిన "పట్టెడ నవ్వారు మంచాలు" ఉపయోగిస్తున్నారు. గతంలో కోపిరి అనే గడ్డిని నులకతాడుగా పేని మంచాలు అల్లేవారు. ఇక గిరిజనులు తమ ఆచారం ప్రకారం తమకు వరసైన పెద్దల ముందు కూర్చోరు పడుకోరు. ఒకవేళ అలా చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి వస్తే మంచాన్ని తలక్రిందులుగా వేసి దానిమీద కూర్చోడం గాని పడుకోవడం గాని చేస్తారు. దీన్నే "తిరుగుడుకోళ్ల మంచం" అంటారు. ఇలాంటి పరిస్థితులు తరచూ రావడం అలాగే ఇంట్లో కోడళ్లు వుంటే వారికి ప్రత్యేకంగా రెండువైపులా కోళ్లు వుండే ప్రత్యేకమైన మంచాలు చేయించుకుని వాటిని అదేపేరుతో పిలుస్తున్నారు. గిరిజనుల ఇళ్లల్లో మనుషుల సంఖ్యకి తగ్గ మంచాలు వుండవు. వీరు నిద్రపోవడానికి విశ్రాంతి తీసుకోవడానికి చిన్నచిన్న బడ్డీల వంటి పందిళ్లు, కర్రలతో తయారుచేసుకుంటారు. ఎత్తైన పందిరివంటి మంచాలుతో పాటు చెట్ల కొమ్మల మధ్య పడకలు, ఏర్పాట్లు



చేసుకుంటారు. వీళ్లు ఎక్కువగా ఒంటరిగా కాక సామూహికంగా నిద్రపోతుంటారు. గిరిజనులకు మంచం ఒక పవిత్ర పరికరమే! ఎందుకంటే వీరు ప్రసవ సమయంలోను, నెలసరి, సమయంలోను మంచం తాకరు. ఆసమయంలో కటిక నేలమీదనే పడుకుంటారు. అడవిబిడ్డలకు నులకమంచాలకు విడదీయరాని అవినాభావ సంబంధం వుంది. వీరు చనిపోయినవారి మృతదేహాన్ని "మంచం" మీదే స్మశానం వరకు మోసుకు వెళ్తారు. పెళ్లి అయిన వారు చనిపోతే కాల్చడం, కాని వారిని పూడ్చడం వీరికి ఆనవాయితీ. ఇలా ఎంత ఎదిగిన తమ సాంప్రదాయాలు నేటికీ వదలక ఆచరిస్తున్న అడవి బిడ్డలు సంస్కృతి పరిరక్షకులుగా అందరికీ ఆదర్శం.

- డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
సెల్ నెం. 7729883223

నేను లోకల్ తర్వాత ఎంసిఏ


సాయి పల్లవి

వరుస విజయాలు నమోదు చేస్తున్న హీరో నాని నటిస్తున్న కొత్త చిత్రం ఎంసిఏ. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. ఫిదా చిత్రం ద్వారా తెలుగువారి మనసు దోచుకున్న నాయిక సాయి పల్లవి ఈ చిత్రంలో నానితో జోడీ కడుతోంది. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ మా సంస్థలో నాని నటించిన నేను లోకల్ చిత్రం మంచి విజయం సాధించింది. ఇప్పుడు ఎంసిఏ చిత్రం తెరకెక్కుతోంది. అద్భుతమైన కథ, అన్నీ సమ పాళ్ళలో మిళితమైన అంశాలున్నాయి. దేవిశ్రీప్ర సాద్ సంగీతం అందించారు. సీనియర్ నటి భూమిక ఇందులో కీలక పాత్ర పోషి స్తున్నారు. ఈ చిత్రం అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. ప్ర స్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. డిసెంబర్ 21న సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు.


నాని

నాని, సాయిపల్లవి, భూమిక, విజయ్, నరేష్, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంభాషణలు మామిడాల తిరుపతి, శ్రీకాంత్ విస్సా, ఛాయాగ్రహణం సమీర్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం శ్రీరామ్ వేణు.

కేసీఆర్ పాత్రలో నవాజుద్దీన్ సిద్ధిఖీ...



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కేసీఆర్ పాత్ర కోసం బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ ఎంపికైనట్లు సమాచారం. రాజ్ కందుకూరి నిర్మాణంలో దర్శకుడు మధురా శ్రీధర్ రెడ్డి కేసీఆర్ బయోపిక్ రూపొందిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి పాత్రలో నటించేందుకు సరిపోయే నటుడి కోసం వెతుకుతున్నారు. గతంలో రాజ్‌కుమార్ రావ్ లాంటి కొందరు హిందీ నటులు పేర్లు పరిశీలనకు వచ్చాయి. అయితే కేసీఆర్ పోలికలకు దగ్గరగా ఉన్న నవాజుద్దీన్ ...పాత్రకు సరిపోతారని దర్శకుడు భావించారు. సినిమా విషయమైన ఆయనను సంప్రదించారు. కేసీఆర్ పాత్రలో నటించేందుకు నవాజుద్దీన్ సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక అంగీకారం తెలిపారు. ఇప్పటికే ఆయన కేసీఆర్ హావభావాలు, శైలిని తెలుసుకునేందుకు వీడియోలు గమనిస్తున్నారట. ఇటీవల తన సినిమా 'బాబూ మోషాయ్ బంధూక్ బాజ్' ప్రచారం కోసం హైదరాబాద్ వచ్చారు నవాజుద్దీన్. ఇక్కడ కేసీఆర్ గురించి తెలుసుకుని...పాత్ర పోషణపై మరింత ఆసక్తి పెంచుకున్నారు. ఇటు కేసీఆర్‌కు కూడా నవాజుద్దీన్ సిద్ధికీ ప్రధాన పాత్రలో నటిస్తారనే విషయం తెలియజేయనున్నారు. ఆయన అంగీకారం పొందిన అనంతరం ఈ విషయాన్ని దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. బాలీవుడ్‌లో ప్రతిభ గల నటుడిగా నవాజుద్దీన్ సిద్ధిఖీకి పేరుంది. 'సర్ఫరోష్', 'బ్లాక్ ఫ్రైడే', 'తలాష్', 'కహానీ' లాంటి చిత్రాలతో ఉత్తమ నటుడు అనిపించుకున్నారు.



2ఫ్రెండ్స్ ప్రేమకథ

సానియా



ప్రేమ, స్నేహం నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం '2 ఫ్రెండ్స్' (ట్రూ లవ్). శ్రీనివాస్ జి.ఎల్.బి. శ్రీనివాస్ దర్శకత్వంలో ముళ్ళగూరు లక్ష్మీదేవి సమర్పణలో అనంతలక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్‌నాయుడు నిర్మిస్తున్నారు. సూరజ్ హీరోగా నటిస్తుండగా రవీంద్రతేజ, సానియా, స్నిగ్ధ, కార్తీక్, సారా, ధన్ రాజ్ తదితరులు నటిస్తున్నారు.

ఇప్పటికే వరంగల్, బెంగళూరు, అనంతపురంలో మేజర్ షూటింగ్ చేశారు. రెండు పాటల చిత్రీకరణ సైతం జరిగింది.

తాజాగా కర్నాటకలోని మడకశిర లొకేషన్‌లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను చిత్రీకరించారు. ఇప్పటికే మూడు షెడ్యూల్స్ చిత్రీకరణ జరిగింది. ఈనెలాఖరు నుండి జరిగే తదుపరి షెడ్యూల్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది దర్శకుడు జి.ఎల్.బి. శ్రీనివాస్ తెలిపారు. నిర్మాత అందిస్తున్న సహకారం వల్ల వేగంగా చిత్రీకరణ జరుగుతోందని చెప్పారు.

నేడు యువత ఎన్నో అద్భుతాలు సృష్టిస్తోంది. కాలేజ్ రోజుల్లోనే యువతకు భవిష్యత్తు నిర్దేశకత్వం అవుతుంది. ప్రేమకంటే స్నేహం గొప్పదనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోందని" నిర్మాత ముళ్ళగూరు అనంతరాముడు చెప్పారు. మా సంస్థలో ఇది తొలిచిత్రం. కేవలం వినోదమే కాకుండా అంతర్లీనంగా యువతకు సందేశం ఇచ్చే విధంగా ఉంటుంది. యూనిట్ అంతా సహకారం అందిస్తున్నారు" అని ఆయన తెలిపారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: టి.సురేందర్‌రెడ్డి, కథ, మాటలు, సంగీతం: పోలూర్ ఘటికాచలం. నిర్మాతలు: ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్‌నాయుడు, రచన, సంగీతం: ఘటికాలం స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జి.ఎల్.బి. శ్రీనివాస్.

సంగీతం దర్శకుడి అభిరుచికి ప్రతిరూపం..


అనూప్ రూబెన్స్

సంగీత దర్శకుడిగా జోరు తగ్గినా...మంచి సినిమాలు ఎంచుకుంటూ తన పేరు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు అనూప్ రూబెన్స్. ఆయన స్వరపర్చిన కొత్త చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి' ఇటీవలే విడుదలై విజయాన్నందుకుంది. ఈ చిత్రంలోని పాటల గురించి, సినిమా విజయం గురించి అనూప్ తన స్పందన తెలిపారు. అనూప్ మాట్లాడు తూ...'దర్శకుడి తరహాను బట్టే ఓ చిత్రానికి సంగీతం కుదురుతుంది. దర్శకుడు తేజతో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఆయన శైలి నాకు తెలుసు. అందువల్ల ఈ చిత్రానికి సంగీతాన్ని అందించడం సులువైంది. తొలిసారి పొలిటికల్ థ్రిల్లర్ కథకు స్వరాలు అందించాను. కథ నాకు బాగా నచ్చింది. మంచి పాటలు చేయాలని నిర్ణయించుకున్నాను. గతంలో తేజతో సావిత్రి అనే సినిమా చేయాలి. ఆ సినిమా మొదలవలేదు. దాంతో ఆ చిత్రం కోసం చేసిన రెండు పాటలను ఇందులో పెట్టుకున్నాం. నేపథ్య సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఏడు పాటలున్నా...ప్రేక్షకులకు విసుగు రాదు. కథలోనే అలాంటి అవకాశం ఉంది. ప్రస్తుతం బాలకృష్ణ 'పైసా వసూల్' చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నాను. ఆయనతో ఓ పాట పాడించాను. అఖిల్ సినిమాకు స్వరాలు అందిస్తున్నా. అఖిల్ చిత్రానికీ స్వరాలు ఇస్తున్నాను. ఇందులో అఖిల్ పాట పాడాను. దాన్ని త్వరలో విడుదల చేస్తాం. కొత్తవాళ్లు, అనుభవం గల దర్శకులు ఎవరితో పనిచేసినా సవాలుగానే ఉంటుంది. కొత్తవాళ్లు కొత్త ఆలోచనలతో వస్తున్నారు. దాంతో మేము కూడా వాళ్లకు తగినట్లు వినూత్నమైన సంగీతాన్ని ఇస్తున్నాం. నాకు వ్యక్తిగతంగా కొత్త దర్శకులతో పనిచేయడం ఇష్టం ఉంటుంది. వాయిద్య పరికరాలు కూడా కొత్తవి మారుస్తుంటాను.' అన్నారు.

హింసా మార్గం ఎంచుకున్న నాయకుడు



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఒక్కడు మిగి లాడు'. ఉగ్రవాద సంస్థ ఎల్‌టీటీఈ అధిపతి ప్రభాకరన్ పాత్రను ఈ చిత్రం లో మనోజ్ పోషిస్తున్నాడు. అనీషా ఆంబ్రోస్ నాయికగా నటిస్తోంది. పద్మజ ఫిలింస్ ఇండియా పతాకంపై ఎస్ఎన్ రెడ్డి - లక్ష్మీకాంత్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్ ఆండ్రూస్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ఒక్కడు మిగిలాడు' ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్ర మాలు జరుపుకుంటోంది. సెప్టెంబర్ 8న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నారు. 'ఒక్కడు మిగిలాడు' ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. మంచు లక్ష్మి ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడు తూ...'ట్రైలర్ చాలా సార్లు చూశాను. మనోజ్ నటనలో నాకు స్ఫూర్తినిస్తుంటాడు. ప్రతి సినిమాలో కొత్తగా కనిపించాలని ప్రయత్నిస్తుంటాడు. జీవిత కథను సినిమాగా తెరకెక్కిం చేప్పుడు చాలా కష్టపడాలి. దర్శకుడు అజయ్‌లో ఆ పట్టుదల ఉంది. నిర్మాతల అభిరుచి కనిపిస్తోంది.' అన్నారు. దర్శకుడు అజయ్ ఆండ్రూస్ మాట్లాడుతూ...'కుటుంబాన్ని నడిపించే పెద్ద విఫలమైతే కుటుంబం పాడవుతుంది. అలాగే దేశాధినేత, రాష్ట్రాధినేతలు తప్పుదారిలో వెడితే సమాజం ఇబ్బందుల పాలవుతుంది. ఆ ప్రభావం ఎలా ఉంటుందనేది ఈ కథ. హింస , అహింసను సందర్భాన్ని బట్టి చూడాలి. మనింట్లోకి వచ్చి ఎవరైనా దౌర్జన్యం చేస్తే..అప్పుడు చూపించే ప్రతిఘటన హింస అవదు. సామాన్యుడు అణగదొక్కబడినప్పుడు నాయకుడు పుడతాడు. అతను ఏ మార్గం ఎంచుకున్నాడన్నది అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుంది. ఇప్పటిదాకా తెరపై రాని కథ ఇది. ఏడాదిన్నరగా సినిమా కోసం కష్టపడ్డాం.' అన్నారు. మనోజ్ మాట్లాడుతూ...'ఈ సినిమాలో రెండు భిన్నమైన పాత్రల్లో నటించాను. నేను ఈ కథను నడిపించగలను అని నమ్మిన దర్శకుడికి కృతజ్ఞతలు. ఎంతోమంది సహకారంతో చిత్రం రూపొందింది. మిమ్మల్ని ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నా.' అన్నారు. మిలింద్ గునాజీ, పోసాని, సుహాసినీ, సూర్య, బెనర్జీ, జెన్నిఫర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళ - పిఎస్ వర్మ, సినిమాటోగ్రాఫర్ - వి కోదండ రామరాజు, ఎడిటర్ - కార్తీక శ్రీనివాస్, స్క్రీన్‌ప్లే - గోపీ మోహన్, సంగీతం - శివ నందిగామ.

బ్రేకప్ తర్వాత నయనతారతో


నయనతార, శింబు

నయనతార, శింబు ప్రేమకథ గురించి అందరికీ తెలిసిందే. వీరి ప్రేమకు మధ్యలోనే బ్రేకప్ పడింది. ఇద్దరూ విడిపోయారు. ఇక కలవరు అనుకున్న వీరిద్దరు కలిసి జంటగా నటించడం విశేషం. తమిళంలో ఇదు నమ్మ ఆళు పేరుతో విడుదలై విజయం సాధించిన చిత్రంలో నయనతార, శింపు జంటగా నటించారు. ఇంకా ఇందులో ఆండ్రియా, ఆదాశర్మ కూడా నాయికలుగా నటించారు. తెలుగులో సరసుడు పేరుతో అనువదిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే నెల 8న రిలీజ్ చేస్తున్నారు. సరసుడు చిత్రాన్ని శింబు సినీ ఆర్ట్స్ సంస్థ నిర్మించింది. నయనతార, శింబు మధ్య వచ్చే రొమాంటిక్ సన్నివేశాలు సహజత్వంగా ఉంటాయి. ఈ చిత్రం తమిళంలో సుమారు 27 కోట్లు వసూలు చేసి, శింబు కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది.

హీరో శింబు మాట్లాడుతూ నా గత చిత్రాలు వల్లభ, మన్మథ కంటే సరసుడు ఘన విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాను. మా లవ్ బ్రేకప్ అయిన తర్వాత నయనతార నేను కలిసి నటించిన చిత్రమిది. నా సోదరుడు కురళ్ అరసన్ సంగీతం అందించారు. ఇందులో సత్యం రాజేష్ పాత్ర ఆకట్టుకుంటుంది అన్నారు.

నిర్మాత టి.రాజేందర్ మాట్లాడుతూ తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం నిర్మించాం. తెలుగులో రిలీజ్ కొంత ఆలస్యం జరిగింది. సాఫ్ట్‌వేర్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథథ. సెప్టెంబర్ 8న సరసుడు చిత్రాన్ని విడుదల చేస్తున్నాం అని చెప్పారు.

మైథిలీ పాత్రలో కనిపిస్తా


రాధికా మల్హోత్రా

చంద్రకాంత్, రాధికా మల్హోత్రా జంటగా దర్శకుడు జి.గోవర్ధన్ రూపొందించిన చిత్రం 'ప్రేమ ఎంత మధురం, ప్రియురాలు అంత కఠినం'. థర్ట్ ఐ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ చివరి వారంలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నాయిక రాధికా మల్హోత్రా చిత్రంలో నటించిన అనుభవాలను తెలిపింది. ఆమె మాట్లాడుతూ...'మాది రాజస్థాన్. నాటక రంగం నుంచి వచ్చాను. చాలా చోట్ల నాటకాల ప్రదర్శనలు చేశాం. చదువుల కోసం అమెరికా వెళ్లాను. అక్కడ థియేటర్ ఫెస్టివల్స్‌లో భాగమయ్యాను. అప్పుడు చిత్ర కథానాయకుడు చంద్రకాంత్ చూసి నన్ను దర్శకుడికి పరిచయం చేశారు. అలా ఈ సినిమాలో అవకాశం వచ్చింది. మైథిలీ అనే పాత్రలో నటించాను. జీవితంలో ఏదైనా సాధించాలి, గొప్పగా బతకాలి అని కలలుగనే యువతి పాత్ర ఇది. అనుకున్నది సాధించేందుకు కష్టపడుతుంది. ఎన్ని కష్టాలైనా భరిస్తుంది. ఇలాంటి పాత్రతో తెరకు పరిచయం కావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో హారర్, సస్పెన్స్, లవ్, రొమాన్స్ కామెడీ అన్ని అంశాలుంటాయి. మీకు నచ్చుతాయని ఆశిస్తున్నాను. టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నప్పుడు తెలుగు సినిమా గురించి తెలుసుకోవాలని అనుకున్నాను. కొన్ని చిత్రాలు చూశాను. వాటిలో బొమ్మరిల్లు, ప్రేమ కథా చిత్రమ్ ఆకట్టుకున్నాయి. నాకు నాగార్జున, ప్రభాస్ నటన అంటే ఇష్టం. నాయికగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.' అని చెప్పింది.